



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 52 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శనివారం 3 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 52 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SAT 3 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## సోమనాథ ఆలయానికి రూ.5 కోట్ల విరాళం ఇచ్చిన ముఖేశ్ అంబానీ

- కుటుంబంతో కలిసి పరమేశ్వరుడిని దర్శించుకున్న రిలయన్స్ ఛైర్మన్
- ప్రత్యేక పూజలు చేసిన ముఖేశ్ అంబానీ కుటుంబం
- ప్రతి సంవత్సరం ఆరంభంలో దర్శించుకుంటున్న ముఖేశ్ కుటుంబం



హైదరాబాద్ పెన్ పవర్:రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముఖేశ్ అంబానీ గుజరాత్‌లోని సోమనాథ దేవాలయా

వివరాలు 2లో..

## శంషాబాద్‌లో కమ్ముకున్న పొగమంచు.. విశాఖ సహా 10 విమాన సర్వీసులు రద్దు

- శంషాబాద్ నుంచి వెళ్లాల్సిన విమానాలను రద్దు చేస్తూ డీజీసీఏ నిర్ణయం
- ముంబై, బెంగళూరు, కోయంబత్తూరు, కోల్‌కతా, కొచ్చి, వారణాసి, ఇండోర్, పాట్నా, గౌహతి విమానాలు రద్దు
- జాతీయ రహదారులపై దట్టమైన పొగ అలుముకోవడంతో ఢీకొన్న వాహనాలు



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రాష్ట్రంలో చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతోం ది. హైదరాబాద్ నగరంలో దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో శంషాబాద్‌లోని రాజీవ్

వివరాలు 2లో..

## ఇది ముమ్మాటికీ కుట్రే...

### సీఎం రేవంత్ రెడ్డిపై విరుచుకుపడిన హరీశ్ రావు


- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు
- నల్లమల సాగర్ విషయంలో ఏపీకి మేలు చేస్తున్నారని విమర్శలు
- ఉమ్మడి కమిటీ ఏర్పాటులో తెలంగాణకు నష్టం జరిగిందని వ్యాఖ్య
- టెండర్ ప్రక్రియ తర్వాతే సుప్రీంకోర్టుకు వెళ్లడంపై అనుమానాలు
- ఇది తెలంగాణకు చేసిన ద్రోహమేనని హరీశ్ రావు ఆరోపణ



హైదరాబాద్ పెన్ పవర్:నల్లమల సాగర్ ప్రాజెక్టు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు కుమ్మక్కై తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. బనకచర్ల ముప్పును ముందుగా పసిగట్టింది బీఆర్ఎస్ పార్టీయేనని, తాము 'ముల్లుకర్ర'తో కాదు 'బల్లెం'తో పొడిస్తే తప్ప ఈ ప్రభుత్వం నిద్రలేవలేదని ఆయన ధ్వజమెత్తారు. అనేక ప్రెస్ మీట్లు పెట్టి హెచ్చరించినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు.తమ పోరాటాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం ఏపీ, తెలంగాణతో సమావేశం

వివరాలు 2లో..

## ఏపీ, తెలంగాణ మధ్య నీటి పంచాయితీల కోసం ప్రత్యేక కమిటీ



- ఏపీ, తెలంగాణ మధ్య నదీ జలాల వివాదాల పరిష్కారానికి కేంద్రం కమిటీ
- సీడబ్ల్యూసీ ఛైర్మన్ నేతృత్వంలో పనిచేయనున్న నిపుణుల బృందం
- గతేడాది జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో దీనిపై నిర్ణయం
- కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-2 గడువును పొడిగించిన కేంద్రం
- పెండింగ్ ప్రాజెక్టులు, నీటి పంపిణీపై కమిటీ సమగ్ర అధ్యయనం

హైదరాబాద్ పెన్ పవర్:ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య దశాబ్దకాలంగా కొనసాగుతున్న కృష్ణా, గోదావరి నదీ జలాల వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఓ ఉన్నతస్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ఛైర్మన్ ఈ కమిటీకి అధ్యక్షత వహిస్తారు. కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల (కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ) ఛైర్మన్లు, జాతీయ జల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) చీఫ్ ఇంజినీర్‌తో పాటు ఇరు రాష్ట్రాల జలవనరుల

వివరాలు 2లో..



## మూసీ ప్రక్షాళన చర్చ సందర్భంగా.. అసెంబ్లీలో పరస్పర డైలాగ్ వార్..

## కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ లొల్లి..

- మూసీ ప్రక్షాళన చర్చ సందర్భంగా అసెంబ్లీలో డైలాగ్ వార్
- కాలి బూడిదయ్యేలాగా ప్రతిపక్షాలు విషపు కండ్లతో చూస్తున్నాయన్న రేవంత్
- మూసీ కంటే ముఖ్యమంత్రి మాటల కంపే ఎక్కువన్న హరీశ్ రావు
- సీఎంను విమర్శిస్తే మైక్ ఇవ్వసంటూ స్పీకర్ రిప్లై
- ఎవర్నీ వ్యక్తిగతంగా విమర్శించలే: శ్రీధరబాబు

హైదరాబాద్ పెన్ పవర్:మూసీ ప్రక్షాళన చర్చ సందర్భంగా అసెంబ్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యుల మధ్య డైలాగ్ వార్ నడిచింది..అసలేం జరిగిందంటే.. మూసీలో కాలుష్యం కంటే కొంతమంది కడుపులో విషమే ఎక్కవని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. కడుపులో విషం అంటూ సీఎం చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అభ్యంతరం తెలిపారు. కడుపులో విషమని బీఆర్ఎస్ నేతలను తిట్టడమేంటని ప్రశ్నించారు. వెంటనే కల్గజేసుకున్న మంత్రి శ్రీధర్ బాబు..సీఎం ఎవర్నీ వ్యక్తిగతంగా విమర్శించలేదన్నారు. అనంతరం మాట్లాడిన హరీశ్ రావు.. మూసీ కంటే ముఖ్యమం త్రి మాటల కంపే ఎక్కువని వ్యాఖ్యానించారు. సభలో తమ క్కులను కాలరాస్తున్నారని అన్నారు. సభలో కనీసం నిరసన తెలిపే హక్కు కూడా లేదా అని ప్రశ్నించారు. అయితే సీఎంపై హరీశ్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. లేదంటే రికార్డులను తొలగించాలన్నారు. సీఎం అంటే హరీశ్ రావుకు ఎందుకంత కడుపు మంట అని ప్రశ్నించారు. అనంతరం రైతుల యూరియా సమస్యపై బీఆర్ఎస్ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరించారు స్పీకర్. దీంతో బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

## కేసీఆర్‌కు దగ్గరగా ఉన్న నేతలను దూరం చేసేలా కవిత మాట్లాడుతున్నారు

- కవిత ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్నారా లేదా అనే విషయం వెల్లడించాలన్న మంత్రి
- కేసీఆర్‌ను విమర్శిస్తే స్పందించిన కవిత, హరీశ్ రావుపై విమర్శలకు స్పందించలేదని వ్యాఖ్య
- కేసీఆర్ వదిలిన రాజకీయ బాణంగా కవిత ఉన్నారన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



హైదరాబాద్ పెన్ పవర్:కవిత ప్రస్తుతం కేసీఆం ్కు సన్నిహితంగా ఉన్న బీఆర్ఎస్ నాయకులందరినీ దూరం చేసే ధోరణిలో మాట్లాడుతు న్నారని తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. కేసీఆర్ రోజూ అసెంబ్లీకి వస్తే బీఆర్ఎస్ పుంజుకుంటుందన్న కవిత వ్యాఖ్యలు ఆమె రాజకీయ భవిష్యత్తను ప్రశ్నార్థకం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీ లాబీల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కవిత ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో ఉన్నారో లేదో స్పష్టం

వివరాలు 2లో..

## కేసీఆర్ సభకు రాకపోతే బీఆర్ఎస్ పార్టీకి నష్టం

- కేసీఆర్, హరీశ్ రావులపై కవిత సంచలన వ్యాఖ్యలు
- కేసీఆర్ సభకు రాకపోవడం సరికాదన్న కవిత
- ఒక కూతురిగా తన రక్తం ఉడుకుతోందని వ్యాఖ్య
- హరీశ్ పైనా విమర్శలు చేసిన కవిత



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాల సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన కవిత, బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు రాకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. "సభకు కేసీఆర్ రావడం తప్పనిసరి. ఆయన రాకపోతే బీఆర్ఎస్ పార్టీకి నష్టం జరుగుతుంది. కేసీఆర్ తప్పు చేయకపోతే సభకు రావాలి. సభకు రాకుండా పిల్ల కాకుల గురించి మాట్లాడుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దు. ఒక కూతురిగా

వివరాలు 2లో..

## 2,000 చదరపు కిలోమీటర్ల విస్తరణ వెనుక హైదరాబాద్‌ను అలా చేసే కుట్ర ఉందా?

- హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేసే కుట్ర దాగి ఉందేమోనని ఆందోళన
- హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేస్తే ప్రజల నోట్లో మన్ను కొట్టినట్లేనని వ్యాఖ్య
- నగరాన్ని విస్తరించడం వెనుక కుట్ర దాగి ఉందా చెప్పాలని ప్రభుత్వానికి నిలదీత



హైదరాబాద్ పెన్ పవర్:హైదరాబాద్ నగరాన్ని 2,000 చదరపు కిలోమీటర్లకు విస్తరించడం వెనుక, ఈ నగరాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా చేసే కుట్ర దాగి ఉందా అనే భయం కలుగుతోందని బీఆర్ఎస్ శాసనమండలి సభ్యుడు దాసోజు శ్రవణ్ ఆందోళన వ్యక్తం చేశారు. మండలిలో ఆయన మాట్లాడుతూ, నాడు రాష్ట్ర విభజన సమయంలో

వివరాలు 2లో..

## తల్లిదండ్రులకు వాట్సాప్ లో హాల్ టిక్కెట్లు... ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం

- ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు
- హాల్ టిక్కెట్లు ముందే వాట్సాప్ చేస్తే తప్పులు సరిదిద్దే అవకాశముంటుందని వెల్లడి
- హాల్ టిక్కెట్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని తల్లిదండ్రులకు సూచన




హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ఇంటర్ విద్యార్థులకు సంబంధించి ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల హాల్ టిక్కెట్లను వారి తల్లిదండ్రులకు వాట్సాప్ ద్వారా పంపనున్నట్లు అధికారులు

వివరాలు 2లో..

## ఆర్థిక సంక్షోభం...

### ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చిన డొనాల్డ్ ట్రంప్

- ఇరాన్‌లో నిరసనకారుల పట్ల భద్రతా దళాలు వ్యవహరిస్తున్న తీరుపై ట్రంప్ ఆగ్రహం
- శాంతియుతంగా నిరసన చేపడుతున్న వారిపై కాల్పులు జరపవద్దన్న ట్రంప్
- వారిని లక్ష్యంగా చేసుకుంటే అమెరికా చూస్తూ ఊరుకోదని హెచ్చరిక
- ట్రంప్ జోక్యంపై తీవ్రంగా స్పందించిన ఇరాన్ సుప్రీం లీడర్ సీనియర్ సలహాదారు

వివరాలు 2లో..



## మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ...

### తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయిన కీలక నేత



- డీజీపీ ఎదుట లొంగిపోయిన మావే నేత బర్సే దేవా
- హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత మావోలకు భారీ ఎదురుదెబ్బ
- హిడ్మా, బర్సేలది ఒకే గ్రామం

హైదరాబాద్ పెన్ పవర్::ఇప్పటికే అనేక సమస్యలను ఎదుర్కొంటున్న మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. గత కొన్ని నెలలుగా ఎదుర్కొంటున్న సమస్యలు, ఎన్‌కౌంటర్లు,

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే

ప్రేమ స్వరూపిణి, భారతీయ సంఘ సంస్కర్త, రచయిత్రి, తొలి మహిళా ఉపాధ్యాయు రాలు, సమాజ విప్లవకారిణి, తొలి మహిళా ఉపాధ్యాయురాలు, తొలి బాలికల పాఠశాల వ్యవస్థాపకురాలు, కుల వ్యవస్థ వ్యతిరేకి, మహిళా హక్కుల పరిరక్షకురాలు, పేదల పక్షపాతి, ధైర్య కవచం ధరించిన ధీశాలి, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన సావిత్రిబాయి పూలే కులమతాలకు అతీతంగా సమానత్వ సాధనకు కృషి చేసిన మహోన్నత మహిళ. నిమ్నవర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన జ్యోతీరావ్ పూలే సహధర్మచారిణి అయిన సావిత్రిబాయి, తన భర్తతో కలిసి 01 జనవరి 1848 రోజు పూణెలో ప్రప్రథమంగా బాలికల పాఠశాలను ప్రారంభించిన ధీరవనిత. అస్పృశ్యులు, శూద్రులు, పితృస్వామ్యం, పురుషాధిక్య సమాజ పోకడలు, సకల జనుల హక్కుల ఉల్లంఘనలు, లింగ వివక్ష, కుల వ్యవస్థలకు వ్యతిరేకంగా గళమెత్తిన వీర సబల మహిళా శిరోమణి మన సావిత్రిబాయి పూలే. చీకటి యుగంలో సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సమ న్యాయాల సాధనకు కృషి చేసిన ధైర్య మహిళామణి మన సావిత్రిబాయి. 03 జనవరి 1831 రోజు మహారాష్ట్ర కాస్తారా జిల్లా నయాగావ్ గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన సావిత్రిబాయికి తెలంగాణలోని నిజామాబాదు, ఆదిలాబాదు జిల్లా ప్రాంతాల్లోకి మున్నూరుకాపు వర్గానికి చెందిన బంధువులు కూడా ఉండడం ఒక విశేషం. తన 9వ ఏటనే 13 ఏండ్ల జ్యాతిరావ్ పూలేను వివాహమాడిన సావిత్రిబాయి తన భర్తతో కలిసి నడిచి సంఘ సంస్కరణకు పూనుకున్నారు. ఉన్నత, అగ్ర వర్ణాలు వ్యతిరేకించినా వెరవకుండా, భౌతిక దాడులకను కూడా సహిస్తూ, బురద చల్లినా తుడుచుకుంటూ, అసభ్య పదజాల దూషణలను పెడచెవినపెట్టి తమ లక్ష్య సాధనకు జీవితాలను అంకితం చేసిన పుణ్య దంపతులు సావిత్రిబాయి జ్యోతిరావ్వ పూలేలు. నాటి బడుగు వర్గాల ప్రోత్సాహంతో తొలి బాలికల పాఠశాలను ప్రారంభించి మహిళా సాధికారతకు ఆనాడే బీజాలు వేసారు. తమకు సంతానం లేకపోయినా ఒక బ్రాహ్మణ వితంతువు కూమారుడైన యశ్వంతరావును దత్తత తీసుకున్నారు. ఆనాటి సమాజ కట్టుబాట్లు, బ్రాహ్మణ ఆధిక్య సంప్రదాయాలు, అగ్రవర్ణాల పెత్తనాల మధ్య 12 మే 1848 రోజు బహుజనులకు పాఠశాలను ప్రారంభించారు. ఎన్ని అవమానాలు ఎదులైనా మడమ తిప్పని ధైర్యశాలా మన సావిత్రిబాయి. తమ జీవితకాలంలో గ్రామీణ ప్రాంతాల్లో 52 వరకు పాఠశాలలు నెలకొల్పి బడుగుల బతుకుల్లో సరస్వతీ మాత అక్షర వెలుగులు ప్రసరింపజేశారు. తాము నమ్మారు విలువలకు కట్టుబడిన దంపతులు గృహ బహిష్కారానికి కూడా గురి అయ్యారు. సావిత్రిబాయి పూలే జన్మదినం రోజును తెలంగాణ ప్రభుత్వం "తెలంగాణ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం"గా నిర్వహించుకోవాలని నిర్ణయించడం సముచితంగా ఉన్నది. స్త్రీల అభ్యున్నతి కోరి 1952లో "మహిళా సేవా మండల్" అనే సంఘాన్ని ఏర్పాటు చేసిన సావిత్రి బాయి మహిళల హక్కుల పరిరక్షణకు అవిశ్రాంత పోరాటం చేశారు. మహిళా హక్కులే మానవ హక్కుల్ని నినదించిన మేటి వనిత మన సావిత్రి. అసత్య అగ్రవర్ణ దురహంకారాలకు వ్యతిరేకంగా 1873లో ఆధ్యాత్మిక పునాదులతో "సత్యశోధక్ సమాజ్" అనబడే సంఘాన్ని ప్రారంభించి బాల్య వివాహాలు, మేధ నమ్మకాలు, వితంతువుల శిరోముండనం, సతీసహగమనాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే, వితంతు పునర్వివాహాలకు పునాదులు వేసి తమ ఆత్మ సౌందర్యాన్ని రుజువు చేసుకున్నారు. వితంతువులకు ఆశ్రయం, పేద ఆడ పిల్లలకు అన్నం పెట్టడం, గర్భవతులకు పురుళ్లు పోయడం, పురోహితులు లేకుండా వివాహాలు చేయడం, కులాంతర వివాహాలు చేయడం, తల్లి వదిలేసి వెళ్లిన అనాథ శిశువును దత్తత తీసుకోవడం, అంటరానితనాన్ని రూపుమాపడం, కరువు సమయాల్లో వేల మంది బడుగు బలహీనవర్గాల ప్రజలను అక్కున చేర్చుకోవడం, తమ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేయడం లాంటి అసాధ్య లక్ష్యాలను సుసాధ్యం చేసింది మన మహా మహిళ సావిత్రిబాయి పూలే. 1954లో రచయిత్రిగా "కావ్యపూలే", 1891లో "పావన కాశీ సుభోధ్ రత్నాకర్" అనబడే కవితా సంపుటులను ప్రచురించిన సావిత్రిబాయి పూలే ఉపన్యాసాలను 1892లో పుస్తకరూపంలోకి తేవడం జరిగింది. 28 వనంబర్ 1890 రోజు భర్త జ్యోతీరావ్ పూలే మరణంతో అంతులేని దుఃఖాన్ని దిగమింగుతుంటూ దేశంలోనే తొలిసారి తన భర్త చితికి తానే స్వయంగా నిప్పు పెట్టి మరో అభ్యుదయ అధ్యాయానికి తెర తీసారు. 1897లో వచ్చిన ప్లేటు వ్యాధి సమయంలో తన కుమారుడితో కలిసి వ్యాధిగ్రస్థులకు సేవలు చేశారు. కరువు, ప్లేటు వ్యాధి రెచ్చిపోయిన సమయంలో జోలె పట్టి విరాళాల సేకరణ, వైద్య శిబిరాల నిర్వహణ, వేల నిరుపేదలకు బుక్కెడా బువ్వ పెట్టడం, ప్లేగు వ్యాధి బాధిత పిల్లలకు సేవలు చేస్తూ, అదే వ్యాధి బారినపడిన సావిత్రిబాయి 10 మార్చి 1897 రోజు తుది శ్వాస విడిచారు. మన ఏకైక శత్రువు అజ్ఞానమని, అన్ని సమస్యలకు ఔషధం విద్య అంటూ ప్రచారం చేసిన సావిత్రిబాయి "నిత్య చైతన్య జ్ఞాన జ్యోతి". 'ఆధునిక విద్యకు తల్లి (మదర్ ఆఫ్ మాడ్రన్ ఎడ్యుకేషన్)" మహిళా విముక్తిదాత, గొప్ప మానవతావాది, విప్లవకారిణి అయిన సావిత్రిబాయి పూలే సుసంపన్న జీవితం నేటి యువతరానికి దారి దీపం కావాలని ఆశిద్దాం, ఆమె మహోన్నత ఆశయాలను పూర్తి చేయడానికి అవిరళ కృషి చేద్దాం.

# ఇది ముమ్మాటికీ కుట్రే...

- మొదటి పేజి తరువాయి
ఏర్పాటు చేసిందని హరీశ్ రావు తెలిపారు. "మేము వద్దని ఎంతగా వారించినా రేవంత్ రెడ్డి ఢిల్లీ సమావేశానికి వెళ్లారు. బనకచర్ల అంశం ఎజెండాలో లేదని మొదట బుకాయించారు. కానీ, మేము ఎజెండాను బయటపెట్టి వాస్తవాలను బట్టబయలు చేశాం. ఆ తర్వాత ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా బనకచర్లపై చర్చ జరిగిందని, కమిటీ వేశారని చెప్పడంతో రేవంత్ రెడ్డి అబద్ధం బట్టబయలైంది" అని హరీశ్ వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాల్లో తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక వాటాను దెబ్బతీసేందుకు చంద్రబాబు కుట్ర పన్నారని ఆరోపించారు. 2025 జూలై 16న రేవంత్, చంద్రబాబు మధ్య కుదిరిన అంగీకారం ప్రకారమే నీటి వాటాల పంపిణీకి కేంద్ర జలశక్తి శాఖ కమిటీని ఖరారు చేసిందని హరీశ్ రావు పేర్కొన్నారు. "ఈ కమిటీ ఏర్పాటులోనూ తెలంగాణకు అన్యాయం జరిగింది. ఏపీ కమిటీలో ఇద్దరు ఐఏఎస్‌లు, ఇద్దరు అనుభవజ్ఞులైన ఇంజినీర్లు ఉంటే, తెలంగాణ కమిటీలో ముగ్గురు ఐఏఎస్‌లు, ఒక్క ఇంజినీరింగ్ అధికారినే నియమించారు. మన రాష్ట్రం తరఫున నీటిపారుదల రంగంలో అనుభవం లేని అధికారిని నియమించడం రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల్లో నీటి పంపకాలు పూర్తి చేయడమంటే.. నల్లమల సాగర్‌కు ఆమోదముద్ర వేయడమేనని, ఇది ఉద్దేశపూర్వకంగా ఏపీకి మేలు చేసే చర్యేనని విమర్శించారు. ఏపీ ప్రభుత్వం 2025 డిసెంబర్ 11న టెండర్లకు చివరి తేదీ ప్రకటిస్తే, తెలంగాణ ప్రభుత్వం గడువు ముగిసిన తర్వాత డిసెంబర్ 16న సుప్రీంకోర్టుకు వెళ్లడమే రేవంత్ రెడ్డి కుట్రకు నిదర్శనమని హరీశ్ రావు అన్నారు. "టెండర్ ప్రక్రియ మొదలైన వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే తెచ్చి ఉంటే, ఐబీసీ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు టెండర్ ఖరారయ్యేది కాదు. ప్రభుత్వం కావాలనే ఆలస్యం చేసి ప్రాజెక్టుకు పరోక్షంగా అంగీకారం తెలిపింది. ఇది ముమ్మాటికీ రేవంత్ రెడ్డి తెలంగాణకు చేసిన ద్రోహమే" అని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

## కేసీఆర్‌కు దగ్గరగా ఉన్న నేతలను దూరం చేసేలా కవిత మాట్లాడుతున్నారు

- మొదటి పేజి తరువాయి
చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కవిత చేసిన వ్యాఖ్యలను మంత్రి తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌పై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలకు కవిత వెంటనే స్పందించారని, కానీ హరీశ్ రావుపై చేసిన విమర్శలపై ఎందుకు మౌనంగా ఉన్నారో చెప్పాలని కోమటిరెడ్డి నిలదీశారు. ఇది చూస్తుంటే కవిత కేసీఆర్ వదిలిన రాజకీయ బాణంగా ఉన్నారని ఆరోపించారు. నల్గొండ జిల్లాకు కేసీఆర్ హయాంలో జరిగిన అన్యాయాన్ని కవిత ప్రశ్నించి ఉంటే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు.
పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పు చేసిందని కవిత స్వయంగా అంగీకరించడం హర్షణీయమని మంత్రి అన్నారు. బీఆర్ఎస్ నేతలు దోచుకున్నారని కవిత స్వయంగా ఆరోపిస్తున్నారని ఆయన గుర్తు చేశారు.

## ఏపీ, తెలంగాణ మధ్య నీటి పంచాయితీల కోసం ప్రత్యేక కమిటీ

- మొదటి పేజి తరువాయి
శాఖల ఉన్నతాధికారులు ఇందులో సభ్యులుగా ఉంటారు. గతేడాది జులైలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఈ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. ఆ సమావేశంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొని చర్చించారు. ఇటీవల డిసెంబర్‌లో తెలంగాణ ప్రభుత్వం తమ ప్రతినిధులను నామినేట్ చేయడంతో కమిటీ ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంది. ఇరు రాష్ట్రాల మధ్య నీటిని సమానంగా పంచడం, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, కొత్త ప్రతిపాదనలు వంటి కీలక అంశాలపై ఈ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేసి, పరిష్కార మార్గాలను సూచిస్తుంది. ఇదే సమయంలో, కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-2 (కేడబ్ల్యూడీటీ-2) గడువును కూడా కేంద్రం 2026 జులై వరకు పొడిగించింది.

## తల్లిదండ్రులకు వాట్సాప్ లో హాల్ టిక్కెట్లు... ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం

- మొదటి పేజి తరువాయి
ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. హాల్ టిక్కెట్లను వాట్సాప్ చేయడం ద్వారా వాటిలో ఏవైనా పొరపాట్లు ఉంటే పరీక్షలకు ముందే గుర్తించే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.
ఈ నేపథ్యంలో, పరీక్షలకు 2 నెలల ముందే తల్లిదండ్రులకు హాల్ టిక్కెట్లను వాట్సాప్ చేయనున్నట్లు వెల్లడించారు. చాలా మంది తల్లిదండ్రుల వద్ద స్మార్ట్ ఫోన్లు ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు హాల్ టిక్కెట్‌లో ముద్రించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఏమైనా తప్పులుంటే సంబంధిత కళాశాల ప్రిన్సిపల్‌కు తెలియజేయాలని ఇంటర్ బోర్డు సూచించింది. అలాగే హాల్ టిక్కెట్ నెంబర్, పరీక్ష కేంద్రం చిరునామా, ఏ రోజు ఏ పరీక్ష జరుగుతుందో తల్లిదండ్రులకు తెలియజెప్పడమే ప్రధాన ఉద్దేశమని పేర్కొంది.

## శంషాబాద్‌లో కమ్ముకున్న పొగమంచు.. విశాఖ సహా 10 విమాన సర్వీసులు రద్దు

- మొదటి పేజి తరువాయి
గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వెళ్లాల్సిన 10 విమానాలను రద్దు చేశారు. ప్రతికూల వాతావరణం కారణంగా విశాఖపట్నంతో పాటు ముంబై, బెంగళూరు, కోయంబత్తూరు, కోల్‌కతా, కొచ్చి, వారణాసి, ఇండోర్, పాట్నా, గౌహతి వెళ్లవలసిన విమాన సర్వీసులను రద్దు చేస్తూ డీజీసీఏ నిర్ణయం తీసుకుంది. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో రెండు మూడు రోజులుగా పొగమంచు కమ్ముకుంటోంది. ఈరోజు హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారులపై కూడా దట్టమైన పొగ మంచు అలుముకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పొగమంచు కారణంగా హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై పలు వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. శంషాబాద్ నుంచి సుమారు 10 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది.

## కేసీఆర్ సభకు రాకపోతే బీఆర్ఎస్ పార్టీకి నష్టం

- మొదటి పేజి తరువాయి
నా రక్తం ఉడుకుతోంది" అని కవిత చెప్పారు.
పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పక్కన పెట్టిన కేసీఆర్ ను ఉరి తీయాలన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై స్పందిస్తూ... కేసీఆర్ ను ఒకసారి ఉరి తీయాలంటే రేవంత్ రెడ్డిని 10 సార్లు ఉరితీయాలని అన్నారు. సొంత జిల్లా మహబూబ్ నగర్ కు రేవంత్ ఎన్ని ప్రాజెక్టులు తెచ్చారని ప్రశ్నించారు.
ఇదే సమయంలో హరీశ్ రావుపై మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయనకు ప్యాకేజీలు తీసుకోవడం తప్ప ఏమీ తెలియదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సభకు రాకపోతే అన్నీ హరీశ్ చూసుకోవడం సరికాదని... కేసీఆర్ సభకు రావాలని వ్యాఖ్యానించారు.

## మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ...

- మొదటి పేజి తరువాయి
నేతల ఆరోగ్య సమస్యలు, అంతర్గత గ్రూపు సమస్యలు ఇప్పటికే పార్టీని బలహీనపరి చాయి. ఈ సంక్షోభంలో మరో కీలక మావోయిస్టు నేత బర్సే దేవా ఈ రోజు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో పోలీసుల ఎదుట లొంగిపోయారు. బర్సే దేవా మావోయిస్టు గెరిల్లా లిబరేషన్ ఆర్మీ చీఫ్‌గా పనిచేస్తూ, పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్న నేత. ముఖ్యంగా ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కీలక నేత హిడ్మా మరణించిన తర్వాత, పార్టీకి అవసరమైన ఆయుధాలు, వ్యూహాలు, రక్షణ కార్యకలాపాలన్నింటిని బర్సే దేవా చూసుకుంటున్నారని పోలీసులు తెలిపారు. బర్సే దేవా, హిడ్మా ఒకే గ్రామానికి చెందినవారని, దీంతో మావోయిస్టు పార్టీలో ఆయన పాత్ర మరింత కీలకమని విశ్లేషకులు చెబుతున్నారు. పోలీసులకి లొంగిన తర్వాత, బర్సే దేవా దగ్గర మౌంటెన్ ఎల్ఎంజీని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆయన పర్యవేక్షించిన మిలిటరీ ఆపరేషనల్ కమాండ్ సభ్యులు కూడా పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ పరిణామంతో, మావోయిస్టు పార్టీకి కీలకంగా నిలిచిన నాయకత్వ వ్యవస్థలో పెద్ద గ్యాప్ ఏర్పడింది. రేపు బర్సే దేవాను మీడియా ముందు ఉంచి, ఆయన లొంగిపోవడంలో వచ్చే ప్రాముఖ్యత, స్వాధీనం చేసిన ఆయుధాల వివరాలు, మిలిటరీ ఆపరేషనల్ కమాండ్ సభ్యుల గురించి డీజీపీ శివధర్ రెడ్డి అధికారికంగా వివరించనున్నారు. ఈ సంఘటన తెలంగాణలోని మావోయిస్టు ఉద్యమానికి పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. గతంలో, అనేక మంది కీలక నేతలు ఎన్‌కౌంటర్‌లో మరణించడం, ఆరోగ్య సమస్యలు, పార్టీ అంతర్గత విభజనలు వంటి కారణాలతో ఇప్పటికే ఎంతోమంది సరెండర్ అయ్యారు. తాజాగా బర్సే దేవా కూడా పోలీసుల ఎదుట లొంగిపోయిన తరువాత, పార్టీ వ్యూహాలపై తీవ్ర ప్రభావం పడుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. మావోయిస్టు ఉద్యమం ఇప్పటి వరకు చూసుకున్న వ్యూహాలను సరిచూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది.

## 2,000 చదరపు కిలోమీటర్ల విస్తరణ వెనుక హైదరాబాద్‌ను అలా చేసే కుట్ర ఉందా?

- మొదటి పేజి తరువాయి
హైదరాబాద్ నగరాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా చేయాలని ఆంధ్రా పాలక వర్గం డిమాండ్ చేసిందని గుర్తు చేశారు.
హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేస్తే ఊరుకునేది లేదని ఆ రోజు కేసీఆర్ నాయకత్వంలో పోరాటం చేశామని తెలిపారు. అందుకే హైదరాబాద్ రాజధానిగా తెలంగాణ ఏర్పడిందని అన్నారు. కానీ ఈరోజు నగరాన్ని విస్తరించడం వెనుక ఏదైనా కుట్ర ఉందా అనే అనుమానం కలుగుతోందని అన్నారు.
దీనిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా చేస్తే తెలంగాణ ప్రజల నోట్లో మన్ను కొట్టినట్లేనని అన్నారు. రైతుబంధు, పెన్షన్లు సహా ఏ పథకం రావాలన్నా హైదరాబాద్ మనదిగా ఉండాలని అన్నారు. హైదరాబాద్ నగరం నుంచే తెలంగాణ బతుకుతోందని అన్నారు.

## ఆర్థిక సంక్షోభం...

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఇరాన్‌లో నిరసనకారులపై అక్కడి భద్రతా దళాలు వ్యవహరిస్తున్న తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన చేపడుతున్న వారిపై కాల్పులు జరపవద్దని, అలాంటి వారిని అమెరికా కాపాడుతుందని అన్నారు. శాంతియుతంగా ఆందోళన జరుపుతున్న వారిని లక్ష్యంగా చేసుకుంటే అమెరికా చూస్తూ ఊరుకోదని ఆయన అన్నారు. అమెరికా అన్నింటికీ సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. ట్రంప్ హెచ్చరికలను ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ సీనియర్ సలహాదారుడు అలీ లారిజాని తిప్పికొట్టారు. ఈ వ్యవహారంలో అమెరికా జోక్యం అవసరం లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. అమెరికా జోక్యం చేసుకుంటే ఆ ప్రాంతమంతా ఘర్షణలకు దారితీస్తుందని వ్యాఖ్యానించారు. తమ జాతీయ భద్రత రెడ్ లైన్ వంటిదని, దీనిని పరీక్షించాలనుకోవడం సాహసమే అవుతుందని అన్నారు.
దేశంలో ధరలు
పెరగడంతో పాటు కరెన్సీ విలువ పడిపోయింది. ఇరాన్ ఆర్థిక పరిస్థితి క్షీణించింది. దీంతో దేశంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. పలు ప్రాంతాల్లో నిరసనకారులు పోలీసుల కార్లకు నిప్పంటించారు. పలు ప్రాంతాల్లో భద్రతా దళాలు కాల్పులు జరపడంతో పలువురు ప్రాణాలు కోల్పోగా, అనేకమంది గాయపడ్డారు.

## సోమనాథ ఆలయానికి రూ.5 కోట్ల విరాళం ఇచ్చిన ముఖేశ్ అంబానీ

- మొదటి పేజి తరువాయి
నికి రూ.5 కోట్ల విరాళం అందజేశారు. ముఖేశ్ అంబానీ శుక్రవారం తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. అక్కడ జ్యోతిర్లింగ స్వరూపుడైన పరమేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖేశ్ అంబానీతో పాటు ఆయన భార్య నీతా అంబానీ, కుమారుడు అనంత్ అంబానీ కూడా సోమనాథ్ ఆలయాన్ని సందర్శించిన వారిలో ఉన్నారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ వారు ఆలయానికి చేరుకున్నారు. అంబానీ కుటుంబం ప్రతి సంవత్సరం ఆరంభంలో సోమనాథ్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేస్తోంది. గత సంవత్సరం కూడా వారు ఆ పరమేశ్వరుడిని దర్శించుకున్నారు.

# పేదలపై ప్రేమ ఉంటే కొంత ఖర్చును భరించలేరా?



**హైదరాబాద్ పెన్ పవర్:** "మంత్రి సీతక్క, పలువురు సభ్యులు ఉపాధి హామీ చట్టంపై మాట్లాడారు. పథకం పేరును మార్చినందుకా... 125 రోజుల పనిదినాలు కల్పిస్తున్నందుకా? వారి బాధేమిటో చెబితే బాగుండేది" అని భాజపా సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. అసెంబ్లీలో ఉపాధి హామీపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ... "దేశంలో అత్యధికంగా భాజపా పాలిత రాష్ట్రాలే ఉన్నాయి. రెండు, మూడు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలే ఆందోళన చెందుతున్నాయి. మహిళలకేమైనా ఉపాధిని తగ్గించారా... నిబంధనలన్నీ గతంలో మాదిరిగానే కొనసాగిస్తూ బలోపేతం చేస్తున్నందుకా బాధ? పథకం బడ్జెట్‌ను తగ్గించలేదు. గతంలో 90% నిధులను కేంద్రమే ఇచ్చేది. ఇప్పుడు రాష్ట్రాల భాగస్వామ్యమూ ఉంటే సమర్థంగా అమలవుతుందన్నదే ఆలోచన. రాష్ట్రాలు ఎందుకు కొంత భరించవు... మాకేం సంబంధం లేదంటే ఎలా? మంత్రి సీతక్క ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు.. అంబేద్కర్‌ను

- మిగతా 4లో...

# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

## 'టీచర్ల డిప్యుటేషన్ ప్రక్రియను పూర్తిచేయాలి'



**హైదరాబాద్ పెన్ పవర్:** గత ప్రభుత్వం జారీ చేసిన జీఓ 317లోని లోపాలను సరిదిద్దుతూ.. జీఓ 190ని జారీ చేశారని, అయితే పెండింగ్‌లో ఉన్న జీఓ 317 ఉపాధ్యాయుల డిప్యుటేషన్ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్(ఎస్‌టీఎఫ్) నేతలు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు, ప్రధాన కార్యదర్శి పోచయ్య తదితరులు ఆయనకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భట్టికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి.. శాలువాతో సత్కరించారు.





# డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు..

- మర్యాద పూర్వకంగా కలిసిన దుండిగల్ కాంగ్రెస్ నేతలు..
- దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ పాల్గొని, పార్టీ బలోపేతంపై చర్చించారు..

దుండిగల్, పెన్ పవర్, జనవరి 2:మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వజ్రేష్ యాదవ్‌ను దుండిగల్ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.. ఈ భేటీలో దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ పాల్గొని, పార్టీ బలోపేతం, స్థానిక సమస్యలు, రానున్న రాజకీయ కార్యక్రమాలపై చర్చించారు. ముఖ్యంగా దుండిగల్ ప్రాంత అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ తీసుకోవాల్సిన చర్యలపై నాయకులు తమ అభిప్రాయాలను డీసీసీ అధ్యక్షుడి దృష్టికి తీసుకువచ్చారు.

ఈ కార్యక్రమంలో 296వ డివిజన్ దుండిగల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, జక్కుల గోపాల్ యాదవ్, పండుగ శ్రీశైలం ముదిరాజ్, దొంతి మహేష్ ముదిరాజ్, శివ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. పార్టీపట్ల నిబద్ధతతో పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా వారు నిర్ణయించారు. డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ నాయకులను అభినందిస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని



డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్‌తో కావలి గణేష్..

- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా ఈ నిర్ణయం
- అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని నిర్ణయించినట్లు వెల్లడి
- బీఏసీలో తీసుకున్న నిర్ణయాలకు విరుద్ధంగా సభను నిర్వహిస్తున్నారని విమర్శ
- ముఖ్యమంత్రిని విమర్శించవద్దని చెప్పడమేమిటని స్పీకర్‌పై ఆగ్రహం

-4 లో





# ఈ అసెంబ్లీ సమావేశాలు మొత్తానికి బహిష్కరిస్తున్నాం

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకూడదని నిర్ణయించినట్లు ప్రకటించారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు. రేపటి సభకు కూడా బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎవరూ హాజరుకావొద్దని నిర్ణయించినట్లు వెల్లడించారాయన. మూసీ రివర్ డెవలప్ మెంట్ అంశంపై సభలో జరిగిన చర్చ తర్వాత.. వాకౌట్ చేశారు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు. సభను వాకౌట్ చేసి బయటకు వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడారు. సభలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు హరీశ్ రావు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన తర్వాత.. మైక్ ఇవ్వమని కోరినా.. స్పీకర్ ఇవ్వలేదని.. మా పార్టీ వాయిస్ వినిపించే అవకాశం లేనందుకు వాకౌట్ చేశామని చెప్పిన హరీశ్ రావు.. ఈ శీతాకాల సమావేశాల్లోనూ.. మిగతా రోజుల్లో జరిగే సభకు హాజరుకాకూడని నిర్ణయించినట్లు వెల్లడించారు హరీశ్ రావు.అసెంబ్లీ నుంచి బైకాట్ చేసిన బీఆర్ఎస్ గన్ పార్క్ లోని అమరవీరుల స్మారక స్థూపం వద్ద బైటాయించి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మాట్లాడిన హరీశ్ రావు. ప్రభుత్వం బీఏసీలో తీసుకున్న నిర్ణయాలను కూడా తప్పుదోవ పట్టించేలా చేస్తుందన్నారు. అడ్డగోలుగా గంటన్నర సమయం ముఖ్యమంత్రి టైంపాస్ చేశారని చెప్పారు. స్పీకర్ , ముఖ్యమంత్రి వ్యాఖ్యలను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. సభలో ముఖ్యమంత్రిని విమర్శించద్దంటే ఎలా అని ప్రశ్నించారు హరీశ్. రేపు (జనవరి 3)అసెంబ్లీని బహిష్కరించాలని బీఆర్ఎస్ నిర్ణయించిందన్నారు.కాంగ్రెస్ ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతుందన్నారు హరీశ్ రావు. ప్రజా స్వామ్య విలువలకు విరుద్ధంగా శాసన సభ జరుగుతుందని..అందుకే తాము శాసన సభను బాయ్ కట్ చేశామన్నారు. అసలు మూసీ మూసీ ప్రక్షాళన మొదలు పెట్టిందే తామన్నారు హరీశ్ రావు. తాము మూసి ప్రక్షాణలకు అడ్డు చెప్పడం లేదన్నారు. ప్రతి రోజు కెసిఆర్ చావు కోరుకుంటున్న

# మూసీకి మహర్దశ..రూపురేఖలు మార్చే బృహత్ ప్రణాళిక ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి

- మూసీ పునరుజ్జీవనానికి ప్రభుత్వ కార్యాచరణ.. మార్చి 31 డెడ్‌లైన్
- ప్రాజెక్టుకు ఏడీబీ రూ.4 వేల కోట్ల రుణం.. గోదావరి జలాల తరలింపు
- గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం
- బాపూఘాట్‌లో ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహం ఏర్పాటుకు ప్రణాళిక
- హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో అత్యంత కీలకమైన మూసీ నది పునరుజ్జీవనంపై తెలంగాణ ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. మార్చి 31వ తేదీలోగా ప్రాజెక్టు అంచనాలు పూర్తి చేసి, టెండర్లు పిలవడం ద్వారా అభివృద్ధి పనులను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా వెల్లడించారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఈ అంశంపై జోక్యం చేసుకున్న సీఎం, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ప్రభుత్వ విస్తృత లక్ష్యాలను, ప్రణాళికలను సభ్యులకు వివరించారు. ఈ బృహత్ ప్రాజెక్టు కోసం ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) రూ.4 వేల కోట్ల రుణం ఇచ్చేందుకు సూత్రప్రాయంగా అంగీకరించిందని, కేంద్రం నుంచి కూడా అవసరమైన



-4 లో

-4 లో



# ప్రజలతో సంప్రదింపులు జరిపాకే.. గ్రేటర్ విలీనం చేశాం

**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రేటర్ విలీనంపై తెలంగాణ అసెంబ్లీలో చర్చ జరిగింది. శుక్రవారం (జనవరి2) మంత్రి శ్రీధర్ బాబు గ్రేటర్ లో శివారు ప్రాంతాల విలీనంపై వివరించారు. ప్రజాస్వామిక పద్ధతిలోనే GHMC లో శివారు ప్రాంతాల విలీనం జరిగిందన్నారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతోనే విలీనం చేశామన్నారు. సుస్థిర అభివృద్ధి కోసమే సిటీకి చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలను గ్రేటర్ హైదరాబాద్ లో విలీనం చేశామన్నారు. GHMC లో శివారు ప్రాంతాలను విలీనం ఎలాంటి సంప్రదింపులు లేకుండా విలీనం చేశారని ప్రతిపక్షాలు విమర్శించగా .. మంత్రి శ్రీధర్ బాబు సమాధానం ఇచ్చారు. ప్రజాస్వామ్య పద్ధతిలోనే GHMC లో విలీనం చేశామన్నారు GHMC ని300 వార్డులుగా విభజించామన్నారు. విభజన సమయంలో 5వేల 935 ప్రజలనుంచి సూచనలు రాగా.. వాటిలో 1127 సూచనలను ఆమోదించామన్నారు. సరిహద్దుల మార్పుపై కూడా సూచనలు స్వీకరించామన్నారు. దాదాపు 27 శాతం ప్రజల

# మూసీకి మహర్దశ..రూపురేఖలు మార్చే బృహత్ ప్రణాళిక ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి

- 3 పేజి తరువాయి

అనుమతులు లభించాయని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రాజెక్టులో భాగంగా గోదావరి నుంచి 20 టీఎంసీల నీటిని తరలించి, అందులో 15 టీఎంసీలను నగర తాగునీటి అవసరాలకు, మిగిలిన 5 టీఎంసీలతో మూసీలో నిరంతరం శుద్ధమైన నీరు ప్రవహించేలా చూస్తామని స్పష్టం చేశారు.ప్రాజెక్టులో భాగంగా గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల పొడవున ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నట్లు సీఎం చెప్పారు. దీంతో పాటు, బాపూ ఘాట్ వద్ద మూసా–ఈసా నదుల సంగమ ప్రదేశంలో 'ఎ' ఆకారంలో 'గాంధీ సరోవర్' అభివృద్ధి చేస్తామన్నారు. ఇక్కడే ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ ఆలోచనగా వెల్లడించారు.మూసీ నది కాలుష్యం వల్ల పరివాహక ప్రాంతాల్లో పర్యావరణం, ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటున్నాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల వ్యర్థాలు, చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ ప్రాజెక్టును చేపడుతున్నామని స్పష్టం చేశారు. ఒకప్పుడు నిజాం హయాంలో మూసీ తీరంలో గొప్ప అభివృద్ధి జరిగిందని, 1908 వరదల తర్వాత ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ఇప్పుడు మూసీకి పూర్వవైభవం తీసుకువస్తామని అన్నారు. ప్రాజెక్టులో భాగంగా మంచిరేవుల వద్ద పురాతన శివాలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, మూసీ తీరంలో గురుద్వారా, మసీదు, చర్చి వంటివి నిర్మించి మతసామరస్యాన్ని చాటుతామని చెప్పారు. ప్రస్తుతం కన్సల్టెన్సీల ద్వారా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేస్తున్నామని, అది పూర్తయిన వెంటనే శాసనసభలో సభ్యుల ముందు ఉంచి, వారి సలహాలు తీసుకుని ముందుకు వెళ్తామని సీఎం హామీ ఇచ్చారు. మూసీ పరివాహక ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన నివాసాలు కల్పిస్తామని, హైదరాబాద్‌ను పర్యావరణ హిత నగరంగా, ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# ప్రజలతో సంప్రదింపులు జరిపాకే.. గ్రేటర్ విలీనం చేశాం

- 3 పేజి తరువాయి

సూచనలను పరిగణనలోకి తీసుకొని విభజించామన్నారు. 14ఏళ్లలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జనాభా రెండింతలు పెరిగింది..సిటీ పరిధిలోని తెల్లాపూర్ లో ఏడాదిలోనే జనాభా రెండింతలు పెరింగిందన్నారు.ఇక గ్రేటర్ లో శివారు ప్రాంతాల విలీనం ప్రతిపక్షాలు విమర్శలను తిప్పికొట్టారు మంత్రి శ్రీధర్ బాబు.విలీనంపై సంప్రదింపులు లేవన్నది అవాస్తవం.. GHMC జనరల్ బాడీ మీటింగ్ లో పెద్ద ఎత్తున చర్చ జరిగిందన్నారు. గత ఏడాది కాలంగా విలీనం ప్రక్రియ జరుగుతోంది.. ప్రజాస్వామ్య విధానంలోనే గ్రేటర్ విలీనం జరిగింది..సుస్థిర అభివృద్ధికి కోస మే గ్రేటర్ లో విలీనం చేశామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా విలీనం జరిగింది.. సాధారణ ప్రజలతో కూడా సంప్రదింపులు చేశామన్నారు. గ్రేటర్ పరిధిలోని ప్రజలకు సమాన సర్వీసులు అందిస్తామన్నారు. విలీనం నిర్ణయం శివారు ప్రాంతాలకు కూడా ఆర్థిక వనరులను అందిస్తుందన్నారు. మున్సిపల్ వ్యవస్థను పటిష్టం చేసే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు మంత్రి శ్రీధర్ బాబు.

## పేదలపై ప్రేమ ఉంటే కొంత ఖర్చును భరించలేరా?

-3 పేజి తరువాయి

ఓడగొట్టింది, మోసం చేసింది కాంగ్రెస్ కాదా? రాహుల్‌గాంధీ, సోనియాగాంధీలు గాంధీ వారసులు కాదు. రామరాజ్యం రావాలని ఆకాంక్షించిన మహాత్ముడి ఆశయాలకు అనుగుణంగానే ఈ పథకం పేరును వికసిత్ భారత్... జీ రామ్‌జీగా పేరు మార్చారు. పథకంలో జలభద్రతకు, పనికొచ్చే ఆస్తుల సృష్టికి ప్రాధాన్యమిస్తారు. ఒకవేళ 50 రోజులు మాత్రమే పనికల్పిస్తే... మిగిలిన 75 రోజులకు నిరుద్యోగ భృతి కల్పిస్తారు. 266 పనుల్లో ఏమీ మార్చడం లేదు. కాంగ్రెస్ చేసిన... ఎస్సీ, ఎస్టీ, బీసీ డిక్లరేషన్‌ల విషయం ఏమైంది? వారికిచ్చిన హామీలు ఏమయ్యాయి? ప్రజలను మభ్యపెట్టేందుకే కాంగ్రెస్ నేతలు ఇష్టారీతిగా మాట్లాడుతున్నారు" అని మండిపడ్డారు.

## ఈ అసెంబ్లీ సమావేశాలు మొత్తానికి బహిష్కరిస్తున్నాం

- 3 పేజి తరువాయి

సీఎం.. స్ట్రీట్ రౌడీ లాగ ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. సభలో అందరికి సమాన హక్కులు కల్పించాల్సిన స్పీకర్ ఏకపక్షంగా సభను నడుపుతున్నారని విమర్శించారు. == టాక్స్ పెట్టీ బిల్డర్స్ నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు హరీశ్ రావు. హైదరాబాద్ లో ఏ బిల్డింగ్ కట్టాలన్నా కాంగ్రెస్ పార్టీ కి టాక్స్ కట్టాలన్నారు. మరో వైపు కృష్ణా,గోదావరి జలాలపై చర్చ సందర్భంగా సెషన్స్ ను బీఆర్ఎస్ బైకాట్ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. నిజాలు బయటపడుతాయనే బీఆర్ఎస్ అసెంబ్లీ నుంచి బైకాట్ చేస్తుందని కాంగ్రెస్ కౌంటర్ ఇస్తోంది.

## ఏపి డిప్యూటీ సిఎం కొండగట్టు పర్యటన కొరకు పకడ్బందీ ఏర్పాట్లు

### ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల, పెన్ పవర్:**ఏపి డిప్యూటీ సిఎం కొండగట్టు పర్యటన కొరకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు.

శనివారం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కొండగట్టు పర్యటన సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు.

డిప్యూటీ సిఎం పర్యటన సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, సభా స్థల ఏర్పాట్లు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు.అనంతరం హెలిప్యాడ్, శిలాఫలకం మరియు గుడి ఆవరణ ప్రదేశంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు.

రేపటి పర్యటన నేపథ్యంలో కొడగట్టు ప్రాంతంలో ట్రాఫిక్ ఆంక్షలు, మరియు పోలీసు బందోబస్త్ ఉంటుందని తెలిపారు.

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

భక్తులు సంయమనం పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి.రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డి.ఆర్.డి.వో రఘువరన్, ఆర్ అండ్ బి ఈ.ఈ శ్రీనివాస్, డీఎస్పీ రఘు చందర్, ఆలయ ఈ.వో, ట్రైని డిప్యుటీ కలెక్టర్ హరిణి లతో పాటు సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత వారోత్సవ భాగం లో ఆర్ టీ సి డ్రైవర్లకు అవగాహనా కార్యక్రమం

**హైదరాబాద్ జనవరి. 2 పెన్ పవర్:** రోడ్డు భద్రత వారోత్స వం భాగం లో కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు ఏ సి పి ఆదేశాల తో బర్కతపురఆర్ టీ సి డిపో లో మేనేజర్ మంజులతో కలిసి డ్రైవర్ లకు రోడ్డు భద్రత పై ముఖ్య సూచనలు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసిన ఎస్ ఐ లు శ్రీకాంత్ ఆర్ ఎస్ ఐ తో పాటు రాకేష్ లు పాల్గొని డ్రైవర్లకు సూచనలు ఇచ్చారు.ముఖ్యం గా రోడ్డు పై కనురెప్పపాటున జరిగే ప్రమాదలను దృష్టిలో పెట్టుకుని, ప్రయాణికులను, కుటుంబ సభ్యులను అందరి గురించి ఆలోచించాలని కాగా బస్సు నడిపించే టప్పుడు సెల్ ఫోన్లో మాట్లాడవద్దని అన్నారు. అనంతరం డి ఏం మాట్లాడుతూ సంస్థ మనుగడ కోసం నిరంతరం శ్రామిస్తున్న కార్మికులు మీకుటుంబాలను, ప్రయాణికులభద్రతే మనకు ముఖ్యం అని అన్నారు. ఈ సదస్సు లో అధికారులు విజయ లక్ష్మి తో పాటు పలు వూరు డ్రైవర్లు, కండక్టర్లు, శ్రామికులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి ద్వంద్వ రాజకీయ వైఖరి

### ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### బిజెపి మాజీ ఎమ్మెల్యే డా.ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ మీడియా సమావేశం



వరంగల్ జనవరి 2
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ వైఖరి పూర్తిస్థాయిలో ద్వంద్వ వైఖరికి ప్రతీకగా మారిందని బిజెపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ తీవ్రంగా విమర్శించారు. ఒకవైపు కేసీఆర్ గారు శాసనసభకు రావాలని, ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలని పదేపదే కోరుతూనేడ మరోవైపు అదే కేసీఆర్‌పై దోపిడీ, అవినీతి, అక్రమాలు అంటూ తీవ్రమైన ఆరోపణలు చేస్తూ ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారు. అవినీతిపరుడిగా ఆరోపిస్తున్న వ్యక్తి సలహాలు ముఖ్యమంత్రికి ఎందుకు కావాలి అన్న ప్రశ్నకు రేవంత్ రెడ్డి స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ దగ్గర నుంచి రేవంత్ రెడ్డికి కావాల్సిన సలహాలు – దోచుకోవడంలోనా? దాచుకోవడంలోనా? లేక తెలంగాణ ప్రజల హక్కులను పణంగా పెట్టే పాలనా విధానాల్లోనా? అసలు ఈ సలహాలు పరిపాలన కోసం కావాలా... లేక రాజకీయ లావాదేవీలు, లోపాయికార ఒప్పందాల కోసమా అన్న అనుమానం ప్రజల్లో బలంగా నాటుకుపోయిందని పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారం ఒక రాజకీయ నాటకమేనని, దాని వెనుక కాంగ్రెస్‌బీఆర్ఎస్ మధ్య లోపాయికార ఒప్పందం, అవగాహన దాగి ఉందన్న విషయం ఇప్పుడు ఒక్కొక్కటిగా ప్రజలకు అర్థమవుతోందని ప్రభాకర్ అన్నారు. పరిపాలన పేరుతో రాజకీయ లావాదేవీలు, రహస్య ఒప్పందాలే ప్రధాన అజెండాగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తోందని విమర్శించారు.

**అవినీతి కేసులపై ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం – కాంగ్రెస్–బీఆర్ఎస్ కుమ్మక్కుకు నిదర్శనం**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి కేసులపై ప్రభుత్వ వైఖరి స్పష్టంగా అనుమానాలకు తావిస్తోందని ఎన్.వి.ఎస్.ఎస్. ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై విచారణను నీరుగార్చడం, ఫోన్ ట్యాపింగ్ కేసును కావాలని సాగదీయడం, ఫార్ములా ఈ–రేస్ అక్రమాలపై కాగ్, పీఏసీ నివేదికలు ఉన్నా ఒక్క చర్య కూడా తీసుకోకపోవడం.. ఇవన్నీ కాంగ్రెస్–బీఆర్ఎస్ పార్టీల మధ్య ఉన్న అంతర్గత ఒప్పందానికి స్పష్టమైన నిదర్శనాలని నిలదీశారు. భూముల అమ్మకాల విషయంలోనూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే విధానంతో వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అప్పనంగా అమ్ముకుంటున్నాయి. ఈ రెండు పార్టీల వ్యవహారం 'నాకు నువ్వు–నీకు నేను' అన్నట్టుగా పిల్లలాటలా సాగుతోందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ–రేస్ కేసుల్లో విచారణ తుది దశకు చేరుకున్నప్పటికీ ఇప్పటివరకు ఒక్క అరెస్టు కూడా జరగకపోవడం వెనుక అసలు కారణం ఏమిటో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలి. రాష్ట్ర ఖజానాను దోచుకున్న వారిని చట్టపరంగా శిక్షించలేకపోయిందో కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు.గతంలో కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులను బీఆర్ఎస్‌లో చేర్చుకోవడం, శాసనసభ–శాసనమండలిలో ఇతర పక్షాలను విలీనం చేసుకోవడం వంటి రాజకీయ అడ్డదారులు ఎంచుకున్న చరిత్ర అందరికీ తెలిసిందే. ఇప్పుడు అదే కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్‌తో 'నాకు నువ్వు – నీకు నేను' అన్నట్లుగా వ్యవహరిస్తూ తెలంగాణ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని ఎన్.వి.ఎస్.ఎస్. రేవంత్ సర్కారుకు చురకలంటించారు. ప్రజాస్వామ్య విలువలు, ప్రజాసేవ అనే మాటలు పక్కన పెట్టి, అధికారం–దోపిడీనే లక్ష్యంగా చేసుకొని కాలం వెళ్లదీస్తోంది.

**పంచాయతీ ఎన్నికల గొప్పలు – గ్రామాభివృద్ధి మాత్రం శూన్యం**

ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఇద్దరూ 'మావాళ్లే గెలిచారు' అంటూ గొప్పలు చెప్పుకోవడం చూస్తే, ఈ రెండు పార్టీల రాజకీయ నాటకాల తీరును ఎన్.వి.ఎస్.ఎస్. బట్టబయలు చేశారు కానీ వాస్తవం ఏమిటంటే–గ్రామాల అభివృద్ధికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీలేదు, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేసినదీ శూన్యమే. గతంలో బీఆర్ఎస్‌కు గ్రామీణ ప్రాంతాల్లో పెద్దఎత్తున అధికారం ఇచ్చినా సర్పంచుల ధర్నాలు, ఆత్మహత్యలు, నిరసనలు తప్పలేదు. ఇప్పుడు కాంగ్రెస్‌కు అదే స్థాయిలో అధికారం అప్పగించినా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదన్నారు. అంటే గ్రామీణ తెలంగాణను అప్పటి బీఆర్ఎస్, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాలు తీవ్రంగా నిర్లక్ష్యం చేశాయనేది రుజువైందని పేర్కొన్నారు. అధికారమే పరమావధిగా రెండు పార్టీలూ ప్రజల సమస్యలను పక్కన పెట్టి రాజకీయ ఆటలతో కాలం గడుపుతున్నాయన్నది గ్రామీణ తెలంగాణ ప్రజలకు ఇప్పుడు స్పష్టంగా అర్థమవుతోందన్నారు.

**కేంద్ర నిధులే పంచాయతీలకు ప్రాణాధారం – రాష్ట్రం నుంచి దమ్మిడీ లేదు**

గ్రామీణాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వంనుంచి కనీస నిధులే లేకపోవడం దారుణమైన వాస్తవం. ఈరోజు పంచాయతీలు నిలబడగలుగుతున్నాయంటే అది కేవలం కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా వచ్చే నిధుల వల్లేనని ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్ తేల్చిచెప్పారు. కేంద్రం నుంచి నేరుగా వచ్చే నిధులే పంచాయతీలకు ప్రాణాధారంగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలను పూర్తిగా విస్మరించడంతో ఒకవైపు గ్రామాల్లో మౌలిక వసతులు క్షీణిస్తుంటే, మరోవైపు భారీ ప్రాజెక్టుల పేరు తో దోపిడీ రాజకీయాలు కొనసాగుతున్నాయని ఆయన మండిపడ్డారు.

**కాళేశ్వరం తర్వాత పాలమూరు – అదే కథ, అదే దోపిడీ**

గతంలో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో స్థల మార్పిడి, అంచనాల పెంపు, వేల కోట్ల కమీషన్ల ఆరోపణలు ఎలా వచ్చాయోఆ ఇప్పుడు పాలమూరు ఎత్తిపోతల పథకంలో కూడా అదే కథ, అదే దోపిడీ కనిపిస్తోందని ప్రభాకర్ మండిపడ్డారు. పార్టీ మారినా, ప్రభుత్వం మారినా విధానం మాత్రం మారలేదు. ఈ మొత్తం రాజకీయ నాటకానికి కనిపించని దారాలు లాగుతున్నది రాహుల్ గాంధీయే. కాంగ్రెస్–బీఆర్ఎస్ పార్టీలను అనుసంధానం చేస్తున్నది రాహుల్ గాంధీయే. కాంగ్రెస్–బీఆర్ఎస్ పార్టీల మధ్య ఉన్న అంతర్గత బంధం, అనుబంధం రోజురోజుకీ బహిర్గతమవుతోందని నిగ్గుతేల్చారు. ప్రభుత్వ ఆస్తులు కరిగిపోతేడ మంత్రుల ఆస్తులు పెరుగుతున్నాయిమరోవైపు తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్తులు క్రమంగా కరిగిపోతుంటేడ అధికారంలో ఉన్న మంత్రుల వ్యక్తిగత ఆస్తులు మాత్రం రోజురోజుకీ విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రభుత్వ భూములు అమ్మడం, ప్రజా ఆస్తులను తాకట్టు పెట్టడం, అదే సమయంలో వ్యక్తిగత సంపదను పెంచుకోవడం... ఇదే ఈ కాంగ్రెస్ ప్రభుత్వ అసలు విధానమని ఎన్.వి.ఎస్.ఎస్. నిప్పులు చెరిగారు.

కాంగ్రెస్ అంటేనే కమీషన్లు, కరప్షన్, కాంట్రాక్టులు

పాలన పేరుతో ప్రజలను మభ్యపెట్టి, ఆస్తుల దోపిడీనే అజెండాగా ముందుకు వెళ్లడం కాంగ్రెస్ రాజకీయాలకు కొత్తేమీ కాదని.... కాంగ్రెస్ అంటేనే కమీషన్లు, కరప్షన్, కాంట్రాక్టుల రాజకీయాలు అన్న చేదు నిజం ఈరోజు దేశవ్యాప్తంగా బహిర్గతమవుతోంది. అందుకే క్రమేణా ఒక్కో రాష్ట్రంలో ప్రజల తీర్పుతో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోతోంది. తెలంగాణ కూడా దీనికి మినహాయింపు కాదన్నది కాంగ్రెస్ పాలన మొదలైన కొద్ది కాలంలోనే స్పష్టమైందని ప్రభాకర్ తెలిపారు.తెలంగాణలో సాగుతున్న కాంగ్రెస్–బీఆర్ఎస్ కపటనాటకాన్ని, ప్రజల దృష్టిని మళ్లించే డైవర్షన్ రాజకీయాలను భారతీయ జనతా పార్టీ పూర్తిగా ప్రజాక్షేత్రంలో బట్టబయలు చేస్తుంది. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ, అవినీతి పాలనను నిలదీస్తుంది. తెలంగాణ ప్రజలు గట్టిగా ఆలోచించి, ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే రోజు దగ్గరల్లోనే ఉందని డా.ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ హెచ్చరించారు.

## రెవెన్యూ శాఖ పై గౌరవం పెంచాలి



**సిద్దిపేట: జనవరి 2, పెన్ పవర్:** రెవెన్యూ డిపార్ట్మెంట్ పై గౌరవం,నమ్మకం మరింత పెరిగేలా ప్రజలకు సేవ చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి రెవెన్యూ అధికారులకు సూచించారు

కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం ట్రేసా ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ట్రేసా క్యాలెండర్ ను ఆవిష్కరించి రెవెన్యూ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ. ప్రజలకు ఎలాంటి సేవా అవసరమైన ముందు సంప్రదించేది రెవెన్యూ అధికారులనేనని, మీపై నమ్మకంతో మీ వద్దకు వచ్చే ప్రజలకు పరదర్శకంగా సేవలందించి రెవెన్యూ డిపార్ట్మెంట్ కు మరింత మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సమాధానంగా అందించడంలో ముందుండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, కలెక్టరేట్ ఏవో రాజ్ కుమార్, ట్రేసా నాయకులు అబ్దుల్ రహమాన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్రెడ్డి మాటలు మూసీ కంటే కంపుగా ఉన్నాయి

### బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు

**హైదరాబాద్, జనవరి 2, పెన్ పవర్:** సీఎం రేవంత్ రెడ్డి మాటలు మూసీ కంటే కంపుగా ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సభలో ఉన్న సభ్యులందరికీ సమానమైన హక్కులు ఉంటాయని ఆయన తెలిపారు. సభ్యుల హక్కులను కాపాడాల్సింది స్పీకరేనని స్పష్టం చేశారు.ఏడు రోజులు సభ నడుపుతామని బీఏసీలో చర్చించామని హరీశ్‌రావు తెలిపారు. కానీ బీఏసీ కాపీలో 7 రోజులు అని ఎక్కడా లేదని పేర్కొన్నారు. సభ ఎజెండా వివరాలు అర్ధరాత్రి 2 గంటలకు వస్తే.. సభ్యులు ఎలా ప్రిపేర్ అవుతారని ఆయన ప్రశ్నించారు.కాగా, రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మూసీ సుందరీకరణ అంశంపై చర్చ జరుగుతోంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని వ్యాఖ్యానించారు. దీనిపై బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. సీఎం వ్యాఖ్యలపై చర్చించేందుకు సమయం ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరారు. కానీ అందుకు స్పీకర్ నిరాకరించడంతో బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు.

## అసలు మూసీ ప్రక్షాళన ఎక్కడి నుంచి ఎక్కడి వరకు చేస్తారు

**హైదరాబాద్, జనవరి 2, పెన్ పవర్:** మూసీ ప్రక్షాళనతో నిరుపేదల బతుకులు చితికిపోవద్దని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ అన్నారు. అసలు మూసీ ప్రక్షాళన ఎక్కడి నుంచి ఎక్కడి వరకు చేస్తారని ప్రశ్నించారు. వికారాబాద్ నుంచి గండిపేట వరకు ప్లాన్స్ ఏంటో చెప్పాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మూసీ ప్రక్షాళనపై జరిగిన చర్చలో అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ.. మూసీ ప్రక్షాళన వికారాబాద్ నుంచి చేస్తారా? మధ్యలో నుంచి చేస్తారా అని ప్రశ్నించారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ క్యాచ్‌మెంట్ ఏరియా ఎంత ఉందని అడిగారు. ప్రపంచంలో కాలుష్యంలో మూసీ 8వ స్థానంలో ఉందని తెలిపారు.మూసీ ఈసా నదులు కావు.. అవి ఇప్పుడు సీవరేజ్ ప్లాంట్లు అని అక్బరుద్దీన్ విమర్శించారు. నగరంలోని మురుగు అంతా మూసీ నదిలోకే వెళ్తోందని తెలిపారు. గండిపేట జలాశయంలో కూడా మురుగు నీరు కలుస్తుందని అన్నారు. దశాబ్దాల కింద నిర్మించిన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లో పూడిక తీసి, వాటి సామర్థ్యం పెంచాలని కోరారు. నీటి నిల్వ సామర్థ్యం పెంచితే గోదావరి జలాలను తరలించవచ్చని తెలిపారు. చార్మినార్ వద్ద మూడేళ్ల కిందట మొదలుపెట్టిన పెడస్ట్రేరియన్ ప్రాజెక్టు ఏమైందని ప్రశ్నించారు.

## రాష్ట్రంలో యూరియా సంక్షోభంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళన

### యూరియా కొరతకు నిరసనగా ప్లకార్డులు పట్టుకుని శాసనసభలో నిరసన

**హైదరాబాద్, జనవరి 2, పెన్ పవర్:** రాష్ట్రంలో యూరియా సంక్షోభంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళన చేపట్టారు. యూరియా కొరతకు నిరసనగా ప్లకార్డులు పట్టుకుని శాసనసభలో నిరసన తెలిపారు. షాపుల్లో దొరకని యూరియా యాప్‌ల్లో దొరుకుతుందా?, కాంగ్రెస్ వచ్చింది.. యూరియా కొరత వచ్చిందని ప్లకార్డులు ప్రదర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ప్లకార్డులతో శాసన సభకు వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్నారు. ప్లకార్డులతో లోనికి వెళ్లవద్దని సూచించారు. ఈ క్రమంలో పోలీసులతో వాగ్వాదం జరిగింది. నేను మాట్లాడిన తర్వాతనే మీకు సరెండర్ లీవ్‌ల డబ్బులు వచ్చాయి.. ఇప్పుడు యూరియా మీద కూడా రైతుల పక్షాన మాట్లాడితేనే యూరియా వస్తుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. యూరియా కొరతపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణలో యూరియా కొరతతో రైతులు పడుతున్న ఇబ్బందులపై సభలో వెంటనే చర్చ జరపాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాయిదా తీర్మానం పెట్టారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాక్ అవుట్

**హైదరాబాద్, జనవరి 2, పెన్ పవర్:** తెలంగాణా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ వాకౌట్ చేశారు. రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మూసీ సుందరీకరణపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ప్రతిపక్ష, అధికార కాంగ్రెస్ పార్టీ మధ్య మాటల యుద్ధం జరిగింది.ముందుగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. మూసీ సుందరీకరణ పనుల పేరుతో పేదల ఇండ్లను కూల్చివేస్తే బీఆర్ఎస్ ఊరుకోదని హరీశ్‌రావు హెచ్చరించారు. అవసరమైతే బుల్డోజర్ల కింద పడుకుని కూల్చివేతలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. మూసీ సుందరీకరణకు అసలు బడ్జెట్ ఎంత? దానికి ఎక్కడి నుంచి డబ్బులు తీసుకొస్తున్నారని ప్రశ్నించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని వ్యాఖ్యానించారు. దీనిపై బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది.

## బీఆర్ఎస్ నేతల కడుపుల్లోనే విషం ఉంది సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్ రెడ్డి శాసనసభలో సంచలన వ్యాఖ్యలు చేశారు. మూసీలో ఉన్న కాలుష్యం కంటే బీఆర్ఎస్ నేతల కడుపుల్లోనే ఎక్కువ విషం ఉందని ఆరోపించారు. వాళ్ల కళ్లకు ఏదైనా శక్తి ఉండి వుంటే వారు ఎవరి వైపు అయినా చూస్తే కాలి బూడిదవుతారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. సభలో పదేపదే అడ్డు తగలడం మంచిది కాదన్నారు. క్వశ్చన్ అవర్లో సప్లిమెంటరీ క్వశ్చన్స్ రెండే ఉంటాయని, పది క్వశ్చన్స్ ఉండవని, పది మందికి అవకాశం ఉండదని అన్నారు.

## అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్

**హైదరాబాద్ పెన్ పవర్:** శుక్రవారం నాడు తిరిగి ప్రారంభమయిన అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. ముఖ్య మంత్రిని విమర్శించేందుకు మైక్ ఇవ్వనని స్పీకర్ గడ్డం ప్రసాద్ తేల్చిచెప్పారు. ఈ క్రమంలో మూసీపై సీఎం రేవంత్ మాట్లాడిన తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదని నిరసన తెలుపుతూ వాకౌట్ చేశారు.

## దుర్గం చెరువు ఆక్రమణ చేయలేదు వాహనాల పార్కింగ్ పై కేసు నమోదు



**హైదరాబాద్ పెన్ పవర్:** దుర్గం చెరువు ఆక్రమణపై తన మీద వస్తున్న వార్తలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కొట్టిపడేసారు. దుర్గం చెరువు కబ్జా అనేది పూర్తిగా నిరాధారం. దుర్గం చెరువులో మేము ఏదో 5 ఎకరాల భూమి కబ్జా చేశాను అని కేసు పెట్టారు.. అందులో మాకు గజం జాగా లేదు, ప్రభుత్వంకు కూడా గజం జాగా లేదని అన్నారు.

అక్కడ అందరూ వాహనాల పార్కింగ్ పెట్టుకుంటారు.. అక్కడే ఖాళీ స్థలంలో చెత్త డంప్ చేస్తారు. కావాలని కేసు పెట్టారు.. వాళ్ళ దగ్గర ఆధారాలు ఉంటే చూపించాలి . నాపై కక్షతో కేసు పెట్టారు. బాలకృష్ణ, లహరి ఎస్టేట్ హరిబాబు భూములు పక్కనే ఉన్నాయి. దుర్గం చెరువులో నాకు భూమి లేదు.. ప్రభుత్వ భూమి కబ్జా చేసినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధం. రోడ్డు మీద, చెట్ల కింద వెహికిల్ పార్కింగ్ చేసినందుకు కేసు పెట్టారు. ఏదో హైడ్రా వాళ్లకు పిర్యాదు చేశారు అంట మాకు సిబ్బంది ఫోన్ చేశారు.. నేను వెళ్తాను. కేసు పై లీగల్ ఫైట్ చేస్తాం.. పోలీస్ స్టేషన్కు వెళ్తాను పోలీసులకు సహకరిస్తాను. అక్కడ వెహికిల్ పార్కింగ్ చేయడం సహజం. బేషరతుగా కేసు విత్డ్రా చేయకపోతే... ఎప్టీఎల్ లో ఇండ్లు కట్టారు.. ఆ ఇండ్ల ముందు ధర్నా చేస్తానని అన్నారు.

## రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రివా.. స్ట్రీట్ రౌడీవా!!

**హైదరాబాద్ పెన్ పవర్:** రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రివా.. వీధి రౌడీవా అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ప్రశ్నించారు. కేసీఆర్ మీద చావు మాటలు, అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నావు. ప్రధాన ప్రతిపక్షానికి అసెంబ్లీలో మైక్ ఇవ్వడం లేదు. ముఖ్యమంత్రి మీద మేము విమర్శలు చేయొద్దని స్పీకర్ అంటున్నాడు.. ఇంక మేము ఉండి ఎందుకని అన్నారు.ముఖ్యమంత్రి మీద మాట్లాడితే మైక్ కట్ చేస్తానని స్పీకర్ ఆన్ రికార్డ్ అంటున్నాడు. స్పీకర్ పక్షపాత వైఖరికి నిరసనగా ఈ సెషన్ శాసన సభను బీఆర్ఎస్ పార్టీ బహిష్కరిస్తుందని అన్నారు.

## ముఖ్యమంత్రిని విమర్శించకపోతే.. ప్రతిపక్షం ఎక్కడన్నా ముఖ్యమంత్రికి డబ్బా కొడుతుందా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రిని విమర్శించకపోతే.. ప్రతిపక్షం ఎక్కడన్నా ముఖ్యమంత్రికి డబ్బా కొడుతుందా అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మండిపడ్డారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తే మైక్ ఇవ్వకపోవడం ఏంది.. ముఖ్యమంత్రిని పొగడడానికి వస్తారా సభకి. ముఖ్యమంత్రి మూసీ కంపును అంతా తీసుకొచ్చి తన నోటి ద్వారా అసెంబ్లీలో వదిలాడు. ప్రాధానమైన ప్రతిపక్షంగా మేము ప్రజల తరుపున ప్రశ్నలు అడిగి.. మేము పేద ప్రజల ఇల్లు కూల కొడితే వాళ్ల వెంట ఉంటామని చెబితే, ముఖ్యమంత్రి ఇష్టం వచ్చినట్లు దాడి చేసి మాకు అవకాశం ఇవ్వకుండా వేరే ప్రతిపక్షానికి అవకాశం ఇచ్చారని అన్నారు. మా సబితా ఇంద్రా రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి మూసీ ప్రస్తావన తీసుకురాగానే వారి మైక్ కట్ చేసేసారు . స్పీకర్ వైఖరికి నిరసనగా మేము సభను బాయ్ కాట్ చేసామని అన్నారు.

## బీసీల ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలు కుల సంఘాల నేతలలో చర్చలు

**హైదరాబాద్ పెన్ పవర్:** బీసీ కులాల ఆత్మగౌరవ భవనాలకు సంబంధించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం నాడు శాసనమండలిలో ఎమ్మెల్సీ బండ ప్రకాష్ అడిగిన ప్రశ్నకు మంత్రి పొన్నం సమాధానం ఇచ్చారు.మంత్రి మాట్లాడుతూ 42 భవనాలకు స్థలాలు ఇచ్చారు కానీ దాని అభివృద్ధి చేయడానికి కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. మూడు భవనాలు పని ప్రారంభం అయి మద్యలో ఉన్నాయి. కులాలకు సంబంధించిన ప్రతినిధులు ఆ స్థలాలు ప్రైవేట్ వ్యక్తుల చేతులకు పోకుండా కాపాడుకోవాలని అన్నారు.

కురుమ భవనం పూర్తయిన ఎద్యుకేషన్ ఇన్స్టిట్యూట్ ఇతర హాస్టల్ అవసరాలకు వాడాలని వారికే విబేధాలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి చాంపియన్. బీసీ ప్రజా ప్రతినిధుల తో శాసన సభ సమావేశాల్లోపు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం.బీసీ సబ్ ప్లాన్ పై గత సంవత్సరం ప్రారంభించాలనుకున్నాము ఆ నిధులు వాడతాం.బలహీన వర్గాల విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నాం. ఇటీవల జరిగిన సర్వే లో అభివృద్ధి చెందిన కుటుంబాల నివేదిక పరిశీలిస్తే ఏ కుటుంబంలో అయితే ఉన్నత చదువులు ఉన్నాయో వారే అభివృద్ధి చెందారు. బలహీన వర్గాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక తో ముందుకు పోతామని అన్నారు.

# 24 గంటల మంచినీటి కోసం పక్కా ప్లాన్

**హైదరాబాద్, జనవరి 2, పెన్ పవర్:**

భాగ్యనగరం శరవేగంగా విస్తరిస్తోంది. అంబరాన్నంటే భవనాలు, ప్రపంచ స్థాయి ఐటీ కంపెనీలు, కోటిన్నరకుపైగా జనాభాతో ఈ మహానగరం ఇప్పుడు గ్లోబల్ హబ్‌గా మారింది. అయితే పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా మౌలిక వసతులు, ముఖ్యంగా తాగునీరు, మురుగు నీటిపారుదల వ్యవస్థను సిద్ధం చేయడం ఒక సవాలుతో కూడుకున్న పని. ఈ సవాలును స్వీకరించిన హైదరాబాద్‌మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ స్వరేజ్ బోర్డు, సిటీని ఒక ఆదర్శవంతమైన వాటర్ సెక్యూర్ సిటీగా తీర్చిదిద్దేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసింది. వాటర్ బోర్డు, వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులతో నగర భవిష్యత్తును మార్చడానికి రంగం సిద్ధం చేసింది. హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం రోజు విడిచి రోజు లేదా కొన్ని శివారు ప్రాంతాల్లో మూడు, నాలుగు రోజులకు ఒకసారి నీరు సరఫరా అవుతోంది. కానీ, ఈ పరిస్థితిని మార్చడమే లక్ష్యంగా వాటర్ బోర్డు ప్రణాళికలు రచిస్తోంది. 2027 చివరి నాటికి నగరంలోని ప్రతి ఇంటికీ ప్రతి రోజూ తాగునీరు అందించడం బోర్డు ప్రాథమిక లక్ష్యం. ఆ తర్వాత 2047 నాటికి తెలంగాణ కోర్ ప్రాంతానికి 24 గంటల పాటు నిరంతరాయంగా నీటిని సరఫరా చేసేలా మాస్టర్‌ప్లాన్ రూపొందుతోంది. నగర తాగునీటి అవసరాలు భవిష్యత్‌లో భారీగా పెరగనున్నాయి. 2027 నాటికి నగర తాగునీటి డిమాండ్ 835 ఎంజీడీలుగా, 2047 నాటికి అది ఏకంగా 1114 ఎంజీడీలుగా పెరుగుతుందని అంచనా. ఈ డిమాండ్‌ను తట్టుకోవడానికి గోదావరి జలాలే కీలకం. ఇప్పటికే కృష్ణా, గోదావరి, సింగూరు, మంజీరా జలాలను వందల కిలోమీటర్లు దూరం నుంచి తెస్తున్న బోర్డు, ఇప్పుడు గోదావరి ఫేజ్-2, ఫేజ్-3 ప్రాజెక్టులపై దృష్టి పెట్టింది. రూ. 7,360 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా అదనంగా 20 టీఎంసీల నీటిని తరలించడానికి పనులు శరవేగంగా

జరుగుతున్నాయి.నగరం మధ్యలో ప్రవహించే మూసీ నదని పునరుద్ధరించాలని ప్రభుత్వం ఎప్పటి నుంచి ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా జంట జలాశయాలను గోదావరి నీటితో నింపడానికి వాటర్ బోర్డు ఒక భారీ ప్రాజెక్టును చేపట్టింది. మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం ద్వారా నదికి పాత వైభవాన్ని తీసుకురావడానికి అధికారులు శ్రమిస్తున్నారు. వంద శాతం మురుగు శుద్ధి: పర్యావరణ పరిరక్షణలో మైలురాయి మురుగు నీరు నేరుగా చెరువులు, నదుల్లో కలవకుండా అడ్డుకోవడం నగర ఆరోగ్యానికి ముఖ్యం. దీని కోసం ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 972 ఎంఎల్డీ సామర్థ్యం గల 39 కొత్త మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం ప్రారంభమైంది. అమృత్-2.0 పథకంలో భాగంగా రూ. 3849.10 కోట్ల వ్యయంతో ఈ పనులు జరుగుతున్నాయ. 2026 నాటికి ఈ పనులు పూర్తి అయితే హైదరాబాద్ మొత్తం మురుగు నీటి శుద్ధి సామర్థ్యం 2,850 ఎంఎల్డీలకు చేరుకుంటుంది. ఇది 2036 వరకు నగర అవసరాలను తీర్చగలదని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

అంతేకాకుండా,మూసీ నదిలోకి మురుగు చేరకుండా ట్రంక్ లైన్లు వేసేందుకు 4700 కోట్లతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక కూడా సిద్ధమైంది. వేసవి సన్నాహాలు గత వేసవిలో భూగర్భ జలాలు 14 నుంచి 28 మీటర్ల వరకు పడిపోవడంతో నగరవాసులు ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా ఉండటానికి వాటర్ బోర్డు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించింది. ఇంకుడు

గుంతల యజ్ఞం ద్వార వర్షపు నీటిని భూమిలోకి ఇంకించే కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చింది. నగరంలో నమోదైన భారీ వర్షాలు, బోర్డు చర్యల వల్ల భూగర్భ జలాలు గత ఏడాదితో పోలిస్తే 3 నుంచి 9 మీటర్ల వరకు పైకివచ్చాయి. దీనిని మరింత ముందుకు తీసుకెళ్తూనే, 16వేల గృహాలకు నోటీసులు జారీ చేసి ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. వచ్చే మార్చి నాటికి మరో 25వేల గృహాల్లో వీటిని పూర్తిచేయాలని బోర్డు లక్ష్యంగా పెట్టుకుంది.నగరంలోని ప్రతి మూలకు నీరు చేర్చడానికి కొత్త ప్రాజెక్టును బోర్డు వేగవంతం చేసింది.

1. కోకాపేట్ నియోపోలిస్ లే అవుట్: 298 కోట్లతో వాటర్ సప్లై ప్రాజెక్టు
2. మహీంద్రహిల్స్: 5మిలియన్ లీటర్ల రిజర్వాయర్ నిర్మాణం
3. ఆస్మానగ్: 7.5 మిలియన్ లీటర్ల రిజర్వాయర్ నిర్మాణం
4. మంజీరా నెట్‌వర్క్: 722 కోట్లతో నెట్‌వర్క్ ఆధునీకరణ
5. ఉస్మాన్ సాగర్ కండూట్: దీనిని పునరుద్ధరించి రోజుకు 21 మిలియన్ గ్యాలన్ల నీటిని తరలించడానికి 282 కోట్లతో అదనపు పైపు లైన్ నిర్మాణం చేపడుతున్నారు. అంతే కాకుండా ఔటర్ రింగ్ రోడ్డు వెంట 140 కిలోమీటర్ల మేర రేడియల్ రింగ్ మెయిన్, 98 కిలోమీటర్ల లింకు పైపులైన్ల కోసం 8వేల కోట్లో భారీ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. హైదరాబాద్ వాటర్ బోర్డు చేపట్టిన ఈ ప్రాజెక్టులు సకాలంలో పూర్తి అయితే నీటి కరవు అనేది ఉండని ప్రభుత్వం భావిస్తోంది.

# కేసీఆర్ సభకు రాకపోతే బీఆర్ఎస్ పని ఖతం

**హైదరాబాద్, జనవరి 2, పెన్ పవర్:** కేసీఆర్ తప్పు చేయకపోతే సభకు రావాలని కవిత అభిప్రాయం వ్యక్తం చేశారు. శాసనమండలి వద్ద మీడియా ప్రతినిధులతో కవిత ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా కేసీఆర్ అసెంబ్లీకి రాక పోవడంపై కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ సభకు రాకపోతే బీఆర్ఎస్ పని ఖతమైనట్లేనన్నారు. సభకు రాకుండా పిల్ల కాకులకు సభాసమయాన్ని వదలొద్దని కేసీఆర్‌కు సూచించారు. హరీష్ రావు కు ప్యాకేజీలు, అమ్ముకోవడం తప్ప ఏం తెలియదన్నారు. కేసీఆర్ పై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కూడా ఖండించారు.

హరీష్ రావు, రేవంత్ రెడ్డి,సీఎం చాంబర్ లో అరగంట మాట్లాడుకున్నారని కవిత ఆరోపించారు. కేసీఆర్ మాత్రమే నీటి పంపకాలపై సమాధానం ఇవ్వగలడని కవిత స్పష్టం చేశారు. అసెంబ్లీలో ఫిక్సుడ్ మ్యాచ్ జరుగుతోందన్నారు. హరీష్ కు మాట్లాడే చాన్స్ ఇవ్వడం సరి కాదని కవిత స్పష్టం చేశారు. రేవంత్ వర్సెస్ హరీష్ అన్నట్లుగా అసెంబ్లీ నడవబోతోందని ఇది చాలా ప్రమాదకరమని కవిత వ్యాఖ్యానించారు. కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదో తనకు తెలియదని తాను మాట్లాడి నాలుగు నెలలు అవుతోందన్నారు.


కవిత కేసీఆర్ పై డైరక్ట్ గా ఇలా మాట్లాడటం ఇదే మొదటి సారి. కేటీఆర్, హరీష్ లకు వదిలేస్తే ఆశలు వదిలేసుకోవాల్సిందేనని ఆమె



చెప్పడం ఓ పాయింట్ అయితే..కేసీఆర్ తప్పు చేయక పోతే అసెంబ్లీకి రావాలని అనడం మరో పాయింట్. సాధారణంగా విపక్ష నేతలు,ఆయన అసెంబ్లీకి రావాలని డిమాండ్ చేసేవారు ఈ పాయింట్ తో విమర్శలు చేస్తారు. కానీ కవిత అలాంటి వ్యాఖ్యలు చేశారు అంటే కవిత కూడా బీఆర్ఎస్ పార్టీనే కాదు,కేసీఆర్ ను రాజకీయంగా ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారని అనుకోవచ్చు.

బీఆర్ఎస్ పార్టీ సస్పెండ్ చేసిన తర్వాత కవిత తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. కానీ మండలి చైర్మన్ ఆమోదించలేదు. సాధారణంగా అయితే రాజీనామాను ఆమోదించాలి. కానీ ఇప్పుడు ఆమోదిస్తే ఉపఎన్నికలు వస్తాయి. లోకల్ ఎలక్షన్స్ పూర్తి అయిన తర్వాత ఆమోదించాలన్న ఆలోచనలో ఉన్నారేమో కానీ, పట్టించుకోలేదు. ఈ కారణంగా కవిత మరోసారి శాసనమండలి స్పీకర్ ను కలిసి తన రాజీనామాను ఆమోదించాలని మరోసారి కోరారు.

# హైదరాబాద్ ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలనేదే మా సంకల్పం



**హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్:** ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ ఇప్పటికీ హైదరాబాద్ నగర ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయి. ఆగర్భ శ్రీమంతుల ఫామ్ హౌజుల డ్రైనేజీతో ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ లొంకలుపుతుంటే ఉక్కు పాదం మోపామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.శుక్రవారం అయన అసెంబ్లీలో మాట్లాడారు. రేవంత్ మాట్లాడుతూ మూసా, ఈసా నదుల సంగమం వద్ద మహాత్మా గాంధీ అస్థికలు కలిపిన చోట బాపూ ఘాట్ నిర్మించారు. మానవ నాగరికత నదీ పరివాహక ప్రాంతంలోనే అభివృద్ధి చెందింది. కాకతీయుల నుంచి నిజాం నవాబుల వరకు సాగు, తాగు నీటి అవసరాలతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి అనుగుణంగా ప్రాజెక్టులు నిర్మించారు.1908 లో నగరాన్ని వరద ముంచెత్తితే, వరద సమస్యకు శాశ్వత పరిష్కారంగా నిజాం సర్కారు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ ప్రాజెక్టులను నిర్మించింది.

మూసీ నది ప్రక్షాళనపై ఎన్ని విమర్శలు వచ్చినా వెనక్కి తగ్గకుండా ముందుకు వెళ్లాం. లండన్ థేమ్స్ రివర్, న్యూయార్క్ జపాన్, సౌత్ కొరియా, సింగపూర్ లాంటి దేశాలను పర్యటించాం . ప్రపంచస్థాయి నగరాలన్నీ నదీ పరివాహక ప్రాంతాలను కాపాడుకున్నాయి . గుజరాత్ సబర్మతీ నది ప్రక్షాళన సమయంలో 60 వేల కుటుంబాలను తరలించారు. ఉత్తర్ ప్రదేశ్ లో గంగా నది ప్రక్షాళన చేసి రివర్ ఫ్రంట్ కట్టుకున్నారు. బీజేపీ నాయకులు వాటిని అభివృద్ధి మంత్రంగా ప్రచారం చేసుకున్నారు. మేం వాటిని వ్యతిరేకించలేదు.

తప్పుపట్టడం లేదు. మూసీ కాలుష్యం కారణంగా నల్లగొండ జిల్లా ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారు. కంపెనీల కలుషితాల నుంచి జంతువుల కళేబరాల వరకు మూసీలో కలుస్తున్నాయి.. మూసీ పరీవాహక ప్రాంత మహిళలు గర్భం దాల్చలేకపోతున్నారని వైద్యులు చెప్పిన పరిస్థితి వుంది. ప్రపంచ నగరాలు అభివృద్ధి చెందుతున్న విధానాలను చూశాక మూసీలో శుద్ధమైన నీరు ప్రవహించాల్సిందేనని ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించాం . కన్సల్టెన్సీలను అపాయింట్ చేసుకుని మూసీ ప్రక్షాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పామని అన్నారు.

బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ రెండు నదులు కలిసే చోట వి షేప్ లో అభివృద్ధి జరుగుతోంది. గోదావరి జలాలను తరలించి మూసీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనుకుంటున్నాం. 20 ౹వీజ లలో 15 టీఎంసీలు తాగు నీటి అవసరాలకు, 5 టీఎంసీలు మూసీ లో నిరంతరం శుద్ధమైన నీరు పాటించేందుకు ఉపయోగించాలనుకుంటున్నాం. మూడు నదుల సంగమంగా బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ ను అభివృద్ధి చేయబోతున్నాం . మార్చి 31 లోగా అంచనాలు సిద్ధం చేసి టెండర్లు వేసి అభివృద్ధి చేయాలనుకుంటున్నాం. ఏడీబీ బ్యాంకు రూ. 4 వేల కోట్లు రుణం ఇచ్చేందుకు అంగీకరించింది . గాంధీ సరోవర్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కూడా అనుమతించింది. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని భావిస్తున్నాం. ఓల్డ్ సిటీని మేం ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. ఓల్డ్ సిటీ ఒరిజినల్ సిటీ.. ప్రపంచంలోనే గొప్ప నగరంగా తీర్చిదిద్దుతాం. కొంతమంది నన్ను రియల్ ఎస్టేట్ బ్రోకర్ అంటున్నారు . రియల్ ఎస్టేట్ కూడా ఒక ఇండస్ట్రీ. హైటెక్ సిటీ నిర్మించాలనుకున్నప్పుడు కూడా ఇలాంటి విమర్శలే చేశారు . రోజు రోజుకు పట్టణీకరణ పెరుగుతుంది . రాబోయే 20 ఏండ్లలో 75 శాతానికి పట్టణీకరణ పెరుగుతుంది. మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపులో ఉన్న విషం అత్యంత ప్రమాదకరం . నేను వివరాలు చెబుతుంటే ఎందుకు విషం కక్కుతున్నారు . నిజాలు ప్రజలకు తెలియవద్దని చర్చ జరగకుండా చూడాలనుకుంటున్నారు. వివరాలు చెబుతుంటే నొప్పి ఎందుకని ప్రశ్నించారు.మూసీ ప్రక్షాళన చేయాలని వాళ్ల బీఆరెస్ ఎమ్మెల్యేలు కూడా కోరుతున్నారు . మూసీ పరీవాహక ప్రాంత పేదలకు మెరుగైన వసతులు కల్పిస్తామంటే వాళ్లు అలాగే ఉండాలన్నట్లుగా విపక్షం ప్రవర్తిస్తున్నది. మంచిరేవుల దగ్గర మూసీ పరివాహకంలో ఉన్న పురాతన శివాలయాన్ని అభివృద్ధి చేయబోతున్నాం. మూసీ పరివాహకంలో గురుద్వార్ , మసీదు, చర్చి లను నిర్మించి మత సామరస్యాన్ని చాటబోతున్నాం. డీపీఆర్ సిద్ధమయ్యాక అందరి సలహాలు, సూచనలు తీసుకుంటాం. గాంధీ సరోవర్ నిర్మాణానికి డిఫెన్స్ ల్యాండ్ ఇవ్వడానికి కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ గారు సూచనప్రాయంగా అంగీకరించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలకు నా సూచన . మీ నియోజకవర్గాల్లో ఎలాంటి అభివృద్ధి కావాలో చెప్పండి . పేదలకు మంచి ఇండ్లు కట్టించి వారికి మెరుగైన వసతులు కల్పిద్దాం . హైదరాబాద్ ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలనేదే మా సంకల్పం . మేం మంచి పని చేయాలనుకుంటున్నాండ మీ సూచనలు సలహాలు ఇవ్వండని అన్నారు.

# అగ్గిరాజేస్తున్న నీళ్లు

**హైదరాబాద్, జనవరి 2, పెన్ పవర్:** పోలవరం బనకచర్ల లింక్ కెనాల్ అంశం రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి అగ్నిరాజేసింది. గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు మళ్లించే ఈ ప్రతిపాదనపై కేంద్ర జల సంఘం (జఔజ) అనుమతులు ఇచ్చిందన్న ప్రచారం,అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధానికి తెరలేపింది.ఈ తాజా వివాదానికి బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన సంచలన వ్యాఖ్యలే కారణం. పోలవరం ప్రాజెక్టు కుడి కాలువనుంచి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ కు లింక్ ఏర్పాటు చేయడానికి సీడబ్ల్యూసీ పచ్చజెండా ఊపిందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని, కేంద్రం వద్ద తెలంగాణవాణిని బలంగా వినిపించలేకపోయారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, అందుకే ఈ ప్రాజెక్టు అనుమతులపై మౌనంగా ఉన్నారని ఆరోపించారు.ఈ లింక్ ద్వారా గోదావరి నీళ్లను కృష్ణా ఆయకట్టుకు తరలిస్తే, భవిష్యత్తులో తెలంగాణకు గోదావరి జలాల్లో దక్కాల్సిన న్యాయమైన వాటా కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.హరీశ్ రావు ఆరోపణలనునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అంతే తీవ్రంగా తిప్పికొట్టారు. అసలు అనుమతులే రాలేదని స్పష్టం చేస్తూ ప్రభుత్వం తరపున వాస్తవాలను వినిపించారు. సీడబ్ల్యూసీ పోలవరం బనకచర్ల అనుసంధానానికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని, హరీశ్ రావు రాజకీయ లబ్ధి కోసమే అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివాదం ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణలో ఉందని,కోర్టు పరిధిలో ఉన్న అంశంపై కేంద్ర సంస్థలు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోలేవని మంత్రి గుర్తుచేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే జల దోపిడీ జరిగిందని, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎదురుదాడి చేశారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.రాజకీయ విమర్శలను పక్కనపెడితే, ఈ ప్రాజెక్టు సాంకేతికంగా రెండు రాష్ట్రాలకూ కీలకమైనది. పోలవరం కుడి కాలువ ద్వారా వచ్చేగోదావరి నీటిని, బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ ప్రాజెక్టులకు (శ్రీశైలం కుడి గట్టు



కాలువ, తెలుగు గంగ తదితర) మళ్లించడం ఏపీ లక్ష్యం. దీనివల్ల కృష్ణా నదిలో నీటి లభ్యత లేనప్పుడు, గోదావరి జలాలతోరాయలసీమను ఆదుకోవచ్చని ఏపీ భావిస్తోంది. అయితే తెలంగాణ వాదన మరోలా ఉంది. బనకచర్ల అనేది కృష్ణా బేసిన్‌లోని భాగం. గోదావరి జలాలను అక్కడికి మళ్లిస్తే, కృష్ణా జలాల్లో మిగులు జలాల లెక్కలుమారిపోతాయి. పోలవరం నుంచి మళ్లించే 80 టీఎంసీల గోదావరి జలాలకు బదులుగా, కృష్ణా జలాల్లో ఎగువ రాష్ట్రాలకు అదనపు వాటా దక్కాలి. ఈ లెక్కలు తేలకుండా, ఏపీ ఏకపక్షంగా నీటిని మళ్లిస్తే, నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల కింద ఉన్న తెలంగాణ ఆయకట్టు ఎండిపోయే ప్రమాదం ఉందనేది ఆ రాష్ట్రవాదన.అధికారులు చెబుతున్న సమాచారం ప్రకారం, ఏపీ ప్రభుత్వం ఈ లింక్ కెనాల్ కోసం డీపీఆర్ ను సీడబ్ల్యూసీకిసమర్పించిన మాట వాస్తవమే. అయితే, దీనిపై గోదావరి, కృష్ణా బోర్డుల అభిప్రాయాలను, తెలంగాణ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా సీడబ్ల్యూసీ తుది అనుమతి ఇచ్చే అవకాశం తక్కువ. ప్రస్తుతంసుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నందున, న్యాయపరమైన చిక్కులు లేకుండా కేంద్రం ముందడుగు వేయలేదు.ప్రస్తుతం పోలవరం బనకచర్ల అంశం ఒక పొలిటికల్ టూల్ గా మారింది. బీఆర్ఎస్ దీనిని సెంటిమెంట్ అస్త్రంగా వాడుకుని ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని చూస్తుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని సమర్థంగా తిప్పికొట్టే పనిలో పడింది. అయితే, రాజకీయ ఆరోపణలు ఎలా ఉన్నా, గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కుమళ్లించే విషయంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఏ చిన్న ఏమరుపాటు ఉన్నా, భవిష్యత్ తరాలకు తీరని అన్యాయం జరిగే ప్రమాదం లేకపోలేదు.

# కవితకు ఓటు... ఎవరికి చేటు...

**హైదరాబాద్, జనవరి 2, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో 2026 సంవత్సరం సరికొత్త సమీకరణాలకు వేదిక కాబోతోంది. ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీకి రాబోయే రోజుల్లో కాంగ్రెస్ లేదా బీజేపీ కంటే కూడా సొంత ఇంటి నుంచే వచ్చేముప్పు అతి పెద్ద సవాల్‌గా మారే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెట్టడం ఖాయమయింది. తెలంగాణ ఉద్యమ కాలం నుండి తెలంగాణ జాగృతి ద్వారా సాంస్కృతికసారథిగా కవితకు ప్రత్యేక గుర్తింపు ఉంది. బీఆర్ఎస్ పార్టీలో మహిళా గళంగా ఆమె కీలకంగా వ్యవహరించారు. కారణాలు ఏమైనా ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఆమె జాగృతి పేరుతో రాజకీయం చేస్తున్నారు.కానీ ఇంకా రాజకీయ పార్టీగా ప్రకటించలేదు. కొత్త ఏడాదిలో ఆమె సొంతంగా పార్టీని ప్రకటించి, మరింతగా క్షేత్రస్థాయిలో పర్యటించే అవకాశాలు ఉన్నాయి. అది బీఆర్ఎస్‌కు పరోక్షంగా పెనుగండంగా మారుతుంది. ఇదికేవలం రాజకీయ చీలిక మాత్రమే కాదు, కేసీఆర్ స్థాపించిన పార్టీకి నైతిక , సెంటిమెంట్ పరమైన దెబ్బగా పరిణమించే ప్రమాదం ఉందిరాజకీయాల్లో 1 లేదా 2 శాతం ఓట్ల వ్యత్యాసమే అధికార మార్పిడికి కారణమవుతుంది. గత ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే బీఆర్ఎస్ , కాంగ్రెస్ మధ్య ఓట్ల శాతం తేడా చాలా స్వల్పంగా ఉంది. కవిత కొత్త పార్టీ పెట్టి, రాష్ట్రవ్యాప్తంగా కనీసం ల4 నుండి 5 శాతం ఓట్లను చీల్చగలిగితే, అదినేరుగా బీఆర్ఎస్ గెలిచే స్థానాలపై ప్రభావం చూపుతుంది. బీఆర్ఎస్ సంప్రదాయ ఓటు బ్యాంకులో మహిళలు, సాంస్కృతిక సంఘాలు కీలక పాత్ర పోషిస్తారు. కవితా తన బలాన్ని



నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తే, ఆ ఓట్లు చీలిపోయి అల్టిమేట్‌గా కాంగ్రెస్ లేదా బీజేపీకి లబ్ధి చేకూరుతుంది. కవిత కొత్త పార్టీ దిశగా అడుగులు వేస్తే, బీఆర్ఎస్‌లో అసంతృప్తిగా ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులు ఆమె వైపు చూసే అవకాశం ఉంది. ముఖ్యంగాఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఆమెకు ఉన్న పట్టు పార్టీకి నష్టం కలిగించవచ్చు. క్యాడర్ ఎవరి వైపు ఉండాలో తెలియక అయోమయానికి గురైతే, పార్టీ క్షేత్రస్థాయిలో బలహీనపడుతుంది. కేసీఆర్ ఇమేజ్‌ను నమ్ముకున్న కార్యకర్తలు, కుటుంబంలోనే చీలిక వస్తే మానసికంగా కుంగిపోయే ప్రమాదం ఉంది.కవితను తమ దారిలోకి తెచ్చుకోకపోతే లేదా ఆమెను పార్టీలో సముచిత స్థానంతో సంతృప్తి పరచకపోతే బీఆర్ఎస్ మనుగడకు పెద్దసమస్యగా మారుతుంది. పార్టీకి విఘాతం కలగకుండా ఉండాలంటే కుటుంబ సమన్వయం కంటే కూడా రాజకీయ సమన్వయం అత్యవసరం. ఆమెను దూరం పెట్టడం వల్ల వచ్చే నష్టం కంటే, ఆమెతో కలిసి ప్రయాణించడం వల్ల కలిగే లాభాలను పార్టీ అధిష్టానం బేరీజు వేసుకోవాల్సి ఉంటుంది. 2026లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను వాడుకుని పుంజుకోవాలని చూస్తున్న బీఆర్ఎస్‌కు, ఈ అంతర్గత సంక్షోభం అడ్డంకిగామారవచ్చు. కవితా ఫ్యాక్టర్ కేవలం ఓట్ల చీలికకే పరిమితం కాకుండా, పార్టీ భవిష్యత్తును నిర్ణయించే స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. కొత్త ఏడాదిలో కేసీఆర్ ఈ చిక్కుముడిని ఎలా విప్పుతారో వేచి చూడాల్సి ఉంది.

# జగిత్యాల జిల్లాను కమ్మేసిన మంచు పొగ





## మసక బారిపోయిన గ్రామాలు

**హైదరాబాద్, జనవరి 2, పెన్ పవర్:** ఉదయపు వేళ సూర్యుడు ఉదయించాల్సిన వేళ జగిత్యాలతో పాటు ధర్మపురి నియోజకవర్గంలోని మండలాలలో చుట్టుముట్టినది మాత్రం వెలుగు కాదు.. తెల్లని మంచు పొగ. కళ్లముందు కనిపించే దృశ్యాలు కూడా మసకబారిపోయేంతగా ఉదయాన్నే దట్టమైన పొగ కమ్ముకుంది. రహదారులు, ఇళ్ల పైకప్పులు, చెట్ల కొమ్మలు అన్నీ ఒకే రంగులో కలిసిపోయి, జగిత్యాల పట్టణంతో పాటు ధర్మపురి నియోజకవర్గంలోని గ్రామాలు నిశ్శబ్దంగా నిలిచినట్టుగా కనిపించింది.

ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో కూడా సూర్యుడు కనిపించకపోవడంతో చలి గాలుల ప్రభావం తీవ్రంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మంచు పొగ ప్రభావం ఎక్కువగా ఉండటంతో వాహనదారులు నెమ్మదిగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడంతో డ్రైవింగ్ మరింత జాగ్రత్తగా చేయాల్సి వచ్చింది. చలితో పాటు తేమ ఎక్కువగా ఉండటంతో వృద్ధులు, చిన్నారులు ఇళ్లలోనే ఉండేందుకు మొగ్గుచూపుతున్నారు. రైతులు మాత్రం ఉదయపు వేళ పొలాల వద్దకు వెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు, ఈ మంచు వాతావరణం పంటలకు కొంత మేలు చేసే అవకాశముందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

మబ్బుల్లో మునిగిన దృశ్యాలు ఒకవైపు ప్రకృతి సౌందర్యాన్ని తలపించగాడ మరోవైపు చలి తీవ్రతను గుర్తుచేస్తోంది. ఇంకా కొన్ని రోజులు ఇలాంటి వాతావరణమే కొనసాగుతుందని వాతావరణ శాఖ అంచనా వేస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తోంది.మొత్తానికి మంచు ముసుగులో నిద్రలేచిన జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాలలోని గ్రామాలు శీతాకాలపు నిశ్శబ్దాన్ని అనుభవిస్తూ మరో ఉదయాన్ని స్వాగతించింది.

# వరదల సమయంలో మూసి గేట్లు ఒకేసారి తెలిచారు

**హైదరాబాద్, జనవరి 2, పెన్ పవర్:** ఇటీవల వరదలు వచ్చినప్పుడు మూసీ గేట్లు ఉద్దేశపూర్వకంగా ఒకేసారి తెరిచారు.. దీంతో ఇండ్లు మునిగిపోయి, ఎంతో మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు.శుక్రవారం అయన అసెంబ్లీలో మాట్లాడుతూ పైనుండి వచ్చే వరదలను దృష్టిలో పెట్టుకొని కొద్ది కొద్దిగా నీటిని కిందికి వదలాలి.. కానీ అవేమీ పట్టించుకోకుండా ప్రాజెక్ట్ నిండే వరకు గేట్లు తెరవలేదని అన్నారు.ఆ తర్వాత ఒకేసారి గేట్లు తెరవడంతో ఇండ్లు, రోడ్లు మునిగిపోయాయి.. ఇది కావాలనే ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ పెద్దలు చేశారు, ఇది ప్రభుత్వం దృష్టికి వచ్చిందా అని ప్రశ్నించారు.

# కాంగ్రెస్ నేతలకు బుద్ధి రావాలి

**హైదరాబాద్, జనవరి 2, పెన్ పవర్:** కాంగ్రెస్ నాయకులకు ఈ సంవత్సరం అయినా మంచి బుద్ధి రావాలని దేవుడిని కోరుకుంటున్నానని కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే డా సంజయ్ అన్నారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మూర్కత్వపు మాటలు ఇప్పటికైనా ఆపాలి. మిమ్మల్ని తిట్టడం మాకు చాలా ఈజీ, కానీ అది మా సంస్కారం కాదని అన్నారు.

# హైదరాబాద్ శివారులో దట్టమైన పొగమంచు.. స్తంభించిన ట్రాఫిక్

**హైదరాబాద్, జనవరి 2, పెన్ పవర్:** హైదరాబాద్ శివారు ప్రాంతాలను శుక్రవారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కమ్మేసింది. మంచు తీవ్రత ఎక్కువగా ఉండటంతో రోడ్లు, భవనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా నగర శివార్లలోని ఇబ్రహీంపట్నం, నాగార్జునసాగర్ హైవే, మేడ్చల్, తూంకుంట, శామీర్‌పేట, గండిపేట, మోకిల, పటాన్‌చెరు, వికారాబాద్, రాజేంద్రనగర్, ఆదిబట్ల తదితర ప్రాంతాల్లో జీరో విజిబిలిటీ నమోదైంది. దీంతో ఉదయాన్నే రోడ్లెక్కిన వాహనదారులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.పొగమంచు కారణంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు మార్గంతో పాటు బెంగళూరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో డ్రైవర్లు తమ వాహనాలను రోడ్డు పక్కనే నిలిపివేశారు. ఫలితంగా శంషాబాద్ నుంచి పాలమాకుల వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. అటు ఔటర్ రింగ్ రోడ్డు (ORR)పై కూడా మంచు ప్రభావం ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.మరోవైపు హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై కూడా పరిస్థితి ఇలాగే ఉంది. అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద పది అడుగుల దూరంలో ఉన్న వాహనాలు కూడా కనిపించనంతగా పొగమంచు కురుస్తోంది. విజిబిలిటీ పూర్తిగా తగ్గిపోవడంతో వాహనదారులు హెడ్ లైట్లు, ఇండికేటర్లు వేసుకుని నెమ్మదిగా వెళ్లాల్సి వచ్చింది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉండటంతో వాహనదారులు ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఉపాధి హామీ పథకం పై ఫిబ్రవరి 2 న కాంగ్రెస్ నిరసన



**హైదరాబాద్, జనవరి 2, పెన్ పవర్:** :అమలాపురంలో సీడబ్లుసి సభ్యుడు గిడుగు రుద్రరాజు మీడియా సమావేశం నిర్వహించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కు మహాత్మా గాంధీ పేరు తొలగించి ఆ చట్టం రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం నిర్ణయం పట్ల జనవరి 5 నుండి జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమం చేపడుతుందని రుద్రరాజు తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకం తొలిసారిగా అమలు చేసిన అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం బండ్లపల్లిలో ఫిబ్రవరి 2 న జరగనున్న నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే హాజరుకానున్నారని రుద్రరాజు తెలిపారు. ప్రస్తుత కొత్త నల్ల చట్టం రద్దు చేసి, పాత చట్టం పురుద్ధరించే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. నూతన ఉపాధి చట్టం వలన వ్యవసాయ కార్మికులు ఉపాధి కోల్పోతారని వలసలు పెరుగుతాయని రుద్రరాజు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని కార్పోరేట్ శక్తుల గుప్పిట్లో పెట్టడానికి బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని గిడుగు రుద్రరాజు ఆరోపించారు. మీడియా సమావేశంలో జాతీయ ఎస్సీ సెల్ కో ఆర్డినేటర్ జంగా గౌతమ్ పాల్గొన్నారు.

# చిక్కడపల్లి, దోమల్ గూడ లింక్ బ్రిడ్జ్ ను ప్రారంభించిన మంత్రి పొన్నం



**హైదరాబాద్, జనవరి 2, పెన్ పవర్:** జీహెచ్ఎంసీ నిధులు రూ.6 కోట్లతో హుస్సేన్ సాగర్ సర్ ప్లస్ నాలా మీదుగా నూతనంగా నిర్మించిన చిక్కడపల్లి దోమల గూడ లింక్ బ్రిడ్జి ను మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్,ఎమ్మెల్యే ముఠా గోపాల్ , మేయర్ గద్వాల విజయలక్ష్మి,డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ ఆర్ వి కర్ణన్, అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, జోనల్ కమిషనర్ రవి కిరణ్, స్థానిక కార్పొరేటర్ లు తదితరులు పాల్గొన్నారు..

## మవోయిస్టు అగ్రనేత బర్సె దేవా లొంగుబాటు



**హైదరాబాద్ పెన్ పవర్:** మావోయిస్టు పార్టీ అగ్రనేత బర్సె దేవా అలియాస్ సుక్కా పోలీసులకు లొంగిపోయాడు. కానీ అధికారికంగా రాష్ట్ర పోలీసు వర్గాలు ఇంకా ధృవీకరించలేదు. చత్తీస్గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణఈ నాలుగు రాష్ట్రాల్లో ఎక్కడ సరెండర్ కావాలనే అంశంలో సుదీర్ఘంగా ఆలోచించిన అనంతరం కొత్తగూడెం జిల్లా పోలీసుల ద్వారా రాయబారం నడిపి లొంగిపోయినట్లు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా పోలీసుల నుంచి ప్రకటన వెలువడే అవకాశమున్నది. హిడ్మా ఎన్కౌంటర్కంటే ముందే ఆయన లొంగిపోవాలనే నిర్ణయానికి వచ్చినట్లు చత్తీస్గఢ్ పోలీసు వర్గాలు తెలిపాయి. హిడ్మా ఎన్కౌంటర్ అనంతరం ఆ ప్రక్రియ వేగవంతమైందని తెలిపాయి. ఆయనపై రూ. 50 లక్షల రివార్డు ఉన్నది.

## జాతీయ రహదారిని కప్పేసిన మంచు

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ విజయవాడ రహదారిపై మంచు దుప్పటి కప్పి వేసింది, ఉదయం 8:30 గంటలు కావస్తున్నా పూర్తిగా మంచు దుప్పటి కప్పడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, వాహనాల యొక్క లైట్లు వేసుకొని నెమ్మదిగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## మహిళా ప్రయాణికులపై ఆర్టీసీ కండక్టర్ బూతు పురాణం

**హైదరాబాద్ పెన్ పవర్:** సామాన్య ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించాల్సిన ఆర్టీసీలో ఒక కండక్టర్ బరితెగించాడు. బస్సులో ప్రయాణిస్తున్న మహిళల పట్ల అత్యంత అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా, నోటికొచ్చినట్లు బూతులు తిడుతూ రెచ్చిపోయిన ఘటన కలకలం రేపుతోంది.హయత్ నగర్ డిపోకు చెందిన 218ఎ నంబర్ గల ఆర్టీసీ బస్సు (ఒ+01ь5653) లో ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సులో ప్రయాణిస్తున్న మహిళలతో సదరు కండక్టర్ చిన్న కారణానికే వివాదానికి దిగాడు. ఈ క్రమంలో సహనం కోల్పోయిన ఆయన, కనీస మర్యాద లేకుండా మహిళలను ఉద్దేశించి అత్యంత అసభ్య పదజాలంతో దూషించాడు. అందరూ చూస్తుండగానే మహిళలపై బూతులతో విరుచుకుపడటంతో ప్రయాణికులు షాక్‌కు గురయ్యారు.ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినప్పటి నుండి కొన్ని చోట్ల కండక్టర్లు మహిళల పట్ల చిన్నచూపు చూస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా జరిగిన ఈ ఘటనలో కండక్టర్ ప్రవర్తనపై తోటి ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యతాయుతమైన ఉద్యోగం లో ఉండి మహిళలను అలా దూషించడం పట్ల సామాజిక మాధ్యమాల్లో సైతం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇప్పటికే సోషల్ మీడియా ద్వారా ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లాయి.కండక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించేలా సిబ్బందికి కౌన్సెలింగ్ ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు. మహిళల రక్షణ కోసం ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్న ఆర్టీసీ యాజమాన్యం, ఈ ఘటనపై ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

**భద్రాద్రి కొత్తగూడెం: పెన్ పవర్:** బూర్గంపాడు మండలం మొండికుంట గ్రామం లో జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడిన విద్యార్థులను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగింది. ఈ ప్రమాదంలో ఒక బాలిక చేతికి తీవ్ర గాయం అయినట్లు సమాచారం. ప్రమాదంలో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులలో నలుగురికి చేతులు ఫ్రాక్చర్ అయ్యాయి. ఒక విద్యార్థికి ఛాతీ ఎముకలు విరగడం జరిగింది. ఈ ప్రమాదంలో బస్సు క్లీనర్ కు తీవ్ర గాయాలయ్యాయి.

## ఇంట్లో పేలుడు ..దంపతులకు గాయాలు

**ఖమ్మం: పెన్ పవర్:** ఖమ్మం నగరశీలోని బుర్హాన్ పురం ఆర్ఆర్ స్కూల్ సమీపంలోని ఓ ఇంట్లో పేలుడు సంభవించింది. ఇంట్లో నిద్రిస్తున్న నారాయణరావు అతని భార్యకు గాయాలు అయ్యాయి. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చేలోపు మంటలను కుటుంబ సభ్యులు, స్థానికులు అదుపు చేసారు. గ్యాస్ లీకేజ్ వల్ల పేలుడు సంభవించినట్ల అనుమానం. పేలుడు దాటికి ఇంట్లో ఉన్న సామాన్లు ధ్వంసం అయ్యాయి. చుట్టుపక్కల ఇళ్లలోని తలుపులు కిటికీలు ధ్వంసం అయ్యాయి. గాయపడిన భార్యాభర్తలు ప్రైవేట్ పాఠశాలలో టీచర్లుగా పనిచేస్తున్నట్టు సమాచారం.

### యూట్యూబర్ అన్వేష్ పై కేసు నమోదు

## దర్యాప్తు ముమ్మరం



**హైదరాబాద్ పెన్ పవర్:** నా అన్వేషణ పేజ్ యూట్యూబర్ అన్వేష్ కేస్ లో పోలీస్ దర్యాప్తు ముమ్మరం అయింది. హిందూ దేవతల పై వివాదాస్పద కేసుల్లో ఇప్పటికే పంజాగుట్ట పిఎస్ లో కేస్ నమోదు అయింది. ఈ నేపథ్యంలో పంజగుట్ట పోలీసులు ఇన్స్టాగ్రామ్ కు లేఖ రాసారు. వీడియో కంటెంట్ లింక్ ఉన్న అన్వేష్ యూజర్ ఐడి వివరాలు ఇవ్వాలని కోరారు. ఇన్స్టాగ్రామ్ నుండి రిప్లై కోసం వెయిట్ చేస్తున్నారు. విదేశాల్లో ఉంటూ ఇష్టానుసారంగా వీడియోలు పోస్ట్. చేసిన అన్వేష్ పై హిందూ సంఘాలు రగిలిపోతున్నాయి. పంజాగుట్ట లో అన్వేష్ పై కరాటే కళ్యాణి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

## మద్యం మత్తులో ఘోర రోడ్డు ప్రమాదం

### ఇద్దరు యువకులు మృతి ..ఒకరికి తీవ్ర గాయాలు...

**రంగారెడ్డి: పెన్ పవర్:** మహేశ్వరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బుచ్చిరెడ్డి పౌల్ట్రీ ఫార్మ్ దగ్గర మద్యం మత్తులో టవేరా వాహనాన్ని నడుపుతూ అదుపుతప్పి పల్టీ కొట్టడంతో,తవుటి శ్రీకాంత్,సంగెం గిరి,అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మహేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది.

ఈ దుర్ఘటన లో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మహేశ్వరం పోలీసులకు సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకొని పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఇలాంటి దుర్ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో రోడ్డు భద్రతపై అవగాహన లు కల్పించిన.వినకుండా మద్యం సేవించి ప్రాణాలు కోల్పోతున్నారు మహేశ్వరం పోలీసులు తెలిపారు. ఒకేసారి ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోవడంతో పోరండ్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# కూకట్ పల్లికి నిధులు ఇవ్వలేదు

### అభివృద్ధిని ఆపేసారు
### ఎమ్మెల్యే మాధవరం

**హైదరాబాద్: పెన్ పవర్:** కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు,కార్పొరేటర్లు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అయింది. మూడు కమిషనర్ల చేసి కూకట్ పల్లి నియోజకవర్గన్నీ ముక్కలు చేశారు. స్టడీ టూర్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం పది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారు. నగరంలో ప్రజలతో రోడ్లు లేక డ్రైనేజీ లేక దోమలతో బాధపడుతున్నారు. కూకట్ పల్లి నియోజకవర్గాన్ని నిధులు ఇవ్వకుండా అభివృద్ధికి ఆపేశారు. కూకట్ పల్లి నియోజకవర్గంలో రెండు వేల కోట్ల రూపాయల భూములను అమ్మింది కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు.

రెండు కోట్ల రూపాయల అభివృధి పనులను బడ్జెట్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టుతున్నారు. కూకట్ పల్లిలో రెండు సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక శంకుస్థాపన చేయలేదు. ఎన్ని కుట్రలు పెట్టిన ఎన్ని ప్రలోభాలు పెట్టిన రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమే . ఫతే నగర్ బ్రిడ్జి,బాలానగర్ అండర్ పాసుకి టెండర్లు జరిగిన పనులు చేయట్లేదు రేవంత్ సర్కార్. స్టడీ టూర్ విహారయాత్రను కూకట్ పల్లి నియోజకవర్గ కార్పొరేటర్లు వ్యతిరేకిస్తున్నారు. కాంగ్రెస్,బీజేపీ పార్టీకి సంబంధించిన నాయకులు బ్యానర్లు వేస్తే చట్టం ఉండదు. బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన నాయకులు బ్యానర్లు పెట్టితే చించేస్తారు. రేవంత్ రెడ్డి రాక్షస పాలన జీవితంలో చూడలేదు. ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేసింది కేసీఆర్ ప్రభుత్వమే . కళ్యాణ లక్ష్మీ ,రెండు వేల రూపాయల పెన్షన్లు,డబుల్ బెడ్ రూముల ఇబ్బంది బిఆర్ఎస్ ప్రభుత్వమే. ఇప్పటికీ వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేయలేదు బిఆర్ఎస్ నాయకులను కార్యకర్తలను ఇబ్బంది పెట్టడం తప్ప. నల్ల చెరువు అభివృధి పనులు చేసిన హైడ్రా నాలా వేయకుండా పనులు చేశారు. 20 సెంటీమీటర్ల వర్షంపడుతే మళ్ళీ ఇండ్లు మునిగిపోతాయి. నగరంలో చెత్తలేకుండా ప్రణాళికలు చేసింది కేటీఆర్. ప్రతి కాలానికి ఆటోలతో చెత్త తీసేవిధంగా ఏర్పాటు చేశాం. స్వచ హైదరాబాద్ చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు.

కూకట్ పల్లి నియోజక వర్గం కార్పొరేటర్లు మాట్లాడుతూ ఒక నెల కాలంలో జిహెచ్ఎంసి కాలపరిమితి ముగుస్తోంది. మేయర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్టడీ టూర్ విహారయాత్ర జరగనుంది. పదవీకాలం అయిపోయాక స్టడీ టూర్ దేనికి ఉపయోగమని ప్రశ్నించారు. ప్రజాధనం వృధా చేయడమే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం అభివృధి శూన్యం. జిహెచ్ఎంసి కార్పొరేటర్లకు రెండు కోట్ల రూపాయలు ఇస్తానని రేవంత్ రెడ్డి సర్కార్ చెప్పింది. ఇప్పటి వరకు రెండు రూపాయలు బడ్జెట్ ఇవ్వకుండా స్టడీ టూర్ వెళ్ళటం హాస్యాస్పదం . ప్రజాధనం ఇష్టం లేదు కాబట్టి కూకట్ పల్లి బిఆర్ఎస్ కార్పొరేటర్లం వెళ్లట్లేదని అన్నారు.

# కొత్తగా లాజిస్టిక్ హబ్స్..

### భారీగా పెరగనున్న భూముల ధరలు, ఉద్యోగాలు


**హైదరాబాద్, జనవరి 2, పెన్ పవర్:**
ప్రస్తుతం నిర్మాణంలో ట్రిపులార్‌తో హైదరాబాద్ నగర విస్తీర్ణం మరింత పెరగనుంది. దీంతో అవుటర్ రింగ్ రోడ్డు, ట్రిపులార్‌ల మధ్య అభివృద్ధిని పరుగులు పెట్టించాలని అధికారులు నిర్ణయించారు. లాజిస్టిక్ హబ్స్ ఏర్పాటు చేయనున్నారు. అవుటర్ రింగ్ రోడ్డు, ప్రాంతీయ వలయ రహదారి మధ్య ప్రాంతాన్ని ప్రభుత్వం భవిష్యత్ అభివృద్ధికి కేంద్రంగా ఎంచుకుంది. ఫోర్త్ సిటీ ఈ జోన్‌లోనే రూపుదిద్దుకోనుండటంతో మౌలిక వసతులపై దృష్టి పెరిగింది. నగర విస్తరణను ప్లాన్ చేసిన పద్ధతిలో ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ ప్రాంతాన్ని ప్రత్యేక గ్రోత్ కారిడార్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.విజన్ డాక్యుమెంట్ ప్రకారం ఈ కారిడార్‌లో శాటిలైట్ టౌన్‌షిప్‌ల ఏర్పాటు కీలకంగా మారింది. రవాణా రంగానికి అవసరమైన లాజిస్టిక్ హబ్‌లు కూడా ప్రధాన ప్రాజెక్టులుగా ప్రతిపాదించారు. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో వీటి డిజైన్, అమలు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. గతంలో పటాన్‌చెరు పరిధిలోని లక్డారం, పటాన్‌చెరు ప్రాంతాల్లో లాజిస్టిక్ పార్కుల ప్రతిపాదనలు వచ్చినా అవి కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు కొత్త విజన్‌తో మళ్లీ ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోంది.ఈ అభివృద్ధి ప్రాంతాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో లాజిస్టిక్ మౌలిక వసతులు ఏర్పాటుకానున్నాయి. కంటెయినర్ డిపోలు

కంటెయినర్ స్టేషన్లు
ఫ్రీ వేర్‌హౌజింగ్ జోన్లు
ఫ్రైట్ విలేజ్‌లు
ఆధునిక గోదాములు
కోల్డ్ స్టోరేజీ యూనిట్లు
ఎయిర్ కార్గో కాంప్లెక్సులు
సరుకు ప్రాసెసింగ్, ప్యాకింగ్ యూనిట్లు

ఇవి అన్నీ ఒకే ప్రాంతంలో ఉండేలా సమగ్ర ప్రణాళిక రూపొందించారు.ప్రస్తుతం నగరంలో సరకు రవాణా వల్ల ట్రాఫిక్ భారం పెరుగుతోంది. దీనికి పరిష్కారంగా లోడింగ్, అన్‌లోడింగ్ కార్యకలాపాలను శివార్లకు తరలించాలనే ఆలోచనకు లాజిస్టిక్ హబ్‌లు బలంగా నిలుస్తున్నాయి. బాటసింగారం, మంగళపల్లి ప్రాంతాల్లో ఇప్పటికే రెండు హబ్‌లు ఉన్నాయి. మహానగరం చుట్టూ కనీసం పది లాజిస్టిక్ హబ్‌లను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో హెచ్ఎండీఏ అడుగులు వేస్తోంది. బ్లూ గ్రీన్‌మొబిలిటీ కాన్సెప్ట్ ఆధారంగా ప్రజా రవాణా, సరుకు రవాణాకు ప్రత్యేక మార్గాలు సిద్ధం కానున్నాయి.ఈ ప్రాజెక్టుల ప్రభావంతో ఓఆర్ఆర్, ట్రిపులార్‌ల మధ్య ప్రాంతాల్లో భూముల విలువలు గణనీయంగా పెరిగే అవకాశాలు
కనిపిస్తున్నాయి. శాటిలైట్ టౌన్‌షిప్‌లు, వేర్‌హౌజ్ జోన్లు, ఇండస్ట్రియల్ యూనిట్లు రావడంతో
రియల్ ఎస్టేట్ డిమాండ్ వేగంగా పెరుగుతుంది. నివాస ప్రాజెక్టులు, కమర్షియల్ స్పేస్‌కు మంచి మార్కెట్ ఏర్పడనుంది.ఉద్యోగాల పరంగా చూస్తే లాజిస్టిక్స్, ట్రాన్స్‌పోర్ట్, వేర్‌హౌజింగ్, కోల్డ్ స్టోరేజీ, ప్యాకింగ్, ఐటీ సపోర్ట్, మేనేజ్‌మెంట్ రంగాల్లో వేల సంఖ్యలో ఉపాధి అవకాశాలు రానున్నాయి. ప్రత్యక్ష ఉద్యోగాలతో పాటు పరోక్షంగా అనేక చిన్న వ్యాపారాలు ఎదిగే అవకాశం ఉంది.

# బీఆర్ఎస్ విధానం ఫాలో అవ్వనున్న కాంగ్రెస్

**హైదరాబాద్, జనవరి 2, పెన్ పవర్:**
తెలంగాణ అసెంబ్లీలో అధికార పార్టీతో పాటు తమకూ పీపీటీ అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. లేకపోతే అన్యాయమని ఆరోపణలు చేస్తోంది. అది అన్యాయమా కాదా అన్నది ప్రజలు నిర్ణయిస్తారు కానీ.. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రతిపక్షాలను ఎంత మేర పరిగణనలోకి తీసుకుంది.. వారి వాయిస్ కు ఎంత మేర అవకాశం కల్పించిందన్నది గుర్తు చేసుకుంటే .. బీఆర్ఎస్ పార్టీ తాము విపక్షానికి ఎప్పుడూ ఇవ్వని కించిత్తు గౌరవాన్ని తాము భారీగా కోరుకుంటోంది.బీఆర్ఎస్ హయాంలో అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీకి గడ్డు పరిస్థితులు ఎదురయ్యాయి. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నప్పటికీ, ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు కాంగ్రెస్ నేతలకు తగిన సమయం ఇచ్చేవారు కాదు. చిన్న చిన్న కారణాలతో సస్పెన్షన్లు చేయడం, మైకులు కట్ చేయడం వంటి ఘటనలు అప్పట్లో నిత్యకృత్యంగా ఉండేవి. సభలో చర్చల కంటే ఏకపక్ష నిర్ణయాలకే ప్రాధాన్యత ఉండేదన్న విమర్శలు ఉన్నాయి. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితుల్లో మార్పు వచ్చిందని, ప్రతిపక్షాలకు మాట్లాడేందుకు తగిన సమయం ఇస్తూ చర్చలకు వేదికగా అసెంబ్లీని మారుస్తున్నారు.దానికి ఇప్పటి వరకూ సాగిన అసెంబ్లీ తీరే సాక్ష్యం అనుకోవచ్చు.2016లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులపై అసెంబ్లీలో సుదీర్ఘంగా పీపీటీ ఇచ్చారు. ఆ సమయంలో ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా తమ వాదనను ప్రజెంటేషన్ ద్వారా వినిపిస్తామని, తమకూ అవకాశం ఇవ్వాలని బతిమిలాడినా బీఆర్ఎస్ కనికరించలేదు. ప్రభుత్వానికి మాత్రమే ప్రజెంటేషన్ ఇచ్చే హక్కు ఉంది అని నాడు బీఆర్ఎస్ నేతలుకరాఖండిగా




చెప్పారు. ప్రతిపక్షం అడిగిన ఏ ఒక్క ప్రశ్నకూ ప్రజెంటేషన్ రూపంలో సమాధానం చెప్పే వీలు కల్పించకుండా కేసీఆర్ తన వాదననే ఏకపక్షంగా వినిపించారు. కానీ ఇప్పుడు మాత్రం తమకూ పీపీటీ ఇవ్వాలనిడిమాండ్ చేస్తున్నారు.చిత్రమేమిటంటే, నాడు ప్రతిపక్షానికి ఏ అవకాశాన్నైతే నిరాకరించారో, నేడు అదే అవకాశాన్ని తమకు కల్పించాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఇవ్వనున్న పీపీటీకి కౌంటర్‌గాతాము కూడా ప్రజెంటేషన్ ఇస్తామని, తమకు ఆ హక్కు ఉందని స్పీకర్‌ను కోరుతున్నారు. నాడు ప్రజాస్వామ్యాన్ని అణచివేసిన వారు, నేడు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఈ డిమాండ్‌పై కాంగ్రెస్ నేతలంటున్నారు. బీఆర్ఎస్ ఒత్తిడిపై కాంగ్రెస్ ప్రభుత్వం చాలా స్పష్టంగా ఉంది. గతంలో బీఆర్ఎస్ ఏ సంప్రదాయాన్ని పాటించిందో, తాము కూడా అదే బాటలో నడుస్తామని సంకేతాలు ఇస్తోంది. అప్పట్లో బీఆర్ఎస్ ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించి ఉంటే.. ఇప్పుడీసమస్యలు వచ్చేవి కావని అనుకోవచ్చు.

# అసెంబ్లీలో పీపీటీ వార్

**హైదరాబాద్, జనవరి 2, పెన్ పవర్:**
తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రాజకీయాలు ముదురుతున్నాయి. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, ముఖ్యంగా కాళేశ్వరంప్రాజెక్టులో జరిగిన అవకతవకలను ఎండగట్టేందుకు ప్రభుత్వం అసెంబ్లీలో పీపీటీని ఒక అస్త్రంగా ఎంచుకుంది. ఇందుకు ప్రతిగా తాము చేసిన అభివృద్ధిని వివరించేందుకు తమకూ పీపీటీ ఇచ్చే అవకాశం కల్పించాలనిబీఆర్ఎస్ పట్టుబడుతోందిముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాగునీటి రంగంలో జరిగిన విధ్వంసం పై ప్రజలకు వివరించాలని నిర్ణయించింది. ప్రాజెక్టులరీ-డిజైనింగ్, అదనపు ఖర్చు, మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు వంటి అంశాలపై పక్కా ఆధారాలతో కూడిన పీపీటీని సభలో ప్రదర్శించేందుకు సిద్ధమైంది. సభ మధ్యలో భారీ స్క్రీన్లను ఏర్పాటు చేసి, ప్రతిపక్షాన్నిఇరకాటంలో పెట్టడమే కాంగ్రెస్ ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వ పీపీటీకి దీటుగా సమాధానం చెప్పేందుకు బీఆర్ఎస్ కూడా సిద్ధమైంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇటీవల స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి ఒక వినతిపత్రంసమర్పించారు. ప్రభుత్వం ఏకపక్షంగా తన వాదనను వినిపిస్తే సరిపోదని, ప్రధాన ప్రతిపక్షంగా తమ వెర్షన్ ప్రజలకు తెలియజేయడానికి తమకూ పీపీటీ చాన్స్ ఇవ్వాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు.ఒకవేళ తమకు అవకాశం ఇవ్వకపోతే, గతంలో ఇలాగే అవకాశం నిరాకరించినప్పుడు ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభను బహిష్కరించిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు.అసెంబ్లీ బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో పీపీటీ అంశం చర్చకు వచ్చింది. శీతాకాల సమావేశాల కాలాన్ని పెంచాలని, తమకు పీపీటీ అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ కోరగా.. స్పీకర్ ఆ వినతిని పరిశీలిస్తామని తెలిపారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వంమాత్రం పాత సంప్రదాయాలను తెరపైకి తెస్తోంది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం పీపీటీలు ఇచ్చినప్పుడు ప్రతిపక్షాలకు ఎప్పుడూ అవకాశం ఇవ్వలేదని, ఇప్పుడు తాము కూడా అదే సంప్రదాయాన్ని పాటిస్తామని కాంగ్రెస్‌మంత్రులు స్పష్టం చేస్తున్నట్లుగా తెలుస్తోంది.2016లో అప్పటి సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రాజెక్టులపై పీపీటీ ఇచ్చినప్పుడు, కాంగ్రెస్ కూడా తమకు అవకాశం ఇవ్వాలని అడిగింది. కానీ అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వంనిరాకరించింది. ఇప్పుడు సీన్ రివర్స్ కావడంతో, అప్పుడు మీరు మాకు ఇవ్వలేదు.. ఇప్పుడు మేము మీకు ఇవ్వం అనే కాంగ్రెస్ వాదిస్తోంది. ఆ సంప్రదాయాన్ని పాటిస్తామని అంటున్నారు. తమకు అసెంబ్లీలో పీపీటీ చాన్స్ ఇవ్వకపోతే.. కాంగ్రెస్‌కు కౌంటర్ గా తెలంగాణ భవన్‌లో పీపీటీ ఇచ్చేందుకు హరీష్ రావు ప్రయత్నాలు చేస్తున్నారు.

# ఏపీలో కొత్తగా నాలుగు విద్యుత్ ప్లాంట్లు

**నెల్లూరు జనవరి 2, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘన వ్యర్థాల సమస్యకు చెక్ పెట్టేస్తోంది! రాష్ట్రంలో కొత్తగా నాలుగు చోట్ల చెత్త నుంచి కరెంటు ఉత్పత్తి చేసే ప్లాంట్లు రానున్నాయి. విశాఖ, గుంటూరు తర్వాత ఇప్పుడు నెల్లూరు, కాకినాడ, కడప, కర్నూలు జిల్లాల్లో ఈ ప్లాంట్లు కొలువుదీరనున్నాయి. దీనితో పర్యావరణానికి మేలుతో పాటు, విద్యుత్ అవసరాలు తీరనున్నాయి. ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయిఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘన వ్యర్థాల సమస్యను పరిష్కరించడానికి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొత్తగా చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసేలా నాలుగు ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తును డిస్కంలకు సరఫరా చేయడానికి ఒప్పందం చేసుకున్నారు. అమరావతిలోని సచివాలయంలో మంత్రి నారాయణ, ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంపై డిస్కంల అధికారులు, ప్లాంట్ల నిర్వాహకులు సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం కొత్తగా ఏర్పాటుచేస్తున్న నాలుగు ఘన వ్యర్థాల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల నుంచి వచ్చే కరెంటును డిస్కంలు కొనుగోలు చేస్తాయి. దీనివల్ల రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణతో పాటు విద్యుత్ ఉత్పత్తి కూడా పెరుగుతుంది.ప్రస్తుతం విశాఖపట్నం, గుంటూరులలో ఇప్పటికే ఇలాంటి ప్లాంట్లు పనిచేస్తున్నాయి. ఇప్పుడు నెల్లూరు, కాకినాడ, కడప, కర్నూలు జిల్లాల్లో కొత్త ప్లాంట్లు రానున్నాయి. ఈ ప్లాంట్లు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మిస్తున్నారు. ఈ కొత్త ప్లాంట్లు పూర్తయితే, రాష్ట్రంలో రోజుకు 7వేల టన్నుల ఘన వ్యర్థాలను విద్యుత్తుగా మార్చవచ్చు. ఇది పర్యావరణానికి మేలు చేయడంతో పాటు, విద్యుత్ అవసరాలను తీర్చడంలో కూడా సహాయపడుతుంది. వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేయడం అనేది ఒక ఆధునిక పద్ధతి. దీనివల్ల చెత్తను పారవేయడం సులభం అవుతుంది. అలాగే, కరెంటు కూడా ఉత్పత్తి అవుతుంది. ఈ ప్రక్రియలో, వ్యర్థాలను కాల్చి లేదా ఇతర పద్ధతుల ద్వారా వేడి చేసి, ఆ వేడితో టర్బైన్లను తిప్పి విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు. 'వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేయడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు, రాష్ట్రానికి అదనపు



ఆదాయాన్ని కూడా సమకూర్చవచ్చు' అన్నారు మంత్రి నారాయణఈ ప్రాజెక్టులు సకాలంలో పూర్తయ్యేలా చూస్తాం.. డిస్కంలు, ప్లాంట్ల నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలి' అన్నారు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు కానున్న నాలుగు కొత్త ప్లాంట్లకు అవసరమైన స్థలాన్ని ప్రభుత్వం కేటాయిస్తుందని మంత్రి నారాయణ తెలిపారు. ప్రైవేట్ సంస్థలు ఒక్కో ప్లాంట్ ఏర్పాటుకు రూ.350 కోట్ల నుంచి రూ.400 కోట్ల వరకు పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తును డిస్కంలకు సరఫరా చేయడానికి ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. అలాగే పట్టణ, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల నుంచి వచ్చే 7,500 టన్నుల వ్యర్థాలలో 7,000 టన్నులు ఈ ప్లాంట్లకు వెళ్తాయన్నారు. మిగిలిన 500 టన్నుల వ్యర్థాల నిర్వహణకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నామన్నారు. ఈ ప్లాంట్ల నిర్మాణం వచ్చే రెండేళ్లలో పూర్తవుతుందని.. మార్కెట్ వ్యర్థాల నిర్వహణకు ఏడు ప్లాంట్లు, విశాఖ, విజయవాడ, తిరుపతిలో మూడు ఈ-వేస్ట్ ప్లాంట్లు, మరో మూడుచోట్ల చికెన్ వేస్ట్ ప్లాంట్ల ఏర్పాటుకు టెండర్లు పిలుస్తున్నామని మంత్రి నారాయణ చెప్పారు. ఈ కొత్త విద్యుత్ ప్లాంట్లు వ్యర్థాల నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేస్తాయి. దీనివల్ల పర్యావరణానికి మేలు జరుగుతుంది. ప్రైవేట్ సంస్థలు పెట్టుబడులు పెట్టడం వల్ల ప్రభుత్వానికి ఆర్థిక భారం తగ్గుతుంది. ఈ ప్లాంట్లు పూర్తయితే రాష్ట్రంలో విద్యుత్ కొరత తీరడంతో పాటు, వ్యర్థాల నిర్వహణ సమస్య కూడా పరిష్కారం అవుతుంది. ఈ-వేస్ట్ ప్లాంట్లు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సురక్షితంగా పారవేయడానికి ఉపయోగపడతాయి. చికెన్ వేస్ట్ ప్లాంట్లు మాంసం వ్యర్థాలను ఉపయోగించుకుంటాయి. ఈ విధంగా, రాష్ట్రం వ్యర్థాల నిర్వహణలో ఒక ముందడుగు వేస్తోంది.

# వైసీపీకి మరో తలనొప్పి

**ఏలూరు, జనవరి 2, పెన్ పవర్:**
వైఎస్ఆర్‌సీపీకి దేవుడే దిక్కయ్యాడు. అది కూడా హిందూ దేవుళ్లే దిక్కయ్యారు. ఎందుకంటే రాజకీయాలు చేయడానికి. ఎక్కడ ఏ చిన్న అంశం జరిగినా పెద్దవివాదం చేసేందుకు వచ్చేస్తున్నారు. ఆ వివాదంతో హిందువుల్ని తమ వైపు తిప్పుకోవాలని అనుకుంటున్నారేమో కానీ.. వారు దేవుడితో చేస్తున్న రాజకీయమే హైలెట్ అవుతోంది. ఓ క్రిస్టియన్ నేతృత్వంలో ఉన్న పార్టీ హిందువుల్ని.. హిందూ దేవుళ్లను చులకన చేయాలని చూస్తోందన్న ఆరోపణలకు కారణం అవుతోంది. కానీ వైసీపీ నేతలు మాత్రం ఈ విషయాన్ని గుర్తించలేక తమ గుడ్డెద్దు చేలో పడిన తరహా రాజకీయాలు తాము చేసుకుటూ పోతున్నారు. మనుషుల్లో రకరకాల మనస్థత్వాలు ఉన్న వారు ఉంటారు. కోపంతో..కసితో..కక్షతో తాము ఏం చేస్తున్నామో తెలియని స్థితిలో నేరాలు చేసేవారు ఉంటారు. అలాంటి వాడొకడు..ద్రాక్షామంలో శివలింగాన్ని ధ్వంసం చేశాడు. ఓ పూజారిపై కోపంతో .. ఆ శివలింగాన్నిఆ పూజారి రోజూ పూజలు చేస్తాడన్న కారణంతో ఆ శివలింగాన్ని ధ్వంసం చేశాడు. అతను కూడా శివభక్తుడే .కానీ ద్వేషంతో అతని కళ్లు మూసుకుపోయి ఘోరం చేశాడు. దానికి అతను శిక్ష అనుభవిస్తాడు. కానీ ఈ ఘటనతో రాజకీయం చేయాలనుకున్న వైసీపీ .. అంత కంటే పెద్ద తప్పిదం చేసింది. దేవుడికి జరగాల్సిన కార్యక్రమాలను అడ్డుకునే ప్రయత్నం చేసింది. దీన్ని రాజకీయం చేయాలనుకుంది. హిందూ దేవుళ్ల విషయంలో వైసీపీ ఎలాంటి జోక్యం చేసుకున్నా అది ఆ పార్టీకి పెను సమస్యగా మారుతుంది. ఆపార్టీ బ్యాక్ గ్రౌండ్ అలాంటిది. ఆ పార్టీ అధికారంలో ఉన్న కాలంలో టీటీడీని ఎంత భ్రష్టుపట్టించారో మరో ఇరవై ఏళ్ల వరకూ హిందువులు మర్చిపోయారు. ఉద్ధృతంగా సాగిన మత మార్పిళ్లకు జగన్ ప్రభుత్వం ఎలా సహకరించిందో కూడా మర్చిపోరు. వైసీపీ నేతల్లో చాలా మంది హిందువులు




ఉంటారు. దేవుడిపై అమితమైన భక్తిని చూపిస్తూ ఉంటారు. కానీ వారే దేవుడిని దోపిడీ చేశారు. హిందూత్వాన్ని కించపరిచారు. ఇలాంటివన్నీ ప్రజల ముందు ఉన్నాయి. వైసీపీ నేతలు ఇప్పుడు తాము హిందూత్వాన్ని కాపాడుతామని.. కూటమి ప్రభుత్వంలో ఏదో జరిగిపోతుదంని వస్తే ప్రజలు నమ్మరు. ఏమైనా చేసినా అది వైసీపీ నేతలే చేసి ఉంటారని అనుమానిస్తారు. వారి ఇమేజ్ అలాంటిది.వైసీపీ నేతలు దేవుడ్ని నమ్ముకోవాలి. ఏ దేవుడ్ని నమ్ముతారో ఆ దేవుడిక్ ప్రార్థనలు చేయాలి. పూజలు చేయాలి. కానీ రాజకీయం చేయకూడదు. వివాదాలు సృష్టించి రాజకీయం చేస్తే మొదటికే మోసం వస్తుంది. ఇప్పటికే వారు దేవుడికి చేసిన అన్యాయం అంతా ఇంతా కాదు. కర్మప్రకారం శిక్షలు అనుభవించాల్సిందే. ఆ శిక్షలు అనుభవిస్తున్నారు కూడా. అందుకే.. ఇప్పటికైనా తెలుసుకుని వైసీపీ నేతలు.. దేవుడిపై కుట్రలు చేయడం.. సంబంధం లేని అంశాలతో హిందూత్వాన్ని కించపరిచేలా చేయడం మానుకుంటే.. దేవుడి ఆగ్రహానికి గురి కాకుండా ఉంటారన్న సలహాలు సొంత పార్టీ నుంచే వస్తున్నాయి

# 4న భోగాపురంనుంచి ట్రయిల్ రన్

**విజయనగరం, జనవరి 2, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ విమానయాన చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలు కాబోతోంది. దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర వాసులు ఎదురుచూస్తున్న కల సాకారం అయ్యే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మితమవుతున్న 'జీఎంఆర్ విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం' ట్రయల్ రన్ కు సిద్ధమవుతోంది. దీన్ని భోగాపురం ప్రాంతంలో నిర్మించడంతో అందరూ దీన్ని భోగాపురం ఎయిర్ పోర్టుగా పిలుస్తున్నారు. అయితే దీనికి అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ అని నామకరణం చేయనున్నట్టు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. జనవరి 4న ఈ విమానాశ్రయం నుంచి తొలి టెస్ట్ ఫ్లైట్ ఎగరనుంది. ఇది కేవలం ఒక సాంకేతిక ప్రక్రియ మాత్రమే కాదు.. అది ఉత్తరాంధ్ర ప్రగతికి నాంది ప్రస్తావన. జనవరి 4వ తేదీన భోగాపురం రన్‌వే పై తొలి విమానం దిగనుందని నిర్మాణ సంస్థ జీఎంఆర్ ప్రకటించింది. ఈ అద్భుత ఘట్టాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దగ్గరుండి పర్యవేక్షించనున్నారు. ఈ ట్రయల్ రన్ ద్వారా రన్‌వే నాణ్యత, సిగ్నలింగ్ వ్యవస్థ, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ పనితీరును పరిశీలిస్తారు. ఇది విజయవంతమైతే, అతి త్వరలోనే పూర్తిస్థాయి వాణిజ్య విమానయాన సేవలు ప్రారంభమవుతాయి. 2026 మే నుంచి ఈ విమానాశ్రయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలనేది ప్రభుత్వ లక్ష్యంప్రస్తుతం విశాఖపట్నంలో ఉన్న విమానాశ్రయం నేవీ ఆధీనంలో ఉండటం వల్ల అనేక పరిమితులు ఉన్నాయి. కానీ, భోగాపురం విమానాశ్రయం పూర్తిస్థాయి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్ట్. సుమారు 2,203 ఎకరాల విస్తీర్ణంలో దీనిని నిర్మిస్తున్నారు. తొలి దశలో ఏటా 60 లక్షల ప్రయాణికుల సామర్థ్యంతో ఇది అందుబాటులోకి వస్తోంది. భవిష్యత్తులో దీనిని ఏటా 40 మిలియన్ల ప్రయాణికుల సామర్థ్యానికి పెంచేలా డిజైన్ చేశారు. ఇందులో నిర్మించిన 3800 కిలోమీటర్ల రన్‌వే ప్రపంచంలోనే అతిపెద్ద విమానమైన ఎయిర్‌బస్ ఏ380 వంటి వాటిని కూడా దించేందుకు అనుకూలంగా ఉంటుంది. కేవలం ప్రయాణికులే కాదు, అంతర్జాతీయ ఎగుమతులు, దిగుమతుల కోసం భారీ కార్గో టెర్మినల్ కూడా ఇక్కడ సిద్ధమవుతోంది. భోగాపురం విమానాశ్రయం కేవలం ప్రయాణ సౌకర్యం మాత్రమే కాదు, అది ఆర్థిక వృద్ధికి ఇంజిన్ లాంటిది. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు ఇది ముఖద్వారంగా మారుతుంది. ఫార్మా, ఐటీ, సీ-ఫుడ్ ప్రాసెసింగ్ వంటి పరిశ్రమలకు అంతర్జాతీయ కనెక్టివిటీ పెరిగి, పెట్టుబడులు వెల్లువెత్తుతాయి. అరకు లోయ, విశాఖ బీచ్‌లు, శ్రీకాకుళంలోని పురాతన ఆలయాలకు విదేశీ పర్యాటకుల రాక గణనీయంగా పెరుగుతుంది. ఎయిర్ పోర్ట్ అనుబంధంగా ఏరో సిటీ, హోటళ్లు, లాజిస్టిక్స్ రంగాలు అభివృద్ధి చెంది వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి లభిస్తుంది. ఇన్నాళ్లూ హైదరాబాద్, బెంగళూరు, చెన్నై విమానాశ్రయాలపై ఆధారపడిన కార్గో రవాణా, ఇకపై నేరుగా విశాఖ నుంచే జరిగే ఆస్కారం ఉంది. ముఖ్యంగా నైట్ ల్యాండింగ్ సౌకర్యాలు, 24/7 ఆపరేషన్స్ అందుబాటులో ఉండటం వల్ల అంతర్జాతీయ విమానయాన సంస్థలు భోగాపురం వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు వేగవంతం కావడంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పాత్ర కీలకం. పిన్న వయసులోనే కేంద్ర విమానయాన శాఖ బాధ్యతలు చేపట్టిన ఆయన, తన సొంత ప్రాంతమైన ఉత్తరాంధ్రలో ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఢిల్లీ నుంచి నేరుగా భోగాపురానికి విమానం రావడం ఒక చారిత్రక ఘట్టంగా మారనుందని చెబుతున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఆ రోజు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు హాజరయ్యే అవకాశముంది. కొత్త ఏడాది మొదట్లోనే విమానం రూపంలో వచ్చిన శుభవార్త ఉత్తరాంధ్ర ప్రజలకు ప్రత్యేక ఆనందాన్ని ఇచ్చిందని పలువురు అభిప్రాయపడుతున్నారుఈ అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తిస్థాయిలో ప్రారంభమైతే ఉత్తరాంధ్ర ప్రపంచంతో నేరుగా అనుసంధానమవుతుందని అంచనా. పరిశ్రమలు, వ్యాపారం, పర్యాటకం, ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. విజయనగరం జిల్లాతో పాటు సమీప ప్రాంతాల అభివృద్ధికి ఇది కీలక మలుపు అవుతుందని విశ్వాసం వ్యక్తమవుతోంది. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర భవిష్యత్తును కొత్త దిశలో నడిపించబోతోందన్న నమ్మకం ప్రజల్లో బలంగా కనిపిస్తోంది. ఢిల్లీ స్థాయిలో అనుమతులు త్వరగా మంజూరు చేయించడం, నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు సమీక్షించడం, అడ్డంకులను తొలగించడంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపించారు. విమానయానం సామాన్యుడికి చేరువ కావాలనే ఆయన లక్ష్యానికి భోగాపురం ఒక బలమైన పునాదిగా నిలవనుంది. మొత్తంగా, భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం. జనవరి 4న జరగబోయే టెస్ట్ ఫ్లైట్ ఆ ప్రాంత అభివృద్ధికి సంకేతం. ఇది పూర్తయి అందుబాటులోకి వస్తే, ఉత్తరాంధ్ర రూపురేఖలే కాకుండా, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక స్థితిగతులు కూడా సానుకూలంగా మారుతాయని నిస్సందేహంగా చెప్పవచ్చు.

# అడ్డంగా బుక్కైన ఎమ్మెల్యే

**తిరుపతి జనవరి 2, పెన్ పవర్:** తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి రాజకీయాల్లో కలకలం రేపిన జనసేన కార్యకర్త శ్రీనివాసులు అలియాస్ రాయుడు హత్య కేసు కీలక మలుపు తిరిగింది. ఏడాది కాలంగా మిస్టరీగా, రాజకీయ ఆరోపణల నడుమ సాగుతున్న ఈ కేసు విచారణలో చెన్నై పోలీసులు దూకుడు పెంచారు. ఈ హత్యతో సంబంధం ఉందన్న అనుమానాలు, మృతుడి వీడియో వాంగ్మూలం ఆధారంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని విచారించేందుకు చెన్నై పోలీసులు సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇదే జరిగితే జిల్లా రాజకీయాల్లో పెను సంచలనం ఖాయంగా కనిపిస్తోంది. ఈ కేసులో ప్రాథమికంగా జనసేన మాజీ ఇన్‌ఛార్జి కోట వినుత, ఆమె భర్త కోట చంద్రబాబులను నిందితులుగా భావించినప్పటికీ, మృతుడు రాయుడు చనిపోవడానికి ముందు చిత్రీకరించిన ఒక వీడియో ఇప్పుడు విచారణను మరో మలుపు తిప్పింది. సుమారు 19.42 నిమిషాల నిడివి ఉన్న ఈ వీడియోలో రాయుడు సంచలన విషయాలను వెల్లడించారు. తనను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రలోభపెట్టారని, తన అనుచరుడు సుజిత్‌రెడ్డి ద్వారా సంప్రదింపులు జరిపారని రాయుడు ఆ వీడియోలో పేర్కొన్నట్లు సమాచారం. ముఖ్యంగా కోట దంపతులను రోడ్డు ప్రమాదంలో అంతమొందించాలని తనపై ఒత్తిడి తెచ్చినట్లు రాయుడు చెప్పడం గమనార్హం. ఈ వీడియోనే ఇప్పుడు ఎమ్మెల్యే మెడకు చుట్టుకునేలా కనిపిస్తోంది.గతంలో ఈ కేసులో అరెస్టయిన కోట వినుత, చంద్రబాబులు మొదటి నుంచి తాము నిర్దోషులమని వాదిస్తూనే ఉన్నారు. రాయుడు హత్యలో తమ ప్రమేయం లేదని, ఇదంతా రాజకీయ కుట్రలో భాగంగా తమను ఇరికించే ప్రయత్నమని వారు ఆరోపించారు. దీని వెనుక ఎమ్మెల్యే బొజ్జల హస్తం ఉందన్నది వారి ప్రధాన ఆరోపణ. ఇప్పుడు రాయుడి వీడియో బయటకు రావడం, అందులో బొజ్జల పేరు ప్రస్తావనకు రావడంతో కోట దంపతుల వాదనకు బలం చేకూరుతోంది. ఈ నేపథ్యంలోనే కోట దంపతుల వాంగ్మూలాన్ని, రాయుడి వీడియోను సాంకేతిక ఆధారంగా తీసుకుని చెన్నై పోలీసులు ఎమ్మెల్యేను విచారించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.శ్రీకాళహస్తి మండలం బొక్కసంపాళెం గ్రామానికి చెందిన జనసేన క్రియాశీలక కార్యకర్త శ్రీనివాసులు అలియాస్ రాయుడు గతేడాది జులై 7న అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. జులై 7న అదృశ్యమైన రాయుడి మృతదేహం మరుసటి రోజు చెన్నైలోని కూవం నదిలో తేలింది. అప్పట్లో ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. కేసు నమోదు చేసిన చెన్నై పోలీసులు దర్యాప్తు చేపట్టి కోట వినుత దంపతులతో పాటు వారి అనుచరులు గోపి, కారు డ్రైవర్ షేక్ దాసన్, శివకుమార్‌లను అరెస్టు చేశారు. అయితే, ఇది కేవలం వ్యక్తిగత కక్షల వల్ల జరిగిన హత్య కాదని, దీని వెనుక పెద్ద రాజకీయ హస్తం ఉందన్న అనుమానాలు అప్పట్లోనే వ్యక్తమయ్యాయి. ఈ కేసులో ఇటీవల జనసేనకే చెందిన పేట చంద్రశేఖర్‌ను పోలీసులు విచారించారు. ఆయన నుంచి సేకరించిన సమాచారం, రాయుడి వీడియో, కోట దంపతుల ఆరోపణలన్నింటినీ క్రోడీకరించుకున్న చెన్నై పోలీసులు.. తదుపరి చర్యగా ఎమ్మెల్యే బొజ్జలకు సమన్లు జారీ చేసే అవకాశం ఉంది. అయితే, బొజ్జల సుధీర్‌రెడ్డి మాత్రం ఈ ఆరోపణలను గతంలోనే ఖండించారు. రాయుడి హత్యతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కానీ, సాక్ష్యాధారాలు వేరేలా ఉండటంతో పోలీసుల చర్య ఎలా ఉండబోతోందన్నది ఆసక్తికరంగా మారింది.ఒక కార్యకర్త హత్య కేసులో ఏకంగా సిట్టింగ్ ఎమ్మెల్యే విచారణకు హాజరు కావాల్సి రావడం రాజకీయంగా ఆయనకు ఇబ్బందికర పరిణామమే. ఒకవేళ రాయుడు వీడియోలో పేర్కొన్నట్లుగా.. కోట దంపతుల హత్యకు కుట్ర జరిగిందని రుజువైతే, ఈ కేసు రాష్ట్ర రాజకీయాల్లోనే సంచలనం సృష్టిస్తుంది. ఇది కేవలం హత్య కేసుగానే కాకుండా, రాజకీయ ప్రత్యర్థులను అంతమొందించేందుకు జరిగిన కుట్రగా మారే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో చెన్నై పోలీసుల విచారణలో ఇంకెన్ని కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయో వేచి చూడాలి.

# సలహాదారులు ఎన్నాళ్లు...

**విజయవాడ, జనవరి 2, పెన్ పవర్:** అధికారం మారినా పద్ధతులు మారలేదు.. ప్రభుత్వాలు మారినా సలహాల సంస్కృతి పోలేదు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయ వర్గాల్లో, సచివాలయ పరిసరాల్లో వినిపిస్తున్న ప్రధాన చర్చ ఇది. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో సలహాదారుల వ్యవస్థపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన తెలుగుదేశం పార్టీ, నేడు అధికారంలోకి వచ్చాక అదే బాటలో పయనిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వం ముగ్గురు ప్రముఖులను సలహాదారులుగా నియమించడంతో ఈ చర్చ మరోసారి తెరపైకి వచ్చింది.రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీధర్, ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణరాజు, చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్‌లను వివిధ విభాగాలకు సలహాదారులుగా నియమించింది. వీరిలో శ్రీధర్, మంతెన సత్యనారాయణరాజు తమ తమ రంగాల్లో లబ్ధప్రతిష్టులే అయినప్పటికీ, ప్రభుత్వ పాలనలో వీరి పాత్ర ఎంతవరకు అవసరం అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సలహాదారుల నియామకం ఒక ప్రహసనంగా మారిందన్నది బహిరంగ రహస్యం. దాదాపు ప్రభుత్వంలోని ప్రతి శాఖకు, ఉప శాఖకు కూడా సలహాదారులను నియమించి, వారికి క్యాబినెట్ ర్యాంకులు, భారీ జీతభత్యాలు, వాహనాలు, సిబ్బందిని సమకూర్చడంపై అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అది "సలహాదారుల ప్రభుత్వం" అని, ప్రభుత్వ ధనాన్ని వృధా చేస్తున్నారని నాడు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సహా కూటమి నేతలంతా దుయ్యబట్టారు. "మేము అధికారంలోకి వస్తే ఈ సలహాదారుల వ్యవస్థను ప్రక్షాళన చేస్తాం" అని హామీ ఇచ్చారు. కానీ, నేడు కూటమి ప్రభుత్వం కూడా విడతలవారీగా సలహాదారులను నియమించుకుంటూ వెళ్తుండటంతో, అప్పుడు తప్పు అయినది, ఇప్పుడు ఒప్పు ఎలా అవుతుంది? అని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.ఈ సలహాదారుల నియామకాల్లో వినిపించే ప్రధానమైన, సాంకేతికమైన అభ్యంతరం.. బ్యూరోక్రసీకి సంబంధించింది. అత్యంత కఠినమైన పరీక్షల్లో నెగ్గి, దశాబ్దాల తరబడి పాలనా అనుభవం ఉన్న ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్-1 అధికారులు ప్రభుత్వ యంత్రాంగంలో అందుబాటులో ఉన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి సెక్షన్ ఆఫీసర్ వరకూ వేల సంఖ్యలో ఉద్యోగులు ఉన్నారు. విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి, ప్రభుత్వానికి దిశానిర్దేశం చేయడానికి ఈ వ్యవస్థ సరిపోదా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అనుభవజ్ఞులైన అధికారులు ఉండగా, బాహ్య వ్యక్తులను సలహాదారులుగా తీసుకురావడం వల్ల అధికారుల మనోధైర్యం దెబ్బతింటుందనే వాదన కూడా ఉంది. ఒకవేళ సలహాలు నిజంగా అవసరమైతే, ఆయా రంగాల నిపుణులతో తాత్కాలిక కమిటీలు వేయవచ్చు కానీ, పూర్తిస్థాయి పదవులు ఎందుకనేది మేధావుల ప్రశ్న.ఈ నియామకాల వెనుక రాజకీయ ఉపాధి కోణం ఉందన్న విమర్శలను కొట్టిపారేయలేం. ఎన్నికల్లో టిక్కెట్లు దక్కని నాయకులకు, పార్టీ కోసం కష్టపడిన సానుభూతిపరులకు, సోషల్ మీడియాలో మద్దతుగా నిలిచిన వారికి ఏదో ఒక హోదా కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ పదవులు సృష్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వం తమ పార్టీ వారిని ఎలాగైతే అకాడమీల చైర్మన్లుగా, సలహాదారులుగా నియమించిందో, ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా తమ మద్దతుదారులను తృప్తి పరచడానికి ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. ఇది కేవలం రాజకీయ నిరుద్యోగులకు ఉపాధి కల్పించే పథకంలా మారిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.ఇప్పటికే రాష్ట్రం తీవ్ర ఆర్థిక లోటులో ఉందని, అప్పుల కుప్పగా మారిందని ప్రభుత్వ పెద్దలే శ్వేతపత్రాలు విడుదల చేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో.. సలహాదారుల జీతభత్యాలు, వారి కార్యాలయాల నిర్వహణ, వసతుల కల్పన ఖజానాపై అనవసరమైన భారాన్ని మోపుతాయి. ఒక్కో సలహాదారుడి నిర్వహణకు నెలకు లక్షల్లో ఖర్చు అవుతుంది. పొదుపు చర్యలు పాటించాల్సిన ప్రభుత్వమే ఇలా ఆర్భాటాలకు పోవడం ఎంతవరకు సమంజసం అనే చర్చ సామాన్యుల్లోనూ జరుగుతోంది.ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి నిపుణుల సలహాలు అవసరమే. కానీ అవి పాలనను మెరుగుపరిచేవిగా ఉండాలి తప్ప, రాజకీయ అవసరాలు తీర్చేవిగా ఉండకూడదు. కార్టూనిస్టులు, ప్రకృతి వైద్యులు సమాజానికి అవసరమే కానీ, వారి సేవలను ప్రభుత్వ పాలనా యంత్రాంగంలో ఎలా వినియోగించుకుంటారో, తద్వారా సామాన్యుడికి ఏం మేలు జరుగుతుందో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. లేదంటే, గత ప్రభుత్వం చేసిన తప్పునే ఈ ప్రభుత్వం కూడా చేస్తోందన్న అపవాదును కూటమి సర్కార్ మూటగట్టుకోక తప్పదు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ఆకస్మిక వరదలు.. 17 మంది మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆఫ్ఘనిస్తాన్‌ను ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. వరదలు కారణంగా 17 మంది మృతి చెందారని, 11 మంది గాయపడినట్లు ఆఫ్ఘానిస్తాన్ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. హెరాత్ ప్రావిన్స్‌లోని కబ్కాన్ జిల్లాలో గురువారం ఒక ఇంటి పైకప్పు కూలిపోవడంతో ఐదుగురు కుటుంబ సభ్యులు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమవారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో పలు ప్రాంతాలు అతలాకుతలమవుతున్నాయి. మధ్య, ఉత్తర, దక్షిణ, పశ్చిమ ప్రాంతాల్లో నష్టం అధికంగా జరిగినట్లు అధికారులు తెలిపారు. వరదలు కారణంగా పశువులు కూడా చనిపోయాయి. వరద ప్రభావం 1,800 కుటుంబాలపై పడిందన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని.. వరద తీవ్రతను అంచనా వేయడానికి బృందాలను పంపించినట్లు ప్రభుత్వం తెలిపింది. దేశవ్యాప్తంగా చాలా కాలంగా వర్షాలు లేక కరువు పరిస్థితులు ఎదుర్కొంటుంది. భారీ వర్షాలు కురిసిప్పటికీ ఆకస్మిక వరదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలు పరిస్థితి మరింత దారుణంగా మారింది.

## న్యూయార్క్ మేయర్‌గా మామ్దానీ ప్రమాణస్వీకారం

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతీయ సంతతికి చెందిన జోహ్రాన్ మామ్దానీ గురువారం ఉదయం న్యూయార్క్ నగర మేయర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. డెమొక్రాట్ అయిన 34 సంవత్సరాల మామ్దానీ నాలుగు సంవత్సరాలు ఆ పదవిలో కొనసాగుతారు. వామపక్ష భావజాలం కలిగిన మామ్దానీ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తారు. మాన్‌హట్టన్ సిటీ హాలు కింద ఉన్న చారిత్రక సిటీ హాల్ సబ్‌వే స్టేషన్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. అనంతరం మాట్లాడుతూ 'ఇది నిజమైన జీవితకాలపు గౌరవం, గొప్ప విశేషాధికారం' అని వ్యాఖ్యానించారు. మమ్దానీ చేత న్యూయార్క్ అటార్నీ జనరల్ లెతితియా జేమ్స్ ప్రమాణం చేయించారు. మామ్దానీకి ఆయన అత్యంత రాజకీయ సన్నిహితుడు. కాగా మధ్యాహ్నం సిటీ హాలులో జరిగిన కార్యక్రమంలో మామ్దానీ మరోసారి ప్రమాణస్వీకారం చేశారు. దీనికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మామ్దానీకి రాజకీయ స్ఫూర్తి ప్రదాతలలో ఒకరైన అమెరికా సెనెటర్ బెర్నీ శాండర్స్ ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. న్యూయార్క్ మేయర్ పదవికి జరిగిన ఎన్నికలో మామ్దానీని ఓడించేందుకు ట్రంప్ ఎంతగానో ప్రయత్నించారు. మామ్దానీ గెలిస్తే న్యూయార్క్ నగరానికి ప్రభుత్వ నిధులు ఆపేస్తానని బెదిరించారు. నేషనల్ గార్డ్స్ దళాలను మోహరించాలని కూడా చూశారు. అయితే మామ్దానీ ఎన్నిక తర్వాత ట్రంప్ తన మద్దతుదారులను, విమర్శకులను ఆశ్చర్యపరుస్తూ ఆయనను శ్వేతసౌధానికి ఆహ్వానించారు. ఈ భేటీ సుహృద్భావ వాతావరణంలో జరిగిందని చెప్పారు. 'ఆయన గొప్ప పనులు చేయాలని కోరుకుంటున్నాను. అందుకు సహకరిస్తాను' అని అన్నారు.

## ఓడలపై అమెరికా దాడి

**హైదరాబాద్ పెన్ పవర్:** పసిఫిక్ సముద్రంలో మాదక ద్రవ్యాలు రవాణా చేస్తున్నాయన్న అనుమానంతో ఓడలపై అమెరికా సైన్యం జరిపిన దాడిలో ఎనిమిది మంది మరణించారు. సజీవంగా బయటపడ్డ వారి ఆచూకీ కోసం కోస్ట్ గార్డ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో తమ దళాలు మూడు ఓడలపై దాడి చేశాయని అమెరికా సైనిక దక్షిణ కమాండ్ తెలిపింది. 'తొలి దాడిలో ఓ ఓడపై దాడి చేశాం. మాదక ద్రవ్యాలు రవాణా చేస్తున్న ముగ్గురు ఉగ్రవాదులు చనిపోయారు. మిగిలివారు రెండు ఓడలను వదిలేసి సముద్రంలో దూకి దూరంగా వెళ్లిపోయారు. మా సైన్యం ఆ ఓడలను సముద్రంలో ముంచేసింది' అని దక్షిణ కమాండ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలియజేసింది. ఆ తర్వాత దక్షిణ కమాండ్ మరో ప్రకటన విడుదల చేస్తూ రెండు ఓడలపై దాడులు చేశామని తెలిపింది. మొత్తంగా తాము జరిపిన దాడుల్లో ఐదుగురు చనిపోయారని చెప్పింది. ఈ దాడుల నుంచి బతికి బయటపడిన వారి కోసం గాలింపు జరుపుతున్నామని పేర్కొంది. కాగా రాయిటర్స్ వార్తా సంస్థ కథనం ప్రకారం ఎనిమిది మంది సముద్రంలో దూకేశారని తెలుస్తోంది. వారి ఆచూకీ తెలుసుకునేందుకు కోస్ట్ గార్డ్ సిబ్బంది సీ–130 యుద్ధ విమానాన్ని రంగంలోకి దింపింది. తాను జరుపుతున్న దాడుల నుంచి కొంతమంది తప్పించుకుంటున్నారని ట్రంప్ ప్రభుత్వం చెప్పడం ఇది మొదటిసారి కాదు. గత అక్టోబరులో అమెరికా సైన్యం జరిపిన దాడి నుంచి ఇద్దరు తప్పించుకున్నారు. ఆ తర్వాత వారి ఆచూకీని తెలుసుకొని స్వదేశాలకు పంపారు. అదే నెలలో మెక్సికో అధికారులు కూడా విడిగా గాలింపు చర్యలు చేపట్టారు. ఒక వ్యక్తి నీటిలో మునిగి పోయాడని గుర్తించినప్పటికీ అతని ఆచూకీ తెలియరాలేదు.మాదక ద్రవ్యాల రవాణాపై నిఘా వేస్తున్నామన్న పేరుతో అమెరికా ఇటీవలి కాలంలో ఓడలపై ముమ్మరంగా దాడులు చేస్తోంది. గత సెప్టెంబర్ నుంచి కరేబియన్, పసిఫిక్ జలాలలో 30 దాడులు జరిగాయి. కనీసం 110 మంది చనిపోయారు.

## బంగ్లాదేశ్‌లో ఆగని మైనార్టీలపై దాడులు

**హైదరాబాద్ పెన్ పవర్:** బంగ్లాదేశ్ లో మైనార్టీలైనా హిందువులపై దాడుల పరంపర కొనసాగుతోంది. తాజాగా మరో వ్యక్తిపై అతి దారుణంగా దాడి చంపేశారు. డిసెంబర్ 31న దేశంలోని షరియత్‌పూర్ జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. 50 ఏండ్ల వ్యక్తి ఖోకోన్ దాస్ పై ఓ బృందం దాడి చేసింది. పదునైన ఆయుధాలతో గాయపరిచింది. అనంతరం నిప్పటించింది. ఈ దాడిలో ఖోకోన్ దాస్ తీవ్రంగా గాయపడ్డాడు. కాగా, బంగ్లాదేశ్‌లో హిందూ వ్యక్తిపై దాడి జరగడం నెల రోజుల వ్యవధిలో ఇది నాలుగో ఘటన. డిఅంతకుముందు అంటే డిసెంబర్ 18వ తేదీన భాలుకాలో హిందూ వ్యక్తి దీపు చంద్ర దాస్‌ను ఓ గుంపు కొట్టి చంపింది. డిసెంబర్ 30న కూడా మైమెన్‌సింగ్ జిల్లాలోని ఓ వస్త్ర కర్మాగారంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న హిందూ కార్మికుడిని సహోద్యోగి కాల్చి చంపాడు. ఇలా వరుస దాడులతో బంగ్లాదేశ్‌లోని హిందువుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

## ఆ ఒప్పందంపై సంతకం చేయను



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉక్రెయిన్‌కు నష్టం చేసే బలహీన ఒప్పందంపై సంతకం చేయబోనని ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం దేశ ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉక్రేనియన్లు దాదాపు నాలుగేళ్ల యుద్ధంతో అలసిపోయారని చెప్పారు. ఇది రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మన్ ఆక్రమణ కంటే ఎక్కువ కాలమన్నారు. యుద్ధం ముగియాలని ఉక్రెయిన్ కోరుకుంటోందని, లొంగిపోవడానికి సిద్ధంగా లేమని అన్నారు. యుద్ధాన్ని పొడిగించే "బలహీనమైన" శాంతి ఒప్పందంపై తాను సంతకం చేయనని ఆయన స్పష్టం చేశారు. "నా సంతకం ఒక బలమైన ఒప్పందంపై ఉంటుంది, ప్రతి సమావేశం, ప్రతి ఫోన్ కాల్, ప్రతి నిర్ణయం ఇప్పుడు దాని గురించే " అని ఆయన అన్నారు. ఉక్రెయిన్ అంతమైపోయేలాంటి ఒప్పందాన్ని కోరుకోవడం లేదని అన్నారు. గత వారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఫ్లోరిడాలో జరిగిన చర్చల్లో శాంతి ఒప్పందాన్ని రూపొందించామని జెలెన్‌స్కీ తెలిపారు. ఆ శాంతి ఒప్పందం 90 శాతంపై ఆంగీకారం ఉందని, 10 శాతంపై మాత్రమే వ్యతిరేకత ఉందన్నారు. ఆ 10 శాతంలోనే సమస్య అంతా ఉందని, శాంతిని, ఉక్రెయిన్, యూరప్ ప్రజలు ఎలా జీవించాలో నిర్ణయించేది ఆ 10 శాతమేనంటూ చెప్పుకొచ్చారు.

## రష్యా చమురు స్థావరాలపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి

**హైదరాబాద్ పెన్ పవర్:** క్రాస్నోడార్, టాటర్‌స్తాన్ ప్రాంతాల్లోని చమురు స్థావరాలపై ఉక్రెయిన్ దాడులకు దిగింది. దక్షిణ క్రాస్నోడార్ ప్రాంతంలోని ఇలస్కీ చమురు శుద్ధి కర్మాగారంపై ఉక్రెయిన్ డ్రోన్‌లు దాడి చేశాయని రష్యా అధికారులు గురువారం తెలిపారు. టాటార్‌స్తాన్‌లోని అల్మెటీవ్స్క్ నగరంలో చమురు తయారీ కేంద్రాన్ని కూడా డ్రోన్‌లు తాకాయని పేర్కొన్నారు. డ్రోన్ దాడితో మంటలు చెలరేగాయని, అయితే ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని చెప్పారు. అల్మెటీవ్స్క్ నగరంలోని ఇంధన నిల్వ కేంద్రం దెబ్బతిందని, మంటలు చెలరేగాయని స్థానిక గవర్నర్ పేర్కొన్నారు. ఈ నగరం ఉక్రెయిన్‌కి 1,400కి.మీ (869 మైళ్లు) దూరంలో ఉందని అన్నారు. 2025 డిసెంబర్ 25న కూడా రష్యాలోని పలు చమురు నిల్వ స్థావరాలపై దాడి జరిపిన సంగతి తెలిసిందే. రష్యా ఇంధన ఉత్పత్తిని దెబ్బతీసేందుకు ఇటీవలి నెలల్లో ఉక్రెయిన్ ఇంధన మౌలిక సదుపాయాలు లక్ష్యంగా ఉక్రెయిన్ దాడులకు తెగబడుతోందని మాస్కో మేయర్ సెర్గీ తెలిపారు.

# అమెరికా విశ్వసించదగ్గ దేశమేనా!

**హైదరాబాద్ పెన్ పవర్:** స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండే అమెరికాతో భారత్‌కు ఏనాడూ సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెప్పలేం. భారత్ రష్యాకు దగ్గరవడంతో కేవలం చైనాను కట్టడిచేసేందుకు ఒక పావుగా భారత్‌ను ఉపయోగించుకొనే ప్రయత్నం తప్ప భారతదేశ ప్రయోజనాలపట్ల ఆ దేశానికి ఏనాడూ ఆసక్తి లేదు. పైగా, వ్యూహాత్మక, రక్షణ అవసరాలరీత్యా పాకిస్థాన్‌తో అంటకాగుతూ వస్తుంది. మొదటిసారిగా, అణుపరీక్షల అనంతరం ఆంక్షలను సైతం లెక్కచేయకుండా కార్గిల్ యుద్ధం సందర్భంగా అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించి వాజపేయి ప్రభుత్వం అంతర్జాతీయంగా పాకిస్థాన్‌ను ఒంటరి చేయగలిగింది. అమెరికాతో వ్యూహాత్మక సంబంధాల పెంచుకునేందుకు మార్గం ఏర్పచింది. అయితే, మోడీ హయాంలో ఆ ప్రయత్నాలకు గండిపడిందా? అనే అనుమానం కలుగుతుంది. 2025లో జరిగిన పరిణామాలే అందుకు నిదర్శనం. దౌత్యపరంగా, వాణిజ్య ఒప్పందం విషయంలో ఓ విధంగా భారత్‌ను వణికించిందని చెప్పవచ్చు. ఒక విధంగా గతంలో మరే ప్రధాని ప్రయత్నించని విధంగా అమెరికా అధ్యక్షుడిగా వ్యక్తిగతంగా సాన్నిహిత్యం పెంచుకొనే ప్రయత్నం మోడీ చేశారు. ఆయనకు 'అత్యంత సన్నిహితుడు'గా ప్రచారం పొందిన డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టడంతో ఒక విధంగా ఆశావాదంగా ప్రారంభమైన ఈ సంవత్సరం చివరకు ట్రంప్ పేరు చెబితేనే భారతీయులు భయపడే స్థాయికి తీసుకెళ్లింది. 'కొందరి మాదిరిగా కాకుండా, ట్రంప్ నేతృత్వంలోని అమెరికా పరిపాలన గురించి మేము భయపడటం లేదు. ఇద్దరి మధ్య ఒకే విధమైన ఆసక్తులు అనేకం ఉన్నాయి' అంటూ విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ గత జనవరిలో ప్రకటించారు. అయితే, స్వయంగా జైశంకర్ అమెరికా పర్యటనకు వెళ్లి, ఐదు రోజులపాటు ప్రయత్నం చేసినా ట్రంప్ ప్రమాణస్వీకారంకు హాజరయ్యేందుకు ప్రధాని మోడీకి ఆహ్వానం సంపాదింపలేకపోయారు. అధికారంలోకి రాగానే ట్రంప్ ఏకపక్షంగా భారతీయ వస్తువులపై 25% సుంకాలు విధించడం ద్వారా భారతీయులను దిగ్భ్రాంతికి గురిచేశారు. మరి కొన్ని రోజులకే వాటిని 50 శాతంకు పెంచారు. ట్రంప్ సృష్టించిన తుఫాను మన తీరాలను తాకుతుందని మన విదేశాంగ కార్యాలయం ఏమాత్రం ఊహింపలేకపోయింది. ముఖ్యంగా పహల్గామ్ ఉగ్రవాదదాడి తర్వాత ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు భారతీయులను కలవరంకు గురిచేస్తున్నాయి. ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ రూపంలో కొత్తరూపం దాల్చిన మన పాత ప్రత్యర్థి పాకిస్తాన్‌ను ట్రంప్ దగ్గరకు తీస్తున్న తీరు నమ్మశక్యంగా లేకుండాపోయింది. పహల్గామ్‌కు భారతదేశం సైనికంగా ప్రతీకారం తీర్చుకోకముందే, మునీర్ ట్రంప్ కుటుంబ సంస్థతో భారీ లాభదాయకమైన క్రిప్టోకరెన్సీ ఒప్పందాన్ని తొందరగా కుదుర్చుకున్నాడు. దానితో ట్రంప్ వ్యాపార భాగస్వామి జాచరీ విట్‌కాఫ్ పాకిస్తాన్‌కు ఎగిరి గంతేసాడు. ఆ తరువాత ట్రంప్ మునీర్‌ను గౌరవ అతిథిగా వైట్ హౌస్ లో స్వాగతించడమే కాకూండా, తన గడ్డపై భారతదేశాన్ని నాశనం చేస్తున్నానని గొప్పలు చెప్పుకున్నప్పటికీ, పాకిస్తాన్‌ను చెత్త ట్రక్కుతో, భారత దేశాన్ని మెరిసే మెర్సిడెస్‌తో పోల్చినప్పుడు కూడా అమెరికా నిరసన వ్యక్తం చేయలేదు. ఇండో –పాకిస్తాన్ వివాదాన్ని ముగించినందుకు నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్‌ను నామినేట్ చేస్తున్నట్లు ప్రకటించడం ద్వారా ఆయన హృదయాన్ని మునీర్ నిశ్చయంగా గెలుచుకున్నారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా భారత దౌత్యపరమైన ప్రతిఘటన మీడియా సమావేశాలకు, ప్రకటనలకు మాత్రమే పరిమితమైపోయింది. అందుకు దీటుగా వ్యూహాత్మకంగా తిప్పికొట్టే ప్రయత్నం భారత్ చేయలేకపోయింది. అమెరికాలో ప్రధాని మోడీకి సన్నిహితంగా ఉన్న అనేకమంది బిలియనీర్లు, రాజకీయ–వ్యాపార ప్రముఖులు ఏవ్వరిని ఉపయోగించి ట్రంప్‌ను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరగనేలేదు. మన రాయబారులు, దౌత్యప్రతినిధులు సైతం ట్రంప్ అంతర్గత వలయంలోకి ప్రవేశింపలేకపోతున్నారు. అందుకు విరుద్ధంగా, వైట్ హౌస్‌లో పాకిస్తాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ సహచరుడు అరుదైన–భూమి ఖనిజాల పళ్ళెం పట్టుకుని వెళ్ళాడు. వాటిని అమెరికాకు అప్పగించే ప్రతిపాదన చేయడం ద్వారా తిరుగుబాటు ఎదుర్కొంటున్న బలూచిస్తాన్ ప్రాంతంకు అమెరికా సహాయం అందకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు . ఒకప్పుడు అమెరికాలో మన జాతీయ ప్రయోజనాలు కాపాడటంలో క్రియాశీలంగా వ్యవహరించిన ఎన్ఆర్ఐ ప్రముఖులు ట్రంప్ వలసదారులు లక్ష్యంగా చేసుకోవడంలో ఇప్పుడు మౌనం వహిస్తున్నారు. చివరకు వారు భారత దేశప్రయోజనాల గురించి మాట్లాడటమే కాకుండా, సెలవులలో అమెరికాలో విహారయాత్రకు వెళ్లినా తమ వీసాలను ఎక్కడ రద్దు చేస్తారో అనే భయంతో ఇల్లుదాటి బైటకు రావడం లేదు. అటువంటి అవకాశవాదులు భారత ప్రభుత్వం భుజానవేసుకొని, ప్రవాస భారతీయుల సమ్మేళనాలు అంటూ రాజమర్యాదలు చేస్తుండటం సిగ్గుచేటుగా భావించాలి. ంశ్రీబనీ ఖీవజీట – కోటి ఆశల కొత్త సంవత్సరం ఆపరేషన్ సిందూర సమయంలో రెండు దేశాల మధ్య అణు యుద్ధాన్ని తానే ఆపివేసానని ట్రంప్ ఇప్పటికీ గొప్పలు చెప్పుకొంటున్నారు. ఈ విషయంలో ఆయన 'అహంకారం' దెబ్బతినకుండా భారత్ తెలివిగా వ్యవహరించి ఉంటే ఇన్ని సమస్యలు ఎదురయ్యేవి కావని దౌత్యా నిపుణులు భావిస్తున్నారు. రష్యాపై అమెరికా ఆంక్షలను బేతఖార్ చేస్తూ భారత్ కన్నా చైనా, ఐరోపా దేశాలు ఎక్కువగా దిగుమతులు చేసుకొంటున్నా మాట్లాడని ట్రంప్ కేవలం చమురు చౌకగా వస్తుందని కొంటున్న భారత్‌ను లక్ష్యంగా చేసుకొని, సుంకాలను 50 శాతంకు పెంచేందుకు ఈ 'అహంకారమే' కారణం అని దౌత్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ సమయంలో పాకిస్థాన్‌తో సంప్రదింపులు జరిపిన అమెరికా ఆ దేశాన్ని మందలించి, కాల్పుల విరమణకన్నా గత్యంతరం లేకుండా చేసిందని తెలివిగా చెప్పినా మరో విధంగా ఉండేదా? మన జాతీయ సార్వభౌమత్వాన్ని రాజీపడకుండా చాకచక్యంగా వ్యవహరించే ప్రయత్నం చేయలేదు. అందుకు స్వదేశంలో రాజకీయ ప్రయోజనాలే అడ్డు వచ్చాయా? కొత్త బహుళ ధ్రువ ప్రపంచంలో, భారతదేశం ఒక అసాధారణమైన పాత్ర వహించాల్సి ఉంది. స్నేహపూర్వక సంబంధాలు ఉన్నప్పటికీ, పాకిస్తాన్ ప్రధాన సైనిక సరఫరాదారుగా, మన సరిహద్దు భూభాగంపై శత్రుహక్కుదారుగా చైనా ఒక ప్రధాన ముప్పుగా మిగిలిపోయింది. సుంకాల ఒప్పందంపై అమెరికాతో ప్రతిష్టంభన నెలకొన్నప్పటికీ గత నవంబర్‌లో అన్నికాలాలలోనూ అత్యధిక ఎగుమతులు నెలకొనడంతోపాటు, 2025లో ఆకట్టుకునే ఆర్థిక వృద్ధి నమోదు చేయడం ద్వారా ఈ ప్రతిబంధకాలు తట్టుకోగలననే సంకేతం భారత్ ఇవ్వగలిగింది. అమెరికా, కెనడా వంటి అనేక దేశాలలో భారతీయ విద్యార్థులు, ఉద్యోగం కోసం వెళ్ళినవారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. చివరకు రష్యా, ఉక్రెయిన్ సైన్యాలలో సైతం మోతపూరితంగా చేరి చావుకు తెచ్చుకుంటున్నారు. అయినా, భారత ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహించడం తప్ప ఏమీ చేయలేకపోతున్నది. అన్ని పొరుగు దేశాలతో భారత్ సంబంధాలు ఆందోళనకరంగానే ఉన్నాయి. ఆయా దేశాలలో భారత్ వ్యతిరేకశక్తులు విజృంభిస్తూ ఉండటం, మరోవంక చైనా, పాకిస్థాన్ ప్రాబల్యం వారిపై పెరుగుతూ ఉండటం తీవ్రంగా పరిగణించాల్సిందే. దౌత్యవిధానాలను స్వదేశీ రాజకీయ ప్రయోజనాలతో ముడిపెడుతూ వస్తుండడంతో భారత్ అంతర్జాతీయంగా తీవ్రమైన ఒత్తిడులను ఎదుర్కొంటుందని గుర్తెరగాలి. స్వదేశీ రాజకీయ ప్రయోజనాలకు పరిమితం కాకుండా అంతర్జాతీయంగా భారత్ ప్రయోజనాలు, ప్రతిష్టలను దృష్టిలో ఉంచుకోవాలి. భారతదేశం బహుశా పాకిస్తాన్ నుండి ఈ సందర్భంగా ఒక పాఠం నేర్చుకోవచ్చు. మనం ఒక ప్రతిపాదన చేసామంటే దానిని అమలు చేస్తామని కాదని తెలుసుకోవాలి. తిరుగుబాటుతో నిండిన బలూచిస్తాన్‌లో చమురుకోసం లేదా శాంతియుతంగా ఖనిజాల కోసం తవ్వకాలు విజయవంతంగా చేపట్టడానికి అమెరికానుండి తీవ్రమైన ఒత్తిడులు ఎదురవుతున్నాయి. పాకిస్తాన్ ఆకర్షణీయమైన ఒప్పందాన్ని అందించడంలో చాతుర్యం, సాహసోపేతత్వాన్ని ప్రదర్శించింది. తద్వారా ఆ ప్రాంతంలో తిరుగుబాటుదారులు కట్టడి చేసేందుకు ఎత్తుగడవేసింది. అంతమాత్రం చేత సమీప భవిష్యత్‌లో ఆ ఒప్పందం అమలవుతుందని చెప్పలేం.

# గీత కార్మికులకు కరువైన ఆదరణ!

**హైదరాబాద్ పెన్ పవర్:** సమాజంలో ప్రతి రంగంలో రోజురోజుకూ ఎన్నో మార్పులు చోటుచేసుకుని నవశకానికి నాంది పలుకుతుంటే, ఒక గీతకార్మికుల బతుకుల్లో మాత్రం మార్పు లేకపోవడం బాధాకరం. పాలకులు, ప్రభుత్వా లు మారినా గీతకార్మికుల జీవనవిధానంలో విలక్షణమైన మార్పులు రావడం లేదు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకు పోరాటమే భవితగా ముందుకు సాగుతున్న ఈ సామాజిక వర్గానికి భరోసానిచ్చే వారేవరు? కుటుంబ బాధ్యతలే పరమావధిగా బాధలు ఎన్ని ఉన్నా భరిస్తూ కులవృత్తిని నమ్ముకున్న ఈ కష్టజీవులను ఆదరించే దిక్కేవరు? తరాలు మారుతున్న గీతకార్మికుల తలరాతలు మారడం లేదనడానికి ఎన్నో సంఘటనలు మన ముందు కదలాడుతున్నాయి. రెక్కాడితే కానీ డొక్కాడని వీరి జీవితాలు ప్రతిక్షణం కత్తిమీద సాము లాంటివి. ఆత్మగౌరవం తోడుగా ధైర్యమే దోస్తీగా కులవృత్తి జీవన భృతిగా సాగుతున్న వీరి బతుకులకు రక్షణ కరువైందని చెప్పవచ్చు. అధికారుల, పాలకుల అండతో అగ్రవర్ణాల ఆగడాలతో అమాయకపు గీత కార్మికుల జీవితాలను ఛిన్నభిన్నం చేస్తున్న వారిపై చర్యలు తీసుకునే నాథుడే లేడు. వివిధ కార్యక్రమాల పేర్లతో, వృత్తి పరిరక్షణ ప్రచారం పేరుతో తాటి, ఈతవనాలు పెంచుతామని చెప్తూనే వాటి పర్యవేక్షణ బాధ్యతను గాలికి వదిలేసి గీత కార్మికుల పట్ల పాలకులు నిర్లక్ష్యపు వైఖరిని ప్రదర్శిస్తున్నారు. పంటభూముల్లో ఉన్న తాటి, ఈతచెట్లను కొంత రుసుం చెల్లించి తొలగించుకోవచ్చునే నిబంధన గౌడన్న జీవనోపాధికి బీటలు పారేలా చేస్తున్నది. ప్రమాదవశాత్తు తాటిపైనుండి పడి దుర్మరణం చెందిన గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియా మంజూరు విషయంలో కూడా నిమ్మకునిరెత్తినట్లు ఉండటమే చేస్తుంది. సంవత్సరాలు గడుస్తున్నా కుటుంబంలో ఎవరి తోడు లేక బాధ్యతమైన వ్యక్తి లేక ఎంతో మంది గీత కార్మికుల కుటుంబాలకు ఇప్పటివరకు కూడా ఎక్స్‌గ్రేషియా రాకపోవడం దురదృష్టకరం. ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న ఈత, తాటి వనాలకు రక్షణ దిక్కులేదు. కానీ కొత్తవనాల పెంపు కార్యక్రమాలు రూపొందించడం హాస్యాస్పదం అని చెప్పవచ్చు. దాదాపు నాలుగు సంవత్సరాల ద
క్రితం ఎక్స్‌గ్రేషియా మంజూరు చేస్తే ఇప్పటివరకు బాధిత గీత కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇచ్చిన పాపాన పోలేదు. నిర్లక్ష్యపు నీడలు వెంటాడుతూ నిరుపేద గౌడన్నల జీవితాలు అగమ్యగోచరంగా మారినా ప్రభుత్వాల మనసు మాత్రం మారడం లేదు. బడుగు బలహీన వర్గాల్లో అధిక జనాభా కలిగిన గీత కార్మికుల సంక్షేమానికి ఒక ప్రత్యేకమైన కార్యాచరణ రూపొందించి గౌడ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. గీతకార్మికుల కుటుంబంలో ఉన్న యువతకు ఉపాధి కల్పనకై తాడి టాపర్ బోర్డు ఏర్పాటు చేసి తాటి ఈత సంబంధిత పదార్థాల ఉత్పత్తిని చేపట్టాలి. ప్రకృతి సిద్ధంగా, సహజంగా లభించే కల్లును మార్కెట్‌లో అందుబాటులో ఉంచి వాణిజ్య పరిశ్రమగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలి. తాటి ఈత ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసి గీత కార్మికుల జీవనోపాధికి పటిష్టమైన కార్యక్రమాలు, పథకాలు రూపొందించాలి. వృద్ధులైన గీత కార్మికులకు తగిన మొత్తంలో పింఛన్లు ఇవ్వాలి. తాటి ఈత వనాల పెంపకానికి సంబంధించి మరుగుజ్జు రకానికి చెందిన రకాలపై దృష్టి సారించాలి. ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై పడి మరణించే పరిస్థితిని రూపుమాపడానికి నిర్ణయాత్మక ఆలోచనతో తాడిచెట్టు ఎక్కే యంత్రాలను ప్రభుత్వం తీసుకురావడం జరిగింది. కానీ వాటిని పూర్తిస్థాయిలో రాష్ట్రమొత్తంలో ఉన్న గీత కార్మికులకు అందేలా చర్యలు తీసుకోవాలి. పూర్తిస్థాయిలో అన్ని గ్రామాలకు సేఫ్టీ మోకులను అందించేలా ప్రణాళికలు చేసి నిర్మాణాత్మకమైన శిక్షణ ఏర్పాటు చేయాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి టివిఎస్ మోపెడ్లు కొనుగోలు చేసి ఇవ్వాలి. కుటుంబాలు గడవడం కష్టంగా మారి ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతూ కులవృత్తినే నమ్ముకుని జీవిస్తూన్న, ఎండిన తాటి, ఈత వనాలతో కల్లు రాక నానాఇబ్బందులు పడుతున్నా గీత కార్మికులకు గౌడ స్వయం ఉపాధి సంఘాలు ఏర్పాటుచేసి వారికి ఉపాధి కల్పించాలి. బెల్టుషాపుల దెబ్బకు కల్లు అమ్ముడుపోక ఆర్థికంగా ఇబ్బందులుపడుతున్నా పరిస్థితులను పాలకులు ఆలోచన చేయాలి. ఎన్నోఏళ్లుగా గీతవృత్తినే నమ్ముకుని జీవిస్తున్నా, గీత కార్మికులు చస్తే తప్ప బతకడానికి పథకాలు ఏమీ లేవు. తాటి చెట్లు ఎక్కి కల్లు గీసుకునే గీత కార్మికులు ప్రమాదవశాత్తు పడి మరణిస్తే, శాశ్వత అంగ వైకల్యం పొందిన వారికి ప్రభుత్వం రూ. 5లక్షల బీమా నుండి 10 లక్షల వరకు వర్తింపజేయాలి. గీతవృత్తిని అభివృద్ధి చేసేందుకు సబ్సిడీ పథకాలు రూపొందించడంలో ప్రభుత్వం గౌడ కులస్థులను విస్మరించే పరిస్థితి మారాలి.

## హర్యానాలో వర్క్‌స్లిప్ కుంభకోణం





**హైదరాబాద్ పెన్ పవర్:** బిజెపి పాలిత హర్యానాలో భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. రాష్ట్ర కార్మిక మంత్రిత్వశాఖ నిర్వహణలో నడిచే భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో నకిలీ వర్క్ స్లిప్స్ (వర్క్ రిసీప్ట్స్)తో రూ. 1,500 కోట్ల మేర అవినీతి జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ప్రాథమిక తనిఖీల్లో హిసార్, కైథల్, జింద్, సిర్సా, ఫరీదాబాద్, భివానీ జిల్లాల్లో భారీఎత్తున అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. అన్ని జిల్లాల్లోనూ జిల్లాస్థాయి కమిటీలతో తనిఖీలకు డిప్యూటీ కమిషనర్లు ఆదేశించారు. ముఖ్యంగా 2023 ఆగస్టు నుంచి 2025 మార్చి వరకూ ఆన్‌లైన్‌లో జారీచేసిన అన్ని వర్క్ స్లిప్స్‌ను తనిఖీ చేయాలని నిర్ణయించారు. ఆన్‌లైన్ వ్యవస్థను ప్రారంభించి దోపిడీకి కారణమైన హర్యానా బిజెపి ప్రభుత్వమే అసలు దోషి అని సిఐటియు విమర్శించింది. అవినీతి పేరుతో కార్మికులను వేధిస్తే సహించబోమని, అసలు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ నెల 17, 18 తేదీల్లో మంత్రుల నివాసాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. హర్యానాలో 22 జిల్లాలకుగానూ ఇప్పటి వరకూ 13 జిల్లాలో ప్రాథమిక తనిఖీలు పూర్తయ్యాయి. కర్నాల్, రేవారి, నౌ (మీరట్), మహేంద్రగడ్, గురుగ్రామ్, ఝజ్జర్, పల్వాల్, పానిపట్, రోహ్తక్, సోనిపట్, పంచకుల, సిర్సా, కైథల్ జిల్లాలో ఇవి పూర్తయ్యాయి. ఈ జిల్లాల్లో గత రెండేళ్లలో మొత్తం 5,99,758 వర్క్ రిసీప్ట్స్ జారీ అయ్యాయి. వీటిలో కేవలం 53,249 మాత్రమే సరైనవిగా గుర్తించారు. 5,46,509ను ఇన్‌వ్యాలీడ్‌గా ప్రకటించారు. ఈ జిల్లాల్లో ఈ బోర్డులో 2,21,517 మంది గుర్తింపు పొందిన కార్మికులు ఉన్నారు. వీరిలో 14,240 మందే నిజమైన కార్మికులున్నారని అధికారులు చెబుతున్నారు. 1,93,756 మంది గుర్తింపునకు సంబంధించి ఇచ్చినవన్నీ నకిలీవని తెలిపారు.

## ఢిల్లీని వణికిస్తోన్న చలి

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశ రాజధాని ఢిల్లీని చలి వణికిస్తోంది. ఉష్ణోగ్రతలు పడిపోయాయి. దీంతో ఢిల్లీవాసులు చలికి వణికిపోతున్నారు. శుక్రవారం 9.1 డిగ్రీల సెల్సియస్ కనీస ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని భారత వాతావరణ శాఖ శుక్రవారం వెల్లడించింది. పాలెం, లోధి రోడ్డు ప్రాంతాల్లో 9 డిగీలు, రిడ్జ్ 8.7 డిగ్రీలు, ఇక అయాన్ నగర్‌లో 8.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జనవరి 2 నుంచి 5వ తేదీ వరకు కొన్ని ప్రాంతాల్లో చలిగాలులు వీచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4.5 డిగ్రీలు తక్కువగా ఉన్నప్పుడు కోల్డ్‌వేవ్‌గా ప్రకటిస్తామని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు ఢిల్లీలో గాలి నాణ్యతలు కొంతమేర మెరుగుపడ్డాయి. శుక్రవారం ఉదయం ఎక్యూఐ స్థాయిలు 302గా నమోదయ్యాయని, వీటిని వెరీపూర్ కేటగిరీలో వర్గీకరించినట్లు కేంద్ర కాలుష్యనియంత్రణ మండలి పేర్కొంది.

## ఆందోళనకరంగా జర్నలిస్టుల హత్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచవ్యాప్తంగా జర్నలిస్టుల హత్యలు తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. 2025లో ప్రపంచవ్యాప్తంగా 128 మంది జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఇంటర్నేషనల్ ఫెడరేషన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌జె) ఈ విషయాన్ని వెల్లడించింది. వీరిలో సగం మందికి పైగా జర్నలిస్టులు మధ్యప్రాచ్యంలోనే మరణించటం గమనార్హం. ఈ సంఖ్య 2024తో పోలిస్తే పెరిగిందని ఐఎఫ్‌జె వివరించింది. "ఇది కేవలం గణాంకాలు కావు.. మా సహచరుల కోసం ఇది ప్రపంచస్థాయి రెడ్ అలర్ట్" అని ఐఎఫ్‌జె ప్రధాన కార్యదర్శి ఆంథోనీ బెల్లాంజర్ అన్నారు. ప్రత్యేకంగా పాలస్తీనా ప్రాంతాల్లో పరిస్థితిపై ఐఎఫ్‌జె తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇజ్రాయిల్ ? హమాస్ మధ్య గాజాలో కొనసాగుతున్న యుద్ధంలో 2025లో 56 మంది జర్నలిస్టులు మరణించారని ఐఎఫ్‌జె పేర్కొన్నది. ఇంత చిన్న ప్రాంతంలో, ఇంత తక్కువ సమయంలో ఇన్ని మరణాలు తాము ఎన్నడూ చూడలేదని బెల్లాంజర్ చెప్పారు. భారత్‌తో పాటు యెమెన్, ఉక్రెయిన్, సూడాన్, పెరూ సహా ఇతర దేశాల్లో కూడా జర్నలిస్టులు హత్యకు గురయ్యారు. ఈ దాడులకు బాధ్యులైన వారికి శిక్షలు పడటం లేదని, ఇటువంటి చర్యలను ఖండిస్తున్నామని బెల్లాంజర్ పేర్కొన్నారు. న్యాయం జరగకపోతే.. జర్నలిస్టులను హత్య చేసే వారికి అది ప్రోత్సాహం ఇస్తుందని ఆయన హెచ్చరించారు.

## 2025లో రూపాయి 4.7 శాతం పతనం



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి మారకం విలువ వరుసగా రెండో నెలలోనూ పతనమయ్యింది. డిసెంబరులోనూ నష్టంతో ఈ ఏడాదిని ముగించింది. చివరి నెలలో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ భారత దేశ చరిత్రలోనే 91 స్థాయిని దాటి ఆల్‌టైం కనిష్ట స్థాయిని చవి చూసింది. బుధవారం నాటి ట్రేడింగ్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి 89.87 వద్ద ముగిసింది. ఈ నెలలో స్థూలంగా 0.5 శాతం విలువ కోల్పోయింది. 2025 ఏడాదిలో మొత్తంగా రూపాయి విలువ 4.7 శాతం క్షీణించింది. ఇది గత మూడేళ్లలో నమోదైన అతిపెద్ద వార్షిక పతనం కావడం ఆందోళనకరం. ఈ ఏడాది పొడవునా రూపాయిపై ప్రభావం చూపిన అంశాలే డిసెంబరులోనూ కొనసాగాయి. భారతీయ ఈక్విటీల నుంచి విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులను ఉపసంహరించుకోవడం, దిగుమతిదారులు హెడ్జింగ్‌ను పెంచడం, అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరకపోవడం వంటివి రూపాయి పతనానికి కారణమయ్యాయి. "విదేశీ ఇన్వెస్టర్ల నిరంతర నిధుల ఉపసంహరణ, రక్షణ, చమురు, బంగారం రంగాల నుండి డాలర్ డిమాండ్ అన్నీ రూపాయిపై ప్రభావాన్ని చూపుతున్నాయి," అని ఫిన్‌రెక్స్ ట్రెజరీ అడ్వైజర్స్‌కు చెందిన ట్రెజరీ హెడ్ అనిల్ భన్సాలీ తెలిపారు.

## వెనక్కి తగ్గిన లోక్‌పాల్



**హైదరాబాద్ పెన్ పవర్:** బీఎండబ్ల్యూ కార్ల టెండర్ విషయంలో లోక్‌పాల్ వెనక్కి తగ్గింది. ఒక్కొక్కటి రూ.70 లక్షల విలువైన ఏడు బీఎండబ్ల్యూ కార్ల కొనుగోలుకు టెండర్ ఆహ్వానించడంపై విమర్శలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో లోక్‌పాల్ ఆ కార్ల టెండర్‌ను రద్దు చేసింది. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలను వెల్లడించాయి. లోక్‌పాల్ చైర్మెన్, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఖాన్విల్కర్ సహా ఏడుగురు జ్యుడీషియల్, నాన్-జ్యుడీషియల్ సభ్యుల కోసం కొన్ని నెలల క్రితం లోక్‌పాల్ బీఎండబ్ల్యూ కార్ల టెండర్‌ను ఆహ్వానించింది. అయితే ఎంపికైన విక్రయదారు బీఎండబ్ల్యూ కార్లను నడిపే విధానంపై ఏడు రోజులు తమ డ్రైవర్లకు శిక్షణ ఇవ్వాలని, ఈ ఖర్చును కూడా వారే భరించాలని షరతు విధించింది. దీంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే మోడీ ప్రభుత్వంలో లోక్‌పాల్ పనితీరేంటో తేలిపోయిందని, అవినీతిపై పోరాడాల్సింది పోయి విలాసవంతమైన కార్ల కొనుగోలుకు లోక్‌పాల్ సిద్ధమైందని విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

## న్యూఇయర్ వేళ జొమాటో, బ్లింకిట్ రికార్డు..



**హైదరాబాద్ పెన్ పవర్:** కొత్త సంవత్సరం వేడుకల వేళ జొమాటో, బ్లింకిట్ సేల్స్ దుమ్ము రేపాయి. ఒక్కరోజే బ్లింకిట్, జొమాటోలో దేశవ్యాప్తంగా 75 లక్షలకు పైగా ఆర్డర్లు వచ్చాయి.ఈ విషయాన్ని జొమాటా సీఈఓ దీపిందర్ గోయల్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్ల సమ్మె ఉన్నప్పటికీ డిసెంబర్ 31న ఒక్క రోజే జొమాటో, బ్లింకిట్ లో అత్యధిక ఆర్డర్లు వచ్చాయని చెప్పాడు. 4.5 లక్షలకుపైగా డెలివరీ ప్రతినిధులు దాదాపు 63 లక్షల మంది కస్టమర్లకు 75 లక్షలకు పైగా ఆర్డర్‌లను చేరవేశారని వెల్లడించారు. గిగ్ వర్కర్ల సమ్మె ప్రభావం తమపై ఏ మాత్రం పడలేదని చెప్పారు. ఇదిలా ఉంటే జొమాటో ద్వారా ఫుడ్ డెలివరీ చేస్తే బ్లింకిట్ ద్వారా నిత్యావసరాలను డెలివరీ చేస్తున్నారు. అయితే న్యూఇయర్ కావడంతో ఎక్కువ మంది స్పెషల్ ఫుడ్ తినాలనే కోరుకుంటారు. రెస్టారెంట్లు, హోటళ్లకు వెళ్లే వాళ్లు వెళతారు. కానీ కొందరు ఇంటివద్దనే ఉండి రెస్టారెంట్ ఫుడ్ తినాలనుకుంటారు. మరికొందరు పార్టీలో ఉండి వెళ్లలేక ఆర్డర్ పెట్టుకుంటారు. అలా న్యూఇయర్ వేళ ఆర్డర్లు పెరిగిపోయాయి. ఇక పార్టీ వేళ నిత్యావసరాలు కూడా అవసరమే కాబట్టి బ్లింకిట్ ఆర్డర్లు కూడా పెరిగాయి.

## జీఎస్టీ వసూళ్లు రూ.1.74 లక్షల కోట్లు




**హైదరాబాద్ పెన్ పవర్:** వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు గత నెల డిసెంబర్‌లో రూ.1.74 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2024 డిసెంబర్‌లో 1.64 లక్షల కోట్లుగా ఉన్నట్టు గురువారం విడుదలైన ప్రభుత్వ గణాంకాల్లో తేలింది.దీంతో 6.1 శాతం వృద్ధి కనిపించింది. 2025 నవంబర్‌లో రూ.1.70 లక్షల కోట్లుగా ఉన్నాయి. కాగా, డిసెంబర్‌లో దేశీయ లావాదేవీల నుంచి వచ్చిన స్థూల ఆదాయం 1.2 శాతం పెరిగి రూ.1.22 లక్షల కోట్లకు చేరింది. ఇక దిగుమతైన వస్తూత్పత్తుల ద్వారా వచ్చిన ఆదాయం 19.7 శాతం ఎగిసి రూ.51,977 కోట్లుగా ఉన్నది. అయితే తెలంగాణ సహా 17 రాష్ట్రాల్లో జీఎస్టీ వసూళ్లు క్షీణిస్తుండటంపట్ల కేంద్ర ప్రభుత్వంలో ఒకింత ఆందోళన కనిపిస్తున్నది. దేశీయం టెలికాం రంగ సంస్థ వొడాఫోన్-ఐడియా లిమిటెడ్ (వీఐఎల్)కు అహ్మదాబాద్ సీజీఎస్టీ అదనపు కమిషనర్ కార్యాలయం నుంచి రూ.638 కోట్ల జీఎస్టీ పెనాల్టీ ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు సదరు సంస్థ గురువారం బీఎస్ఈకి తెలియజేసింది. అయితే ఈ ఆదేశాలతో విభేదిస్తున్న వొడా-ఐడియా.. దీనిపై న్యాయపరంగానే ముందుకెళ్తామని చెప్తున్నది.

## కొత్త సంవత్సరంలో బిగ్ షాక్..
## రూ. 111 పెరిగిన సిలిండర్ ధర



**హైదరాబాద్ పెన్ పవర్:** గత కొద్ది నెలలుగా స్థిరంగా ఉంటున్న గ్యాస్ సిలిండర్ ధరలను (ఉజీబ ఇఎశ్రీతినిటవతీ జూతీతిఇవబ) ఆయిల్ కంపెనీలు భారీగా పెంచాయి. నూతన సంవత్సర వేళ వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు పెంచుతూ చమురు మార్కెటింగ్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. నేటి నుంచి (జనవరి 1) అమల్లోకి వచ్చేలా 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ (ఒఖఉ) సిలిండర్ ధరను రూ. 111 పెంచాయి. ఈ పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధర రూ. 1691.50 కి చేరుకుంది. అలాగే రాష్ట్ర రాజధాన హైదరాబాద్ నిన్నటి వరకు 1595.50కి లభించగ.. పెరిగిన ధరతో నేటి నుంచి రూ. 1706. 50 లకు ధరకు అందుబాటులో ఉంది. కేవలం కమర్షియల్ సిలిండర్లనే కాకుండా, 5 కిలోల ఎఫ్‌టిఎల్ (ఈఖఒ) సిలిండర్ల ధరను కూడా రూ. 27 పెంచుతున్నట్లు కంపెనీలు ప్రకటించాయి. ఇదిలా ఉంటే కొత్త సంవత్సరం వేల దేశంలోని సామాన్య ప్రజలకు ఊరటనిస్తూ 14.2 కిలోల గృహ వినియోగ (ఆనీఎవబబితిఇ) ఎల్పీజీ సిలిండర్ల ధరల్లో మాత్రం ఆయిల్ కంపెనీలు ఎటువంటి మార్పు చేయలేదు. కాగా నూతన సంవత్సర ప్రారంభంలోనే వాణిజ్య సిలిండర్ ధరలు పెరగడం హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులపై అదనపు భారం పడింది.

# పెట్రోల్ కన్నా విమాన ఇంధనమే చౌక




**హైదరాబాద్ పెన్ పవర్:** కొత్త ఏడాది ప్రారంభం రోజే విమానయాన కంపెనీలకు కేంద్రం బంఫర్ ఆఫర్ ప్రకటించింది. విమానాలకు ఉపయోగించే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఎటిఎఫ్) ధరలను భారీగా తగ్గించింది. సాధారణ ప్రజలు ఉపయోగించే పెట్రోల్, వాహనాలు ఉపయోగించే డీజిల్ కంటే జెట్ ఇంధనాన్ని మరింత చౌకగా మార్చడం గమనార్హం. మరోవైపు వాణిజ్య వంట గ్యాస్ ధరను పెంచింది. ఢిల్లీలో ఎటిఎఫ్ ధర కిలోలీటర్‌పై (1000 లీటర్లు) రూ.7,353.75 తగ్గించి రూ.92,323.02కి కోత పెట్టింది. దీంతో లీటర్‌పై రూ.7.35 తగ్గించి రూ.92.32గా ప్రకటించినట్లయ్యింది. ఇది విమానయాన సంస్థలకు భారీ లాభాలను చేకూర్చనుంది. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.107.41గా ఉండగా.. విజయవాడలో రూ.109.63గా ఉంది. పెట్రోలుతో పోల్చితే విమానాలకు ఉపయోగించే ఎటిఎఫ్ కారుచౌకగా ఉండటం విశేషం. అంతర్జాతీయ మార్కెట్‌లో పెట్రో ధరలు తక్కువగా ఉన్నప్పటికీ, సర్ ఛార్జీలతో సామాన్యులపై కేంద్రప్రభుత్వం భారం మోపుతోంది. పెట్రోల్ వ్యయం పెరగడంతో మధ్యతరగతి, దిగువ తరగతి ప్రజల నెలవారీ ఖర్చులు పెరుగుతున్నాయి. ఇతర విద్యా, ఆరోగ్యం, ఆహారానికి కేటాయించే ఖర్చులను తగ్గించుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఐదు కిలోల ఫ్రీ ట్రేడ్ ఎల్‌పిజి (ఎఫ్‌టిఎల్) సిలిండర్లపై కూడా ధరలను కేంద్రం రూ.27 పెంచింది. కొత్త ఏడాదిలో హోటల్ యజమానులకు మోడీ సర్కార్ భారీ షాక్ ఇచ్చింది. 19 కిలోల వాణిజ్య సిలిండర్ గ్యాస్‌పై ధరను రూ.111 పెంచింది. దీంతో ఢిల్లీలో ఈ సిలిండర్ ధర రూ.1,681.50కి చేరింది. హైదరాబాద్‌లో దీని ధర రూ.1,912.50 ఉంది. విజయవాడలో గతంలో రూ.1750గా ఉన్న ధర ఇప్పుడు రూ.1862కి, విశాఖలో రూ.1650గా ఉన్న ధర రూ.1751కి పెరిగింది. కర్నూలులో రూ.1775గా ఉన్న ధర రూ.1885.50కి చేరుకుంది. వాణిజ్య ఎల్‌పిజి ధరల్లో చేసిన సవరణల కారణంగా వాటిపై ఆధారపడుతూ వ్యాపారాలు చేసుకునే వారిపై ఆర్థిక భారం పడనుంది. ఆ భారాన్ని యాజమాన్యాలు అంతిమంగా వినియోగదారులపైనే నెట్టుతాయి. హడావిడిగా పనుల కోసం, ఉద్యోగాల కోసం వెళ్లి, బయట ఆహారం కొనుగోలు చేసే సామాన్యులు గ్యాస్ ధరల పెంపుతో మరింత అధికంగా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

# పెరుగనున్న సిగరెట్టు, బీడీ, పాన్ మసాలా ధరలు..

**హైదరాబాద్ పెన్ పవర్:** సిగరెట్లు, బీడీలు, పాన్ మసాలా ధరలు పెరుగనున్నాయి. వాటిపై జీఎస్టీతోపాటు అదనపు సెస్ విధించనున్నారు. ఫిబ్రవరి 1 నుంచి పెరిగిన ధరలు అమలులోకి వస్తాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. పొగాకు ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకం, పాన్ మసాలాపై కొత్త సెస్సు విధించనున్నట్లు పేర్కొంది. కాగా, ఫిబ్రవరి 1 నుంచి పాన్ మసాలా, సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులపై 40 శాతం జీఎస్టీ విధిస్తారు. బీడీలపై 18 శాతం జీఎస్టీ ఉంటుంది. అలాగే పొగాకు, సంబంధిత ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకం కూడా విధిస్తారు. పాన్ మసాలాపై ఆరోగ్య, జాతీయ భద్రతా సెస్సు ఉంటుంది. గతంలో ఉన్న కంపన్‌సేషన్ సెస్సు స్థానంలో ఈ కొత్త సెస్సు అమలు చేస్తారు. మరోవైపు చూయింగ్ టొబాకో, జర్దా సెంటెడ్ టొబాకో, గుట్కా ప్యాకింగ్ యంత్రాలు (సామర్థ్య నిర్ధారణ, సుంకం వసూలు) నియమాలను కూడా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ బుధవారం వెల్లడిచింది. దీంతో వాటి తయారీ మెషిన్స్‌పై కూడా అదనపు పన్నులు ఉంటాయి. అయితే పాన్ మసాలా తయారీపై కొత్తగా ఆరోగ్య, జాతీయ భద్రతా సెస్, పొగాకుపై ఎక్సైజ్ సుంకాన్ని విధించడానికి అనుమతించే రెండు బిల్లులను డిసెంబర్‌లో పార్లమెంట్ ఆమోదించింది.



# కథా సాహిత్యంలో కొత్త ఒరవడులు అల్లం రచనలు

**హైదరాబాద్ పెన్ పవర్:** సాధారణంగా కథల పాఠకులు కొత్తదనం కోరుకుంటారు. ఇది గ్రహించే కథా రచయితలు పాఠకులను తమ కథల పట్ల ఆసక్తిని పెంపొందించే కథా వస్తువులను ఎంచుకునే ప్రయత్నం చెయ్యడం కద్దు. దీనిని పూర్తిగా అర్థం చేసుకుని తెలుగు కథా రచనలో కొత్త ఒరవడిని సృష్టించా డు అల్లం శేషగిరిరావు. ఎన్నో కథలు వచ్చాయి కాని తెలుగులో వేట గురించి కథలు అల్లం శేషగిరిరావు రాసేవరకూ రానేలేదని చెప్పవచ్చు. అడవిలోని క్రూర మృగాల ప్రాకృతిక ధర్మాలను కథా వస్తువుగా తీసుకున్నా , మానవ మానసిక స్థితిని నిగూఢంగా సూచించడమే ఆయన రచనా లక్ష్యంగా ప్రస్ఫుటం అవుతుంది. మామూలుగా కాక, అయన కథలను విశ్లేషణా పరంగా ఆలోచనకు భూమిక చేశాడు. అల్లం శేషగిరిరావు (డిసెంబర్ 9, 1934 – జనవరి 3, 2000) ప్రముఖ తెలుగు కథా రచయిత. 1934, డిసెంబర్ 9 న ఒడిశా (నాటి ఒడిషా) లోని గంజాం జిల్లాలో జన్మించాడు. శేషగిరి రావు కథలు తమాషాకు రాసిన కథలు కావు. జీవితం గురించి రచయిత తీవ్ర ఆలోచన, లోతుగా పరిశీలన, జీవితంలో అన్యాయాల గురించి ఆందోళన, వేటకథల నేపథ్యంగా అర్థం చేసుకోవచ్చు. వేటాడడం, అడవి మృగాల స్వభావం, సహజ లక్షణం. ప్రాకృతిక ధర్మం కూడా. సంస్కార వంతుడైన మనిషి మృగంలా మారి బలహీనుణ్ని పీక్కుతినే అరాచ కత్వం, బడుగుల మూలుగులను పీల్చేసే బలాధికృతల గురించి నిక్కచ్చిగా, నిజాయతీగా మాట్లాడే కథలు తెలుగులో తక్కువ కనిపిస్తాయి. అలాంటి అరుదైన కథలను పాఠకులకు అందించి, ఆలోచింప చేసిన రచయిత అల్లం శేషగిరిరావు. ఆయన తెలుగు హెమింగ్వే గా లబ్ధ ప్రతిష్టులు. తరాలు మారినా, కాలంలో మార్పు వచ్చినా, అలనాటి నుండి సామాజిక పరిస్థితులలో ఆశించిన మార్పు రానేలేదు. బలవంతుడు, బలహీనునిపై, నిస్సహాయతలపై ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది. నాగరిక ముసుగులో దాగిన ఈ అమానవీయతను ఉన్నది ఉన్న ట్టుగా చూపెడతాయి శేషగిరిరావు కథలు. ఇవి మనిషిలోని జంతు ప్రవృత్తిని తేటతెల్లం చేస్తాయి. ఎవరూ చూడని కొత్తకోణాన్ని దర్శించేందుకు వీలు కల్పిస్తాయి. కొత్త ఎత్తుగడ, ఉత్కంఠ, ఆసక్తికర ముగింపూ, అటవీ సంబంధ విశేషాలూ, జంతువుల సహజ ప్రవర్తనాస్థితి.. ఇలాంటి అంశాలతో ఈ కథలు పాఠకులను ఆగకుండా చదివింప జేస్తాయి.రైల్వేలో గుమాస్తాగా పని చేసిన అల్లం శేషగిరిరావు సమాజాన్ని నిశితంగా పరిశీలించిన తీరు అమోఘం, అద్వితీయం, అస మానం. మనుషుల ధోరణు ల్లోని మానవీయ, అమానవీయ కోణాలను, అంతః సంఘర్షణలను అయన అర్థం చేసుకని కథా వస్తువులుగా మలచు కున్నాడు. తాను చేసుకున్న అవగాహనకు తనదైన భాష, శిల్పాలను
జోడించి పాఠకుల హృదయాలను అంది పుచ్చుకునే అద్భుత కథలు రాశాడు. 1980లో 'మంచి ముత్యాలు' పేరిట పుస్తక రూపంలో వచ్చాయి. మరిన్ని కథలను కలుపుకుని 'అరణ్య ఘోష'గా వెలువడ్డాయి. ఇటీవల కథా స్రవంతి (అరసం) వారు 'అల్లం శేషగిరిరావు కథలు' పేరిట ఎంపిక చేసిన వాటిని ప్రచురించారు. శేషగిరిరావు రాసినవి తక్కువే. వాటిలోనూ కొన్ని సుదీర్ఘంగా సాగుతాయి. అయితే.. విషయ ప్రాధాన్యం, వైవిధ్యం మూలంగా ఆ నిడివి పాఠకులను అంతగా బాధించదు. 'మృగ తృష్ణ, వఱడు, ది డెత్ ఆఫ్ ఎ మేనిటర్, జాతి కుక్క, పులి చెరువులో పిట్టల వేట, అశ్వమేథం, నరమేథం, చీకటి' తదితరాలు శేషగిరిరావు కథల్లో చెప్పుకో దగినవి. మనిషికి ప్రతిబింబాలు 'వఱడు' కథ 'దర్పణ్ సీరిస్'లో భాగంగా దూరదర్శన్‌లో సింగిల్ ఎపిసోడ్‌గా ప్రసారమైంది. వఱడు లాంటి మనుషులు మన సమా జంలో ఉన్నారని హెచ్చరించిన ఈ కథ, నాటకం గానూ విశేష ఆదరణ పొందింది. వఱడంటే 'ముసలి నక్క' అని నిఘంటు అర్థం. ముసలి నక్కలు వాటంతటవి వేటాడి తినలేవు కదా. దాంతో పగలంతా ఇతర జంతువుల ఉనికిని కనిపెట్టి, రాత్రిపూట పులిని వాటిమీదకి ఉసిగొల్పి చంపిస్తాయి. పులి తినగా మిగిలిన మాంసంతో కడుపు నింపు కుంటాయి. ఈ కథలో మనిషిలో దాగుండే జంతు స్వాభావిక క్రౌర్యాన్ని చూపించాడు. అందుకే ఈ కథకు 'ది డెత్ ఆఫ్ ఎ మేనిటర్'గా పేరు పెట్టాడు. 'మృగ తృష్ణ' కథలో కనిపించేది దుప్పి వేట కాదు. అది అక్షరాలా బలహీనుడి మీద బలవంతుడి వేట మాత్రమే. ఒకరిది విలాసం కొరకు వేట. మరొకరిది జీవిక కోసం పోరుబాట. పులులను దర్జాగా వేటాడి, వాటి చర్మాలను కోటగోడలకి వేలాడ దీసుకునే జమిందారీలను ఏ చట్టాలూ ఏమీ చేయలేవు. చర్యలు తీసుకోనూ లేవు. పిట్టలను కొట్టి బతికే బడుగు జీవులకే అన్ని శిక్షలూ అమలవు తుంటాయి. కన్నీటిగాథ 'చీకటి', ఆరిపోయిన చైతన్యాగ్ని కణాన్ని రాజేస్తుంది.మనిషికి ప్రతిబింబాలు తుపాకీ చప్పుళ్ల తోనూ, కొండగొర్రె అరు పుల తోనూ, పులి గాండ్రిం పుల తోనూ, దగాపడ్డ దీనుడి మూలు గులతో ప్రతిధ్వనించే శేషగిరిరావు ఏ కథ ను తరిచి చూసినా, వేదనా భరిత 'అరణ్య ఘోష' వినపడుతూ ఉంటుంది. ఉదాత్తంగా, గంభీరంగా సాగిపోయే ఈ కథలు ప్రాకృతిక సౌందర్యాన్ని కొత్తకోణంలో చూపిస్తాయి. వైవిధ్య పక్షి జాతుల ప్రస్తావన అక్కడక్కడ మనసును ఉల్లాస పరుస్తుంది. ఉల్లంకి పిట్టలూ, తీతువ పిట్టలూ, పరదలూ, గూడ కొంగలూ, పాముల వార (పెద్ద కొంగలు).. ఇలా పక్షులూ, వాటి గమనాలనూ గమ్మత్తుగా వివరిస్తారు రచయిత. వేటను వర్ణించేటప్పుడు మాత్రం భయానక వాతావరణాన్ని సృష్టిస్తాడు. వేటాడేది మనిషి అయినా, మృగమైనా అడవి రక్తంలో స్నానించినట్టు ఓ భీతావహ చిత్రం కళ్లముందు కదలాడేటట్టు కథని నడిపిస్తాడు. జానెడుపొట్ట కోసం దేవులాడుకొనే దీనుల పోరాటాలు కనిపిస్తాయి. జంతువుల వేట నేపథ్యంలో మనిషిలో దాగుండే క్రూరత్వాన్ని, నాగరిక సమాజంలో మానవ స్వభావాన్ని మృగాలవైపునుంచి చెప్పుకొస్తాయి అల్లం శేషగిరిరావు కథలు. సాహిత్యంలో వీటిని 'వేట కథలు' అన్నారు. కానీ, చారిత్రకంగా వేట అసలు అర్థాన్ని నిర్వచించ గలిగితే ఇవి సమాజంలోని ఆధిపత్య శక్తుల చేతుల్లో నానా హింసలకు గురైన బడుగుల జీవితాలను కళ్లకుకట్టే యాథార్థ గాథలని అర్థమవుతుంది. ఇదే మారణ హోమం ఇప్పటికీ కొనసాగుతుందని ఈ కథలు చదివితే పాఠకులు కచ్చితంగా అంగీకరిస్తారు. బతుకే బలిపీఠంగా మారుతున్న నేటి సమాజంలో ఆధిపత్యం మీద పోరాటం చేసే వారు ఎప్పుడూ ఓడిపోతూనే ఉంటారు. చీకటి కోణాలెన్నింటినో వెలుతురు బాట పట్టించిన అల్లం శేషగిరిరావు తర్వాత, మళ్లీ ఇలాంటి కథలు మళ్లీ రానే రాలేదు.

# పిల్లలు అతిగా ఫోన్ చూస్తున్నారా?



పిల్లల్లో అధిక మొబైల్ వాడకం వ్యసనంగా మారి, వారి శారీరక, మానసిక ఆరోగ్యం, చదువులు, దినచర్యలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. 'టెక్స్ట్ నెక్', కళ్ల అలసట, నిద్రలేమి వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రస్తుత కాలంలో చాలా మంది ఫోన్ చేతికి ఆరో వేలిగా మారిపోయింది. పెద్దలతో పాటు చిన్న పిల్లలు కూడా ఫోన్‌ను విపరీతంగా వాడుతున్నారు. ఈ అతి వాడకం పెద్దల కంటే పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. శారీరకంగా మానసికంగా వారిని ఇబ్బందికి గురి చేస్తుంది. మీ పిల్లలు కూడా అతిగా ఫోన్ చూస్తుంటే వారిని వెంటనే ఆ అలవాటు నుంచి దూరం చేయడం ఎలాగో ఇప్పుడు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.. పిల్లలో ఫోన్ చూసే అలవాటు క్రమంగా ఒక వ్యసనంగా మారుతుంది. పిల్లల దినచర్య, చదువు, ఆటలు, సామాజిక కార్యకలాపాలపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. మొబైల్ ఫోన్‌లను అధికంగా ఉపయోగించడం వల్ల పిల్లల శ్రద్ధ, నిద్ర, మానసిక ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుంది. అటువంటి పరిస్థితిలో ఈ అలవాటును ఎలా నియంత్రించాలో, పిల్లలను సమతుల్య, ఆరోగ్యకరమైన దినచర్య వైపు ఎలా ప్రేరేపించాలో అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. మొబైల్ ఫోన్‌లను అధికంగా వాడటం వల్ల శారీరక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మొబైల్ స్క్రీన్‌పై నిరంతరం వేలాడుతూ ఉండటం వల్ల 'టెక్స్ట్ నెక్' వంటి సమస్యలు వస్తాయి, ఇది మెడ, భుజాలు, వెన్నెముకపై చాలా ఒత్తిడిని కలిగిస్తుంది. మొబైల్ ఫోన్‌ల నుండి వెలువడే నీలి కాంతి కళ్ళను అలసటకు గురి చేస్తుంది, వాటిని పొడిగా చేస్తుంది, దృష్టిని బలహీనపరుస్తుంది. రాత్రి ఆలస్యంగా మొబైల్ ఫోన్‌లను వాడటం వల్ల నిద్రలేమి, అలసట మరియు చిరాకు పెరిగే నిద్ర హార్మోన్ 'మెలటోనిన్' ఉత్పత్తి తగ్గుతుంది. గంటల తరబడి ఒకే చోట కూర్చోవడం వల్ల శారీరక శ్రమ తగ్గుతుంది, ఇది ఊబకాయం మధుమేహం వంటి జీవనశైలి వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. మొబైల్ వ్యసనాన్ని అధిగమించాలంటే తల్లిదండ్రులు ముందుగా తమ పిల్లలతో మాట్లాడటం ఉత్తమ మార్గం అని నిపుణులు అంటున్నారు. మొబైల్ ఫోన్‌లను అధికంగా వాడటం వల్ల వారి ఆరోగ్యం, చదువులు, మానసిక అభివృద్ధిపై చెడు ప్రభావం చూపుతుందని పిల్లలకు వివరించడం అవసరం. సమయ పరిమితులను నిర్ణయించడం, మొబైల్ ఫోన్‌ల కోసం ప్రత్యేక సమయాన్ని నిర్ణయించడం, పిల్లలను ఇతర ఆసక్తికరమైన కార్యకలాపాల వైపు ఆకర్షించడం ఉపయోగకరంగా ఉంటుంది. ఆటలు, విహారయాత్రలు, చదువులు, కుటుంబంతో కలిసి చేసే అభిరుచులు మొబైల్ ఫోన్‌ల నుండి దృష్టి మరల్చడానికి సహాయపడతాయి. పిల్లలు మంచి ఉదాహరణను చూడగలిగేలా తల్లిదండ్రులు కూడా మొబైల్ ఫోన్‌ల వాడకాన్ని పరిమితం చేయాలి. క్రమంగా పిల్లలను కొద్దిసేపు మొబైల్ ఫోన్‌లను ఉపయోగించడం అలవాటు చేసుకోండి.

## శాఖాహారం అధికంగా తీసుకునే దేశం



ప్రపంచంలోనే అత్యధిక శాకాహార జనాభా కలిగిన దేశంగా భారత్ గతేడాదే రికార్డు బద్దలు కొట్టింది. మనదేశంలో రకరకాల మతపరమైన, సాంస్కృతిక, చారిత్రక ప్రాముఖ్యతల కారణంగా ప్రపంచంలోని అన్ని దేశాల్లో కంటే చాలా రెట్లు ఎక్కువగా శాఖాహారుల నిష్పత్తి ఉందని తాజా నివేదికలు వెల్లడించాయి.. భారత్ జనాభాలో దాదాపు 38% నుండి 42% మంది శాఖాహారులు ఉన్నారు. జైన మతం, హిందూ మతం, బౌద్ధమతంలోని అహింస సూత్రాల కారణంగా భారతదేశం శాఖాహారంలో ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంది. దీంతో మన దేశం అత్యధిక శాతం శాఖాహారాన్ని కలిగి ఉన్న దేశాల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఆ తర్వాత స్థానంలో మెక్సికో ఉంది. మెక్సికోలో దాదాపు 19% మంది జనాభా శాఖాహారులు. ఇటీవలి సంవత్సరాలలో ఆరోగ్యం,జంతు హక్కుల గురించి పెరిగిన అవగాహన కారణంగా శాఖాహారం వైపు ఈ దేశం మొగ్గు చూపుతోంది. మాంసాహార అలవాట్లకు ప్రసిద్ధి చెందిన బ్రెజిల్ కూడా మారుతోంది. ఇప్పుడు అక్కడ జనాభాలో దాదాపు 14% మంది శాఖాహారులు ఉన్నారు. ఈ ధోరణి ముఖ్యంగా పెద్ద నగరాల్లో కనిపిస్తుంది. ఇజ్రాయెల్ జనాభాలో దాదాపు 13% మంది శాఖాహారులు ఉన్నారు. 'కోషర్' ఆహార చట్టాలు, 'శాకాహారి' ఉద్యమం ఇక్కడ చాలా ప్రభావవంతమైనవి. టెల్ అవీవ్ నగరాన్ని ప్రపంచంలోని 'శాకాహారి రాజధాని' అని కూడా పిలుస్తారు. తైవాన్‌లోనూ దాదాపు 12% నుండి 13% జనాభా శాఖాహారులు. బౌద్ధమతం ప్రభావం, కఠినమైన ఆహార-లేబులింగ్ చట్టాల కారణంగా అధిక సంఖ్యలో శాఖాహారులు ఉన్నారు.



## అల్లంతో ఆరోగ్య ప్రయోజనాలు

శీతాకాలంలో చాలా మంది అనేక అనారోగ్య సమస్యలకు గురవుతుంటారు. ముఖ్యంగా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు తొందరగా జబ్బుల బారినపడుతుంటారు. శీతాకాలంలో రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల జీర్ణ సమస్యలు, జలుబు, ఫ్లూ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల శీతాకాలంలో రోగనిరోధక శక్తి పెంచే ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలి. వాటిలో ముఖ్యంగా అల్లం తీసుకుంటే ఎంతో మంచిది. శీతాకాలంలో చాలా మంది అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారు. ముఖ్యంగా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు తొందరగా జబ్బుల బారినపడుతుంటారు. శీతాకాలంలో రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల జీర్ణ సమస్యలు, జలుబు, ఫ్లూ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల శీతాకాలంలో రోగనిరోధక శక్తి పెంచే ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలి. వాటిలో ముఖ్యంగా అల్లం తీసుకుంటే మంచిది. అల్లంను టీలో మాత్రమే కాకుండా ఇతర ఆహార పదార్థాలకు కూడా జోడించి ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చు. అల్లం శీతాకాలంలో వచ్చే జీర్ణ సమస్యల నుంచి మనల్ని కాపాడుతుంది. వ్యాధులతో పోరాడే సామర్థ్యాన్ని పెంచుతుంది. అంతేగాక, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. అందుకే మధుమేహ వ్యాధి బాధితులకు ఇదొక వరమనే చెప్పాలి. అయితే, డయాబెటిస్ ఉన్న వ్యక్తులు అల్లంను మితంగా తీసుకోవాలి. రోజుకు 5 గ్రాములు తీసుకుంటే చాలు. రక్తంలో చక్కరను నియంత్రిస్తుంది. ఇన్సులిన్ ఉత్పత్తిని నియంత్రిస్తుంది. ఇక అల్లంలో ఉండే యాంటీఆక్సిడెంట్స్ లక్షణాలు పుష్కలంగా ఉండటంతో మన రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శీతాకాలంలో వ్యాధుల బారిన పడకుండా కాపాడుతుంది. వృద్ధులు తగినంత అల్లం తీసుకోవడం వారి ఆరోగ్యానికి మంచిది. శరీర నొప్పులు, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు వంటి సమస్యల నుంచి వృద్ధులకు ఉపశమనం కలిగిస్తుంది. అల్లం కలిపిన మిశ్రమాలు తీసుకోవడం వల్ల శరీరం శక్తివంతం అవుతుంది. వ్యాధులు రాకుండా అడ్డుకుంటుంది.

## రైస్ ఇలా వండితే.. అన్నం తిన్నా షుగర్ కంట్రోల్!




డయాబెటీస్ ఉన్న వారు, అధిక బరువు ఉన్నవారు అన్నం తినాలంటేనే భయపడిపోతుంటారు. ఎందుకంటే అన్నంలో కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉంటాయి. దీనిని తినడం వల్ల బాడీలో కార్బోహైడ్రేట్స్ పెరిగి బరువుతో పాటు షుగర్ లెవల్స్ కూడా పెరుగుతాయని వాళ్ల టెన్షన్.. అయితే అలాంటి వారికే ఈ గుడ్‌న్యూస్.. అన్నం తిన్నా మీ బాడిలో షుగర్‌ను కంట్రోల్ ఉంచుకోవచ్చు. అన్నం తినడం వల్ల శరీరంలో కార్బోహైడ్రెడ్స్ పెరుగుతాయన్న మాట వాస్తవమే.. కానీ కొన్ని చిట్కాలను పాటించడం వల్ల వాటి పెరుగుదలను నెమ్మది చేయవచ్చు. దానితో పాటు మీ బాడిలో షుగర్‌తో పాటు బరువు పెరగడాన్ని కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు. ఇందుకు మీరు పెద్దగా కష్టపడాల్సి అవసరం కూడా లేదు. కేవలం అన్నం వండేటప్పుడు అందులో కొన్ని బెండకాయలు, లేదా బంగాళాదుంపలు వేసుకుంటే సరిపోతుంది. దీని వల్ల అన్నం త్వరగా అవ్వడమే కాకుండా ఔషధంలా మారుతుంది. ఇది మేము చెబుతున్న విషయం కాదు.. వైద్య నిపుణులు డాక్టర్ సంతోష్ జాకోబ్ తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో పేర్కొన్నాడు. ఇలా అన్నంలో బెండకాయలు కలిపి వండుకొని తినడం ద్వారా మన బాడిలో షుగర్ లెవల్స్ పెరగకుండా కంట్రోల్‌లోనే ఉంటాయట.

## కొంపముంచిన హెయిర్-స్ట్రెయిటెనింగ్

హెయిర్ స్ట్రెయిటెనింగ్ చికిత్స చేయించుకున్న 17 ఏళ్ల బాలిక తీవ్రమైన మూత్రపిండాల వైఫల్యంతో ఆసుపత్రిలో చేరిందని షారే జెడెక్ ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. మరో 25 ఏళ్ల మహిళ కూడా ఒక నెల క్రితం హెయిర్ స్ట్రెయిటెనింగ్ వల్ల మూత్రపిండాల వైఫల్యంతో బాధపడిందని.. వైద్యులు అధ్యయనంలో తెలపడం కలకలం రేపింది. జుట్టు అందంగా కనిపించాలనే.. హెయిర్ స్ట్రెయిటెనింగ్ కూడా ఓ యువతిని ఆసుపత్రి పాలు చేసింది.. మీరు వింటున్నది నిజమే.. హెయిర్ స్ట్రెయిటెనింగ్ చికిత్స కోసం వెళ్లిన ఓ 17 ఏళ్ల అమ్మాయి మూత్రపిండాల వైఫల్యంతో ఆసుపత్రిలో చాలా కాలం పాటు చికిత్స తీసుకుంది.. ఈ షాకింగ్ ఘటన ఇజ్రాయెల్ దేశంలో చోటుచేసుకుంది.. దీనికి సంబంధించిన షాకింగ్ నిజాలను జెరూసలేంలోని షారే జెడెక్ మెడికల్ సెంటర్ వివరించింది. హెయిర్ స్ట్రెయిటెనింగ్ చికిత్స చేయించుకున్న 17 ఏళ్ల బాలిక తీవ్రమైన మూత్రపిండాల వైఫల్యంతో ఆసుపత్రిలో చేరిందని షారే జెడెక్ ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. మరో 25 ఏళ్ల మహిళ కూడా ఒక నెల క్రితం హెయిర్ స్ట్రెయిటెనింగ్ వల్ల మూత్రపిండాల వైఫల్యంతో బాధపడిందని ఆసుప్రతి వర్గాలు తెలిపాయి. హెయిర్ స్ట్రెయిటెనింగ్ తర్వాత.. వాంతులు, తలతిరుగుడు, తీవ్రమైన తలనొప్పితో బాధపడుతున్న ఆ బాలిక, పిల్లల విభాగంలో చాలా రోజులుగా తీవ్రమైన మూత్రపిండాల వైఫల్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందింది.. ఆమె సోమవారం డిశ్చార్జ్ అయ్యింది.. ఆసుపత్రిలోని పీడియాట్రిక్ నెఫ్రాలజీ ఇన్స్టిట్యూట్‌లో అవుట్ పేషెంట్ ఫాలో-అప్‌ను కొనసాగిస్తుందని తెలిపారు. 2023లో ఆసుపత్రి నెఫ్రాలజీ ఇన్‌స్టిట్యూట్ అధిపతి ప్రొఫెసర్ లిండా షావిత్.. ఇన్‌స్టిట్యూట్‌లోని వైద్యుడు డాక్టర్ అలోన్ బెనాయ ప్రచురించిన ఒక అధ్యయనంలో 14 నుండి 58 సంవత్సరాల వయస్సు గల మహిళలు ఎటువంటి అంతర్లీన వైద్య పరిస్థితులు లేకుండా తీవ్రమైన మూత్రపిండ వైఫల్యంతో దేశవ్యాప్తంగా అత్యవసర విభాగాలకు వచ్చిన 26 కేసులను నమోదు చేశారు.వారందరూ గ్లైయాక్సిలిక్ యాసిడ్ కలిగిన జుట్టు (హెయిర్ స్ట్రెయిటెనింగ్) నిఠారుగా చేసే చికిత్సలు చేయించుకున్నారని పరిశోధకులు కనుగొన్నారు. అప్పటి నుండి ఆరోగ్య మంత్రిత్వ శాఖ గ్లైయాక్సిలిక్ యాసిడ్ కలిగిన డజన్ల కొద్దీ సౌందర్య ఉత్పత్తుల లైసెన్స్‌లను రద్దు చేసింది. "జుట్టును నిఠారుగా చేసే ఉత్పత్తులను నేరుగా తలకు లేదా జుట్టు మూలాలకు పూయకూడదు.. కానీ వాటి నుండి కనీసం 1.5 సెంటీమీటర్ల దూరం ఉంచాలి" అని షవిత్ చెప్పారు. "అదనంగా, హెయిర్‌డ్రెస్సర్లు, క్లయింట్లు ఇద్దరూ ఉత్పత్తిని వేడి చేయకుండా జాగ్రత్త వహించాలి.. తయారీదారు సూచనల ప్రకారం మాత్రమే వ్యవహరించాలి." అని సూచించారు. కాగా.. అందంగా కనిపించాలని హెయిర్ స్ట్రెయిటెనింగ్ చేసుకుంటున్న చాలామందికి ఇదో హెచ్చరికగా పేర్కొన్నారు.



## హ్యాంగోవర్ నుండి బయటపడలా?



నూతన సంవత్సర దినోత్సవాన్ని జరుపుకోవడం, సంగీతం, స్నేహితులతో పార్టీ చేసుకోవడం, రాత్రి ఆలస్యంగా ఆనందించడం అన్నీ నూతన సంవత్సరంలో భాగం. కానీ తరచుగా, ఈ వేడుక తర్వాత మరుసటి రోజు ఉదయం, తలనొప్పి, అలసట, గందరగోళం, వికారం, బలహీనత వంటి సమస్యలు తలెత్తుతాయి. దీనిని మనం సాధారణంగా హ్యాంగోవర్ అని పిలుస్తాము. సరికొత్త లైటింగ్స్?, లేజర్ షోలు, టపాసుల మోతలు, కేక్ కటింగ్‌లు, యువత ఉత్సాహం నడుమ కొత్త సంవత్సరం 2026 ఘనంగా మొదలైంది. నూతన సంవత్సర వేడుకలు అంతటా అట్టహాసంగా జరిగాయి. ప్రపంచ దేశాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ నూతన సంవత్సర సంబరాలు అంబరాన్నంటాయి. కొత్త ఆశలు, ఆశయాలతో హ్యాపీ న్యూ ఇయర్ అంటూ 2026కి ఘన స్వాగతం పలికారు. బాణసంచా కాంతి వెలుగుల్లో హైదరాబాద్? వంటి నగరాలు శోభాయమానంగా కాంతులీనుతున్నాయి. నూతన సంవత్సర దినోత్సవాన్ని జరుపుకోవడం, సంగీతం, స్నేహితులతో పార్టీ చేసుకోవడం, రాత్రి ఆలస్యంగా ఆనందించడం అన్నీ నూతన సంవత్సరంలో భాగం. కానీ తరచుగా, ఈ వేడుక తర్వాత మరుసటి రోజు ఉదయం, తలనొప్పి, అలసట, గందరగోళం, వికారం, బలహీనత వంటి సమస్యలు తలెత్తుతాయి. దీనిని మనం సాధారణంగా హ్యాంగోవర్ అని పిలుస్తాము. హ్యాంగోవర్ కు ఖచ్చితమైన నివారణ సమయం అని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. దాని లక్షణాలు 24 గంటల వరకు ఉంటాయి. అయితే, ఈ సమయంలో, మీరు కొన్ని సరళమైన, ప్రభావవంతమైన చర్యలను అనుసరించడం ద్వారా మిమ్మల్ని మీరు బాగా అనుభూతి చెందవచ్చు. నూతన సంవత్సర పార్టీ తర్వాత హ్యాంగోవర్ నుండి బయటపడటానికి మీకు సహాయపడే ఐదు చిట్కాలను తెలుసుకుందాం. ఆల్కహాల్ శరీరాన్ని డీహైడ్రేట్ చేస్తుంది. అంటే శరీరం పూర్తిగా డీహైడ్రేట్ అవుతుంది. ఇది హ్యాంగోవర్‌లకు అతిపెద్ద కారణాలలో ఒకటి. మీరు ఉదయం నిద్రలేచిన వెంటనే నిండు వాటర్ బాటిల్‌ను నింపి నీరు త్రాగండి. కొబ్బరి నీళ్లు, నిమ్మరసం లేదా తాజా పండ్ల రసం కూడా ప్రయోజనకరంగా ఉంటాయి. హ్యాంగోవర్‌ను వదిలించుకోవడానికి మళ్ళీ ఆల్కహాల్ తాగడం సరైన మార్గం కాదని గుర్తుంచుకోండి. ఇది మీ పరిస్థితిని మరింత దిగజార్చవచ్చు. హ్యాంగోవర్ సమయంలో కడుపు సున్నితంగా మారుతుంది. భారీ, కారంగా లేదా వేయించిన ఆహారాలు హానికరం కావచ్చు. టోస్ట్, బిస్కెట్లు, గంజి లేదా క్రాకర్స్ వంటి సరళమైన, తేలికైన ఆహారాలు రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేయడంలో, కడుపును ఉపశమనం చేయడంలో సహాయపడతాయి. అదనంగా, కూరగాయల సూప్ కోల్పోయిన ఉప్పు, పొటాషియంను తిరిగి నింపుతుంది. తలనొప్పి లేదా శరీర నొప్పులు తీవ్రంగా ఉంటే, ఓవర్-ది-కౌంటర్ నొప్పి నివారణ మందులు కొంత ఉపశమనం కలిగించవచ్చు. కానీ వాటిని జాగ్రత్తగా వాడండి. ఆస్ప్రిన్, ఇబుప్రోఫెన్ కడుపు చికాకును పెంచుతాయి. ముఖ్యంగా శరీరం ఇప్పటికే మద్యం ప్రభావంలో ఉంటే.. పారాసెటమాల్‌ను మద్యంతో లేదా వెంటనే తీసుకోవడం వల్ల కాలేయం తీవ్రంగా దెబ్బతింటుంది. మందులు తీసుకునే ముందు జాగ్రత్త అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. నిద్ర శరీరానికి అత్యుత్తమ వైద్యం. వీలైతే, మీ నూతన సంవత్సర వేడుక తర్వాత రోజు విశ్రాంతి తీసుకోండి. తగినంత నిద్ర పొందండి. దీర్ఘమైన, గాఢమైన నిద్ర శరీరానికి కోలుకోవడానికి సమయం ఇస్తుంది. హ్యాంగోవర్ లక్షణాలను క్రమంగా తగ్గిస్తుంది. తరచుగా, మీరు మేల్కొన్నప్పుడు, తలనొప్పి, అలసట చాలా వరకు పోతాయి. హ్యాంగోవర్ అనేది తక్షణమే నయం అయ్యేది కాదని అర్థం చేసుకోవడం ముఖ్యం. శరీరం కోలుకోవడానికి సమయం కావాలి. కాబట్టి, మీరు అతిగా శ్రమించకండి, పని లేదా బాధ్యతలను కొంతకాలం వాయిదా వేయకండి మరియు మీ శరీరం ఇచ్చే సంకేతాలను వినండి.

# బ్యాటింగే సన్ రైజర్స్ బలం.. లివింగ్ స్టోన్ రాకతో కమ్మిన్స్ సేన ప్లేయింగ్ 11 అదిరింది





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026లో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు ప్లేయింగ్ 11పై ప్రస్తుతం తెలుగు క్రికెట్ ఫ్యాన్స్ ద ృష్టి నెలకొంది. జట్టులో ఎలాంటి పవర్ హిట్టర్ లు ఉన్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బౌలింగ్ లో అంత బలంగా కనిపించకపోయినా బ్యాటింగ్ లో మాత్రం దుమ్ములేపుతారు. దుర్భేధ్యమైన బ్యాటింగ్ తో ప్రత్యర్థులను దడ పుట్టించిన సన్ రైజర్స్ జట్టులో ఇంగ్లాండ్ విధ్వంసకర వీరుడు లియామ్ లివింగ్ స్టోన్ సన్ రైజర్స్ జట్టులో చేరడంతో కమ్మిన్స్ సేన మరింత పటిష్టంగా కనిపిస్తోంది. ఐపీఎల్ 2026 కి ముందు సన్ రైజర్స్ హైదరాబాద్ ప్లేయింగ్ 11 ఎలా ఉండబోతుందో ఇప్పుడు చూద్దాం..

ఐపీఎల్ 2026 మినీ ఆక్షన్ లో లివింగ్‌స్టోన్ ను సన్ రైజర్స్ హైదరాబాద్ రూ.13 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేశారు. మంగళవారం (డిసెంబర్ 16) అబుదాబి వేదికగా జరుగుతున్న మినీ వేలంలో మొదట అన్ సోల్డ్ గా మిగిలిపోయిన ఈ ఇంగ్లాండ్ వీరుడు.. చివర్లో భారీ ధరకు అమ్ముడుపోయాడు. దీంతో ఇప్పుడు సన్ రైజర్స్ ఫ్యాన్స్ తమ జట్టు ప్లేయింగ్ 11 ప్రకటిస్తున్నారు. ఓపెనర్లుగా ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ ఉన్నారు. హెడ్, అభిషేక్ 2026 ఐపీఎల్ లో మోస్ట్ డేంజరస్ ఓపెనింగ్ జోడీ. మూడో స్థానంలో సూపర్ ఫామ్ లో ఉన్న టీమిండియా క్రికెటర్ ఇషాన్ కిషాన్ బ్యాటింగ్ చేయనున్నాడు. టీమిండియా ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి నాలుగో స్థానంలో బరిలోకి దిగుతాడు.

క్లాసన్, లివింగ్ స్టోన్ రూపంలో మిడిల్ ఆర్డర్ బలంగా కనిపిస్తోంది. గత సీజన్ లో సత్తా చాటిన అనికేత్ వర్మ ఏడో స్థానంలో బ్యాటింగ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. హర్షల్ పటేల్, జయదేవ్ ఉనాద్కట్, పాట్ కమ్మిన్స్ ఫాస్ట్ బౌలర్లుగా ఉండడం ఖాయం. ఏకైక స్పిన్నర్ గా జీషాన్ అన్సారీ జట్టులో ఉంటాడు. ఫాస్ట్ బౌలర్ శివమ్ మావి ఇంపాక్ట్ ప్లేయర్ గా ఆడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత రెండు సీజన్ లలో బ్యాటింగ్ లో పరుగుల వరద పారించిన హైదరాబాద్ జట్టుకు లివింగ్ స్టోన్ చేరడంతో ఈ సారి తమ జట్టు 350 పైగా కొడుతుందని ఫ్యాన్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. జట్టులో టాప్-6 బ్యాటర్లు అందరూ కూడా అంతర్జాతీయ క్రికెట్ ఆడిన వారే కావడం విశేషం.

**సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేయింగ్ 11 (అంచనా):**

ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషాన్, నితీష్ కుమార్ రెడ్డి, హెన్రిచ్ క్లాసన్, లియామ్ లివింగ్ స్టోన్, అనికేత్ వర్మ, ప్యాట్ కమ్మిన్స్,హర్షల్ పటేల్, జయదేవ్ ఉనాద్కట్, జీషాన్ అన్సారీ, శివమ్ మావి (ఇంపాక్ట్)

**ఐపీఎల్ 2026 సన్‌రైజర్స్ హైదరాబాద్ పూర్తి జట్టు:**

లియామ్ లివింగ్‌స్టోన్: రూ. 13 కోట్లు
జాక్ ఎడ్వర్డ్స్: రూ.3 కోట్లు
సలీల్ అరోరా: రూ.1.50 కోట్లు
శివం మావి: రూ.75 లక్షలు
శివాంగ్ కుమార్: రూ.30 లక్షలు
షకీబ్ హుస్సేన్: రూ.30 లక్షలు
ఓంకార్ తుకారాం తర్మలే: రూ.30 లక్షలు
అమిత్ కుమార్: రూ.30 లక్షలు
ప్రఫుల్ హింజ్: రూ.30 లక్షలు
క్రెయిన్స్ ఫులేట్రా: రూ.30 లక్షలు
పాట్ కమ్మిన్స్ (కెప్టెన్
ట్రావిస్ హెడ్,అభిషేక్ శర్మ, అనికేత్ వర్మ
ఆర్. స్మరన్, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్
నితీష్ కుమార్ రెడ్డి, హర్ష్ దుబే, కమిందు మెండిస్
హర్షల్ పటేల్, బ్రైడాన్ కార్స్, జయదేవ్ ఉనద్కట్
ఎషాన్ మలింగ, జీషన్ అన్సారీ

# పాకిస్థాన్‌తో పాటు ఆ మూడు జట్లు సెమీస్‌కు వెళ్తాయి.. దిగ్గజ క్రికెటర్ జోస్యం



**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 టీ20 వరల్డ్ కప్ ను భారత్, శ్రీలంకలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. టోర్నమెంట్ లో భాగంగా తొలి మ్యాచ్ ఫిబ్రవరి 7న పాకిస్తాన్- నెదర్లాండ్ మధ్య జరగుతుంది. వరల్డ్ కప్ కు నెల సమయం మాత్రమే ఉంది. ఇప్పటికే టీమిండియాతో పాటు మరికొన్ని జట్లు వరల్డ్ కప్ కు తమ స్క్వాడ్ ను ప్రకటించేశాయి. వరల్డ్ కప్ చరిత్రలో తొలిసారి 20 జట్లు పోటీ పడుతుండడంతో ఈ మెగా టోర్నీకి భారీ హైప్ నెలకొంది. ఈ వరల్డ్ కప్ లో సెమీ ఫైనల్ కు చేరుకునే జట్లు ఏవో పాకిస్థాన్ దిగ్గజ పేసర్ వసీం అక్రమ్ తన అంచనా చెప్పాడు.

**పాకిస్థాన్:**

వసీం అక్రమ్ తమ సొంత దేశం పాకిస్థాన్ సెమీస్ కు చేరుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశాడు. 2009 తర్వాత పాకిస్థాన్ వరల్డ్ కప్ ఫైనల్ కు చేరుకోవడంలో విఫలమైంది. ఈ సారి కూడా అండర్ డాగ్ గా బరిలోకి దిగుతుంది. సల్మాన్ అఘా కెప్టెన్సీలోని పాకిస్థాన్ పర్వాలేదనిపించేలా ఉంది. సూపర్-8 కు చేరుకోవడం ఈజీ అయినప్పటికీ టాప్-4 లో నిలవడం కష్టమనే చెప్పుకోవాలి. 2007లో ఫైనల్ కు చేరుకున్న పాకిస్థాన్.. 2009లో తొలిసారి టీ20 వరల్డ్ కప్ టైటిల్ గెలుచుకుంది.

**ఇండియా:**

అక్రమ్ భారత జట్టు సెమీస్ కు వెళ్తుందని అంచనా వేశాడు. టీ20 వరల్డ్ కప్ టీమిండియా హాట్ ఫేవరేట్ గా బరిలోకి దిగనుంది. సొంతగడ్డ కావడం.. జట్టు బలంగా ఉండడం.. గత రెండేళ్లుగా పొట్టి ఫార్మాట్ లో ఒక్క సిరీస్ కూడా ఓడిపోకుండా జైత్రయాత్ర కొనసాగించడం లాంటి అంశాలు టీమిండియా ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నాయి. స్థాయికి తగ్గట్టు ఆడితే సూర్యసేన ఫైనల్ కు చేరుకోవడం పెద్ద కష్టం కాకపోవచ్చు.

**ఆస్ట్రేలియా:**

మిచెల్ మార్ష్ కెప్టెన్సీలోని ఆస్ట్రేలియా జట్టు సెమీస్ కు చేరుకుంటుందని అక్రమ్ జోస్యం చెప్పాడు. ఇటీవలే వరల్డ్ కప్ కోసం ప్రకటించిన ఆస్ట్రేలియా టీ20 స్క్వాడ్ పటిష్టంగా కనిపిస్తోంది. ఇండియా తర్వాత ఫేవరేట్ గా ఈ టోర్నీలో అడుగు పెడుతోంది. అంచనాలు అందుకుంటే ఆసీస్ కు టాప్-4లో నిలవడం పెద్ద కష్టం కాకపోవచ్చు. ఐసీసీ టోర్నీల్లో బలమైన రికార్డ్.. ఆసీస్ కు ఊరటనిస్తోంది. 2021లో టీ20 వరల్డ్ కప్ గెలుచుకున్న ఆసీస్ మరో టైటిల్ పై కన్నేసింది.

**సౌతాఫ్రికా:**

అక్రమ్ చెప్పిన నాలుగు జట్లలో సౌతాఫ్రికా కూడా ఉంది. సఫారీలు సెమీస్ కు చేరుకుంటాయని ఈ పాక్ దిగ్గజం అంచనా వేశాడు. చివరిసారిగా జరిగిన టీ20 వరల్డ్ కప్ లో సౌతాఫ్రికా రన్నరప్ గా నిలిచింది. ఇప్పటివరకు ఐసీసీ టీ20 వరల్డ్ కప్ గెలుచుకొని సౌతాఫ్రికా జట్టు తొలిసారి ఆ కలను సాకారం చేసుకోవాలని ఆరాటపడుతుంది. మార్కరం కెప్టెన్సీలోని సౌతాఫ్రికా జట్టు పటిష్టంగా కనిపిస్తోంది.

**ప్లేయింగ్ 11 అదిరింది**

ఈసారి ఈ మెగా టోర్నీలో 20 జట్లు తలపడనున్నాయి. భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, యూఏఈ, ఒమన్, వెస్టిండీస్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే, ఐర్లాండ్, ఇంగ్లాండ్, నెదర్లాండ్స్, ఇటలీ, నేపాల్, పాకిస్థాన్ జట్లు టోర్నమెంట్ లో భాగం కానున్నాయి.

భారత్‌లో జరిగే మ్యాచ్ లు 5 స్టేడియాల్లో జరుగుతాయి. అహ్మదాబాద్, దిల్లీ, కోల్‌కతా, చెన్నై, ముంబయి స్టేడియాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఇక శ్రీలంక లో 3 వేదికల్లో నిర్వహించనున్నారు. ప్రారంభ, ఫైనల్ మ్యాచ్‌లు అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో నిర్వహించనున్నారు.

# న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు పాండ్య, బుమ్రా ఔట్.. కారణమిదే!

**హైదరాబాద్ పెన్ పవర్:** జనవరి 11 నుంచి న్యూజిలాండ్ తో జరగబోయే మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్ కు టీమిండియా స్టార్ ప్లేయర్స్ హార్దిక్ పాండ్య, జస్ప్రీత్ బుమ్రా దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇద్దరూ ప్రస్తుతం పూర్తి ఫిట్ గా ఉన్నప్పటికీ వన్డేలకు రెస్ట్ ఇవ్వాలని బీసీసీఐ భావిస్తోంది. 2026 ఫిబ్రవరిలో టీ20 వరల్డ్ కప్ కు ముందు పని భారం ద ృష్టిలో ఉంచుకొని పాండ్య, బుమ్రాలను కేవలం టీ20 మ్యాచ్ లనే ఆడించాలనే ఆలోచనలో బీసీసీఐ ఉన్నట్టు సమాచారం. వన్డేలకు దూరంగా ఉన్నా.. కివీస్ తో జరగబోయే ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ కు వీరిద్దరూ అందుబాటులో ఉండడం గ్యారంటీ.

**పాండ్యకు గాయాల బెడద:**

ఆసియా కప్ లో ఫైనల్ కు ముందు మోకాలి గాయంతో ఇబ్బంది పడిన పాండ్య పాకిస్థాన్ తో జరిగిన తుది సమరానికి దూరమయ్యాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో ఆ తర్వాత జరిగిన ఆసీస్ సిరీస్ కు అందుబాటులో లేడు. సర్జరీ నుంచి తప్పించుకున్న పాండ్య ఇటీవలే సౌతాఫ్రికాతో జరిగిన 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ ఆడి అదుతేంగా రాణించాడు. వరుస గాయాలు పాండ్యను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఆల్ రౌండర్ గా పాండ్య సేవలు టీమిండియా చాలా కీలకం. టీ20 వరల్డ్ కప్ ముగిసేవరకు బీసీసీఐ పాండ్యను కేవలం టీ20లకే పరిమితం చేయనున్నారు. దీంతో వన్డే సిరీస్ ఆడకపోయినా టీ 20 సిరీస్ లో కనిపించనున్నాడు.


**బుమ్రాకు రెస్ట్:**

ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్ ఆడిన బుమ్రా.. ఆ తర్వాత సౌతాఫ్రికాతో రెండు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ఆడాడు. రెండో టెస్ట్ ముగిసిన వెంటనే వన్డే సిరీస్ కు రెస్ట్ తీసుకున్న బుమ్రా ఆ తర్వాత సౌతాఫ్రికాతో జరిగిన 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ ఆడాడు. ప్రస్తుతం భారత జట్టులో బుమ్రా ప్రధాన బౌలర్. ఇండియాలో జరగబోయే ఈ మెగా ఈవెంట్ బుమ్రా ఆడడం చాలా కీలకం. పని భారం కారణంగా బుమ్రాకు రెస్ట్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఫాస్ట్ బౌలర్ ను వరల్డ్ కప్ ముందు వన్డేలు ఆడిస్తే బుమ్రా అలసిపోతారు. కాబట్టి వన్డేలకు బుమ్రాను ఆడించి బీసీసీఐ రిస్క్ చేయాలని భావించడం లేదు.

ఇండియా, న్యూజిలాండ్ జట్ల మధ్య జనవరి 11న తొలి వన్డే జరగనుంది. వడోదర ఈ మ్యాచ్ కు ఆతిథ్యమిస్తోంది. కొత్త సంవత్సరంలో టీమిండియా ఆడబోయే తొలి సిరీస్ ఇదే కావడంతో ఈ మెగా సిరీస్ కు భారీ హైప్ నెలకొంది. సొంతగడ్డపై జరుగుతుండడంతో ఈ సిరీస్ లో భారత జట్టు హాట్ ఫేవరేట్ గా బరిలోకి దిగుతుంది. మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్ తర్వాత టీమిండియా 5 టీ20 మ్యాచ్ ల సిరీస్ ఆడుతుంది.



# సుకుమార్ సినిమాకు చరణ్ టార్గెట్?





టాలీవుడ్ లో ఉన్న టాలెంటెడ్ అండ్ స్టార్ డైరెక్టర్లలో సుకుమార్ కూడా ఒకరు. తన సినిమాలతో ఆడియన్స్ ను మెప్పించే సుకుమార్ పుష్ప, పుష్ప2 సినిమాలతో దేశ వ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ ను సొంతం చేసుకున్నారు. ఈ రెండు సినిమాల కోసం సుకుమార్ తన కెరీర్లో చాలా సమయాన్నే వెచ్చించారు. టైమ్ తీసుకున్నా సరే దానికి తగ్గ ఫలితాన్ని ఆ సినిమాలతో సుకుమార్ అందుకున్నారు.

**సుకుమార్ మూవీ కోసం రెడీ అవుతున్న చరణ్**

అల్లు అర్జున్ తో పుష్ప, పుష్ప2 సినిమాలు చేసి మంచి డిమాండ్ ఏర్పరచుకున్న సుకుమార్ తన తర్వాతి సినిమాను మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తో చేయడానికి రెడీ అవుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వచ్చింది. మరోవైపు చరణ్ కూడా తాను ప్రస్తుతం చేస్తున్న పెద్ది సినిమాను పూర్తి చేసి, సుకుమార్ సినిమాను చేయానికి సిద్ధమవుతున్నారు.

**జులై లేదా ఆగస్టులో మొదలవనున్న షూటింగ్**

సుకుమార్, రామ్ చరణ్ కలయికలో గతంలో రంగస్థలం అనే సినిమా వచ్చి అది బ్లాక్ బస్టర్ గా నిలిచిన సంగతి తెలిసిందే. అలాంటి వారిద్దరి కలయికలో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ మూవీపై అందరికీ విపరీతమైన అంచనాలున్నాయి. చరణ్ కెరీర్లో ఈ ప్రాజెక్టు 17వ సినిమాగా తెరకెక్కుతుండగా, ఈ మూవీ షూటింగ్ జులై లేదా ఆగస్ట్ నెలల్లో స్టార్ట్ అవనున్నట్టు తెలుస్తోంది.

**ఏడాది లోపే పూర్తి చేయాలని టార్గెట్**

అయితే ఈ ప్రాజెక్టు గురించి ఇప్పుడో ఇంట్రెస్టింగ్ అప్డేట్ తెలుస్తోంది. ఈ సినిమాను రామ్ చరణ్ సంవత్సరం లోపే పూర్తి చేయాలనుకుంటున్నారని టాక్ వినిపిస్తోంది. ఏడాది కంటే ఎక్కువ టైమ్ పట్టే సినిమాలను ఇకపై చేయడానికి రామ్ చరణ్ ఆసక్తి చూపడం లేదని, సినిమాలు ఎక్కువ చేయాలనే ఉద్దేశంతోనే చరణ్ ఈ డెసిషన్ తీసుకున్నారని అంటున్నారు. గేమ్ ఛేంజర్ కోసం కెరీర్లో ఎంతో టైమ్ ను వృథా చేసుకున్న చరణ్ ఇకపై అలాంటి తప్పులు చేయకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. అదే నిజమైతే సుకుమార్ సినిమా నెక్స్ట్ ఇయర్ ఆగస్ట్ కు రిలీజయ్యే ఛాన్సుంది. మరి ఈ వార్తల్లో నిజమెంతన్నది తెలియాల్సి ఉంది.

**మార్చి 27న పెద్ది రిలీజ్**

ఆర్సీ17 ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ ను పూర్తి చేసిన సుకుమార్, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ లో బిజీగా ఉన్నారని, ఈ సినిమాలో రుక్మిణి వసంత్ హీరోయిన్ గా నటించనున్నారని టాక్ వినిపిస్తోంది. ఇక పెద్ది విషయానికొస్తే బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీలో జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తుండగా మార్చి 27న పెద్ది ప్రేక్షకుల ముందుకు రానుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965